

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 314

శుక్రవారం 28-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సులువైన లక్ష్యాన్ని కష్టంగా..

తొలి వన్డేలో వెస్టిండీస్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచిన భారత్ - 13లో



లాభాలు ఒకరోజుకే పరిమితం


సెన్సెక్స్ 440 పాయింట్ల నష్టం.. మళ్లీ 19,770 దిగువకు నిఫ్టీ - 13లో



'రెడ్ డైరీ' కాంగ్రెస్‌ను ముంచేస్తుంది

కాంగ్రెస్ నాయకుల అవినీతి రహస్యాలు 'రెడ్ డైరీ'లో ఉన్నాయని.. అదే వారిని ఓడిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఇప్పుడు ఇవ్వాల్సిన నినాదం అవినీతి క్విట్ ఇండియా అని పేర్కొన్నారు.

వివరాలు 6లో ▸



సభలో అదే అలజడి

ప్రధాని మోదీ సభకు వచ్చి మణిపూర్ అంశంపై సమాధానం చెప్పాల్సిందేనని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు హాజరయ్యారు.

వివరాలు 6లో ▸

అపు'రూప' గుర్తింపు!

- ఆళ్లగడ్డ శిల్పాలకు నేషనల్ అవార్డు కోసం ప్రతిపాదనలు
- కర్నూలు జిల్లా చేనేత పట్టు చీరలకు భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం
- ఒకటి, రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపనున్న కలెక్టర్
- ఒక జిల్లా–ఒక ఉత్పత్తి జాతీయ అవార్డుల నోడల్ అధికారిగా హరికృష్ణ



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అవుతున్న ఆళ్లగడ్డ శిల్పాలకు, చేనేత పట్టు చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక జిల్లాకు.. ఒక ఉత్పత్తి కింద అపురూపమైన చేతి వృత్తులకు జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటించనుంది. ఇందుకోసం ఒక్కో జిల్లా నుంచి ఒక్కో ఉత్పత్తిపై ప్రతిపాదనలు పంపాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపడానికి చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణను నోడల్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతారు. అవార్డులకు ఎంపికై తే ఆయా జిల్లా కలెక్టర్లు భారత ప్రధాని నరేంద్రమోదీ ద్వారా జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుంటారు. అవార్డులకు ఎంపికై తే కర్నూలు జిల్లాలో తయారు అవుతున్న చేనేత పట్టు చీరలు, నంద్యాల జిల్లాలో తయారు అవుతున్న శిల్పాలకు భౌగోళిక గుర్తింపు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చేనేత కార్మికుల నైపుణ్యం

కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కృష్ణగిరి, నందవరం తదితర మండలాల్లో చేనేత మగ్గాలపై 2200 మంది పట్టుచీరలు నేస్తున్నారు. ఒక్కొక్కరు సగటున వారానికి రెండు ప్రకారం 4,400 పట్టుచీరలు.. నెలకు 17,600 ఉత్పత్తి చేస్తున్నారు. చీర ధర రూ.5 వేలు ప్రకారం లెక్కకట్టినా వీటి విలువ రూ.8.80 కోట్లు ఉంటుంది. ఈ ప్రకారం ఏడాదికి రూ.100 కోట్లకుపైగా విలువ పట్టుచీరలు ఉత్పత్తి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అవుతున్న పట్టుచీరలను గద్వాల పట్టుచీరల పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. విదేశాల్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రవాసాంధ్రులు, ప్రవాస భారతీయుల మహిళలు వీటిపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. జిల్లా యంత్రాంగం ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి అవార్డుకు చేనేత పట్టుచీరలను ఎంపిక చేసింది. జాతీయ స్థాయి అవార్డు వస్తే భౌగోళిక గుర్తింపు కూడా లభించే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో నోడల్ అధికారి హరికృష్ణ, చేనేత జౌళి శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో జాతీయ స్థాయి అవార్డుల కోసం ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా పంపనున్నారు.

రాతి బొమ్మల సోయగం

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తయారు అవుతున్న రాతి బొమ్మలకు ఇప్పటికే జాతీయ స్థాయిలో పేరు ఉంది. ఇక్కడ శిల్పులు తయారు చేసిన బొమ్మలు దేశం నలుమూలలకు ఎగుమతి అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టలోని దేవతామూర్తుల బొమ్మలు ఆళ్లగడ్డ శిల్పుల చేతుల నుంచి జాలువారినవి కావడం విశేషం. దేశంలోని అనేక గ్రామాల్లో పూజలు అందుకుంటున్న దేవతామూర్తుల విగ్రహాలు ఆళ్లగడ్డ శిల్పులు చెక్కినవే. ఇక్కడ 96 మంది శిల్పులు రాతి బొమ్మలు చెక్కుతున్నారు. ఏడాదికి రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు టర్నోవర్ ఉంటోంది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద నంద్యాల జిల్లా నుంచి ఆళ్లగడ్డ రాతి బొమ్మలను జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ఇప్పటికే నంద్యాల కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తరుపున నోడల్ అధికారి, ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ ప్రతిపాదనలు పంపారు. 'కర్నూలు జిల్లా చేనేత పట్టు చీరలు ప్రసిద్ధి చెందాయి. ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద జాతీయ అవార్డు కోసంప్రతిపాదనలు పంపుతున్నాం. కేంద్రం అమోదిస్తే ఆయా ఉత్పత్తులకు విశేష ప్రాచుర్యం లభిస్తుంది. భౌగోళిక గుర్తింపు కూడా వచ్చే అవకాశం ఉంది' అని నోడల్ అధికారి హరికృష్ణ అన్నారు.

ఫ్యాక్ట్ చెక్



వాస్తవాలకే ఉరి!

- 14 ఏళ్లలో ఒక్క ప్రొఫెసర్ పోస్టునూ భర్తీ చేయని చంద్రబాబు.. 2017–18లో తప్పుల తడకగా నోటిఫికేషన్
- కోర్టు కేసులతో నిలిచిపోయిన నియామకాలు.. ఆ పాపాలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించేలా రామోజీ ఆరాటం
- ఇంటర్ తర్వాత అందరి దృష్టి ఇంజనీరింగ్‌వైపే
- డిగ్రీలో లక్షకు పైగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఉద్యోగాలు
- పీజీలో చేరేందుకు అంతగా ఆసక్తి చూపని విద్యార్థులు


- వివరాలు 3లో

విద్యార్థులకు

'విదేశీ' వరం!

జగనన్న విదేశీ విద్యాదీవెనతో పెద్ద చదువులకు అండగా ప్రభుత్వం

- ప్రపంచంలో అత్యుత్తమ కాలేజీల్లో ఎవరికి సీటు వచ్చినా పథకంతో ప్రయోజనం: సీఎం జగన్
- అలాంటి వర్సిటీల్లో చదవాలంటే చాలా ఖర్చు అవుతుంది
- తల్లిదండ్రులు అప్పుల బారిన పడకుండా.. పిల్లలు బాధ పడకుండా ఫీజుల భారం ప్రభుత్వానిదే
- ఇలా బాసటగా నిలుస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే
- 357 మంది అర్హుల ఖాతాల్లో రూ.45.53 కోట్లను జమ చేసిన సీఎం



జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పేద విద్యార్థులు సైతం ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు అభ్యసించేలా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని రూపొందించినట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పథకానికి పరిమితులు లేకుండా శాచ్యురేషన్ విధానంలో అర్హులందరికీ ప్రయోజనం చేకూరుస్తున్నట్లు చెప్పారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద అర్హులైన 357 మందికి రూ.45.53 కోట్లను ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి

మిగతా 2వ పేజీలో ▶

"జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం విద్యా రంగంలో విప్లవాత్మకమైన అడుగుగా చరిత్రలో నిలిచిపోతుంది. మన పిల్లలు టాప్ సీఈవోలుగా ప్రపంచాన్ని శాసించే ఉద్యోగాలు చేసే స్థాయికి చేరుకుంటారు. ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిన కాలేజీల్లో ఎవరికి సీటు వచ్చినా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పథకాన్ని అమలు చేస్తున్నాం. అలాంటి యూనివర్సిటీల్లో చదవాలంటే చాలా ఖర్చు అవుతుంది. తల్లిదండ్రులు అప్పుల బారిన పడకుండా.. పిల్లలు దిగులు చెందకుండా విదేశాల్లో ఉన్నత చదువులకు అండగా నిలుస్తున్నాం. ఇలా పిల్లలకు బాసటగా నిలుస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'ఈడీ' మిశ్రా పదవీకాలం పొడిగింపు

6లో

నేడు హైకోర్టు సీజే ప్రమాణ స్వీకారం

జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో ప్రమాణం చేయించనున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

హాజరుకానున్న సీఎం జగన్, హైకోర్టు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు

- వివరాలు 2లో



గన్నవరం విమానాశ్రయంలో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి



బలహీనపడిన అల్పపీడనం

5లో

అల్పపీడనం బలహీనపడటంతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టింది. శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



జోరందుకున్న ఖరీఫ్

2లో

ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించడం, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయడంతో పాటు పది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతులంతా జోరు పెంచి ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు.



ఎమ్మెల్యే బొల్లాపై టీడీపీ శ్రేణుల దాడి

3లో

వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడిపై టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాళ్లు, గాజు సీసాలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే గన్‌మెన్ సహా పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు.

క్లుప్తంగా...

30న పీఎస్‌ఎల్‌వీ సీ56 ప్రయోగం



రాకెట్‌ను ఎంఎస్‌టీకి తీసుకొస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈనెల 30వ తేదీ ఉదయం 6.30 గంటలకు సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ56 ప్రయోగాన్ని నిర్వహించనుంది. ఇప్పటికే నాలుగు దశల అనుసంధానం పనులను పూర్తి చేసి రాకెట్‌ను మొబైల్ సర్వీస్ టవర్ (ఎంఎస్‌టీ)కు తీసుకువచ్చారు. అక్కడ ఏడు ఉపగ్రహాలను రాకెట్ శిఖరభాగాన అమర్చి.. హీట్‌షీల్డ్ క్లోజ్ చేసే ప్రక్రియను బుధవారం పూర్తి చేశారు. 29వ తేదీ ఉదయం 6.30 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించనున్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆ సమయాన్ని కొద్దిగా మార్చే అవకాశం కూడా ఉంది. ఈ ప్రయోగం ద్వారా సింగపూర్‌కు చెందిన 422 కిలోల బరువు కలిగిన ఏడు ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు.

‘మణిపాల్’లో రోబోటిక్ సేవలు ప్రారంభం

- జ్యోతి ప్రజ్వలన చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్



జ్యోతి వెలిగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోబోటిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ సేవలను ప్రారంభించారు. మణిపాల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సుదర్శన్ బల్లాల్, వైద్యులతో కలసి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. రోబోటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను గవర్నర్ నజీర్ చేతుల మీదుగా ప్రారంభించాక ఆయనకు రోబోటిక్ పని విధానాన్ని వివరించారు. అనంతరం సుదర్శన్ బల్లాల్ మాట్లాడుతూ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ ద్వారా సర్జన్‌కు మరింత కచ్చితత్వం, నియంత్రణ, చిన్నపాటి గాటు, సర్జరీ సమయంలో రోగికి తక్కువ నొప్పి, తక్కువ రక్తం కోల్పోవడం, సర్జరీ అనంతరం త్వరగా కోలుకోవడం వంటి లాభాలుంటాయని తెలిపారు. ఈ విప్లవాత్మక సర్జికల్ విధానాన్ని ప్రారంభించడం ద్వారా రోగులకు ఎల్లప్పుడు అత్యుత్తమ ఆరోగ్య రక్షణ అందుతుందన్నారు. మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ కంటిపూడి సుధాకర్ మాట్లాడుతూ దేశంలో డాక్టర్ విన్సీ(4వ తరం) సిస్టమ్స్ సర్జికల్ టెక్నాలజీలో అత్యాధునికమైనదని, దీనినే హాస్పిటల్లో నెలకొల్పినట్టు తెలిపారు. హాస్పిటల్ రోబోటిక్ నిపుణులు డాక్టర్ సురేంద్ర జాష్తి, డాక్టర్ వి.ధర్మేంద్ర కుమార్, డాక్టర్ రవి శంకర్ గంజి, డాక్టర్ లక్ష్మీ ప్రసూన ప్రసంగించారు.

112 ‘తూనికల’ కేసులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఎరువులు, హోల్‌సేల్ దుకాణాలు, ప్యాకింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్న వారిపై గురువారం తూనికలు, కొలతల చట్టం ప్రకారం 112 కేసులు నమోదు చేశారు. తూకాల్లో వ్యత్యాసం, సరైన వివరాలు ముద్రించకపోవడాన్ని ఎక్కువగా గుర్తించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, భీమవరం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురంలో తనిఖీలు జరిగాయి.

తెలంగాణ

తెలంగాణ హైకోర్టు జడ్జిగా జస్టిస్ సామ్ కోషి ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

64.9 సెంటీమీటర్ల వర్షం

సాక్షి, హైదరాబాద్: కుండపోత, కుంభవృష్టి కాదు.. ఆకాశానికి చిల్లులు పడ్డాయేమో అనిపించేట్టుగా అత్యంత భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్రాన్ని ముంచెత్తాయి. రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో వానలు పోటెత్తాయి. ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో 24 గంటల వ్యవధిలో (బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 వరకు) ఏకంగా 64.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లపైన, మరో 200 ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లపైన భారీ వర్షాలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. భూపాలపల్లిలోని మోరంచవాగు ఉధృతికి గ్రామం పూర్తిగా నీట మునగడంతో.. అక్కడి వారిని రక్షించడానికి హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపట్టారు.

ఆశల సాగుకు శ్రీకారం

- రుతుపవనాల ఆలస్యంతో సీజన్ ప్రారంభంలో కాస్త కలవరం
- విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జోష్ పెంచిన రైతులు
- సాగుకు ముందే పెట్టుబడిసాయం, బీమా పరిహారం చెల్లింపు
- సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలు. ఇప్పటికే 23 లక్షల ఎకరాల్లో పంటలు
- 9.6 లక్షల ఎకరాల్లో వరి, 5.12 లక్షల ఎకరాల్లో పత్తి
- 4 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 1.35 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సాగునీరు విడుదల చేయడంతో పాటు ముందే వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. ఖరీఫ్–2022లో దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం అందించడంతో పాటు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశారు. అవసరమైనన్ని ఎరువులు, పురుగు మందుల నిల్వల్ని అందుబాటులో ఉంచారు. కానీ.. జూన్‌లో రుతుపవనాలు మొహం చాటేయడంతో రైతులు ఒకింత కలవరపాటుకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేయగా.. పది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతులంతా జోరు పెంచి సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు.

సాగుకు ముందే రూ.5,040.43 కోట్ల సాయం

సీజన్‌కు ముందుగానే వైఎస్సార్ రైతు భరోసా కింద 52.31 లక్షల మంది రైతులకు తొలి విడతగా రూ.7,500 చొప్పున రూ.3,923.22 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు ఖరీఫ్–2022లో పంటలు దెబ్బతిన్న 10.20 లక్షల మందికి రూ.1,117.21 కోట్ల బీమా పరిహారాన్ని అందించారు. ఆర్బీకేల ద్వారా 5.73 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు సిద్ధం చేయగా.. ఇప్పటికే 5.15 లక్షల టన్నులను రైతులకు పంపిణీ చేశారు. ఇందులో ప్రధానంగా 1.52 లక్షల టన్నుల వరి, 2.91 లక్షల టన్నుల వేరుశనగ, 39 వేల టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు అందించారు. నాన్ సబ్సిడీ విత్తనాలకు సంబంధించి పత్తి 14.15 క్వింటాళ్లు, మిరప 60 కేజీలు, సోయాబీన్ 137 క్వింటాళ్లను రైతులకు విక్రయించారు. సీజన్‌కు 17.44 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా.. 14.75 లక్షల టన్నులు అందుబాటులో ఉంచారు. ఇందులో ఇప్పటికే 4.59 లక్షల టన్నులు విక్రయించారు. ఆర్బీకేల ద్వారా 5.60 లక్షల టన్నుల సరఫరా లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 1.59 లక్షల టన్నులు నిల్వ చేశారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆర్బీకేల్లో అవసరమైన పురుగుల మందులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు.

23 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

ఖరీఫ్ సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 23 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. 39.70 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 9.62 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇతర పంటల విషయానికొస్తే 5.12 లక్షల ఎకరాల్లో పత్తి, 4 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 4.6 లక్షల ఎకరాల్లో అపరాలు, 1.35 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, పంటలు వేశారు.

9 ఎకరాల్లో వరి వేశా



9 ఎకరాల్లో స్వర్ణ రకం వరి సాగు చేస్తున్నా. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ముదురు దశకు చేరుకున్న పంటకు మేలు చేస్తాయి. మా గ్రామంలో పంట బాగానే ఉంది. కాస్త ఆలస్యంగా నాట్లు వేసిన వారికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. వర్షాలు రెండ్రోజులు తెరిపిస్తే నీరు కిందకు దిగిపోతే నాట్లకు ఇబ్బంది ఉండదు.

– కె.శ్రీనివాసరెడ్డి, పసలపూడి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా


స్వల్పకాలిక రకాలే మేలు



ఈ వర్షాలతో పత్తి, ఆముదం, కంది వంటి పంటలకు ఇబ్బంది ఉండదు. ఇప్పటివరకు నారుమడులు వేయకపోతే మాత్రం బీపీటీ–5204, ఎన్‌ఎల్‌ఆర్–34449, ఎంటీయూ–1153, ఎంటీయూ–1156, ఎంటీయూ–1010, ఐఆర్–64 వంటి స్వల్పకాలిక రకాలను సాగు చేసుకుంటే మేలు. ఉత్తరకోస్తా, కృష్ణాడెల్టాలో వెద పద్ధతిలో సాగు చేసే రైతులు పడిపోని రకాలను ఎంపిక చేసుకోవాలి.

– టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త, వరి పరిశోధనా కేంద్రం, మార్టేరు

ఈ సూచనలు పాటిస్తే మేలు



విత్తిన 15 రోజుల్లోపు నారు మడులు, వెదజల్లిన పొలాలు 3 రోజుల కంటే ఎక్కువ నీట మునిగి ఉంటే మొలక శాతం దెబ్బతినకుండా నీరు తీయగలిగితే ఇబ్బంది ఉండదు. ఒకవేళ మొలక దెబ్బతింటే మాత్రం మళ్లీ నారు ఊడ్చుకోవచ్చు లేదా స్వల్పకాలిక రకాలు సాగు చేసుకోవచ్చు. విత్తిన 15–30 రోజులలోపు ఉన్న పొలాలు 5 రోజుల కంటే ఎక్కువ నీట మునిగితే.. నీరు పూర్తిగా తీసివేసి 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో ఎంవోపీ బూస్టర్ డోస్‌గా వేసుకుంటే వారం రోజుల్లో కొత్త ఆకు చిగురిస్తుంది. నారుమడి కుళ్లకుండా లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బన్‌డిజమ్ మందును పిచికారీ చేసుకోవాలి.

– ఎం.గిరిజారాణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, వరి పరిశోధనా కేంద్రం, మచిలీపట్నం

నేడు హైకోర్టు సీజే ప్రమాణ స్వీకారం

- జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో ప్రమాణం చేయించనున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- హాజరుకానున్న సీఎం జగన్, హైకోర్టు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు డీజీపీ బాగ్చీ

సాక్షి, అమరావతి/గన్నవరం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం జగన్, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకానున్నారు. తేనీటి విందులో పాల్గొన్న అనంతరం జస్టిస్ ఠాకూర్ హైకోర్టుకు చేరుకుని ప్రధాన న్యాయమూర్తిగా కేసుల విచారణను చేపడతారు.

న్యాయమూర్తుల కుటుంబం..

జమ్మూకశ్మీర్‌కు చెందిన జస్టిస్ ధీరజ్‌సింగ్‌ది న్యాయమూర్తుల కుటుంబం. ఆయన తండ్రి, సోదరుడు కూడా న్యాయమూర్తులుగా పనిచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తీర్థసింగ్ ఠాకూర్ సోదరుడే జస్టిస్ ధీరజ్‌సింగ్. న్యాయవర్గాల్లో అత్యంత సౌమ్యుడిగా, వివాదరహితుడిగా, సమర్థుడిగా జస్టిస్ ధీరజ్ సింగ్‌కు పేరుంది. ఇటీవల కాలం వరకు బాంబే హైకోర్టులో నంబర్ టూ స్థానంలో కొనసాగారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన 2026 ఏప్రిల్ 24న పదవీ విరమణ చేస్తారు. ఈలోగా ఆయన పదోన్నతిపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర కోటా నుంచి న్యాయమూర్తులెవ్వరూ లేరు. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాలున్నాయని న్యాయవర్గాలు చెబుతున్నాయి. అలాగే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే)గా వ్యవహరిస్తున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఇకపై నంబర్ 2గా కొనసాగుతారు. త్వరలో ఆయన కూడా వేరే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే అవకాశాలున్నాయని న్యాయవర్గాలు తెలిపాయి.

జస్టిస్ ఠాకూర్‌కు ఘన స్వాగతం

హైకోర్టు సీజేగా నియమితులైన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు గురువారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు సీఎస్ జవహర్‌రెడ్డి, హైకోర్టు ఏసీజే జస్టిస్ శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, అదనపు డీజీపీ బాగ్చీ, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, ప్రొటోకాల్ అధికారి బాలసుబ్రమణ్యం, విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి స్వాగతం పలికారు.

నేడు సీఎం జగన్ విజయవాడ పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేడు విజయవాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకుంటారు. హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

పెట్టుబడులకు విస్తృత అవకాశాలు

- గ్రీన్ హైడ్రోజన్, బయో ఇథనాల్ తయారీ యూనిట్లకు ఆంధ్రప్రదేశ్ అనువైన ప్రాంతం
- జాతీయ సదస్సులో పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్
- పలు కంపెనీలతో చర్చలు



సాక్షి, అమరావతి: పర్యావరణహిత క్లీన్ ఎనర్జీకి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.. గ్రీన్ హైడ్రోజన్, బయో ఇథనాల్ తయారీ ప్లాంట్లను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పెట్రోకెమికల్ కారిడార్ ఏపీలో విస్తరించి ఉందని.. దీన్ని వినియోగించుకుంటూ పెట్టుబడులు పెట్టాలని కోరారు. పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలున్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న మూడో ‘గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్స్ ఇన్ ఇండియా’ సదస్సులో గురువారం ప్రవీణ్ పాల్గొన్నారు. దేశంలోనే అతి పెద్ద పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌ను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కంపెనీలతో చర్చలు జరుపుతోందని చెప్పారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా దీన్ని అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తోందని తెలిపారు. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో పారిశ్రామిక పార్కులు, పోర్టులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. పారిశ్రామిక పార్కుల ద్వారా తక్షణమే పెట్టుబడులు పెట్టడానికి 13,772 ఎకరాల భూమి అందుబాటులో ఉందని వివరించారు. ఇప్పటికే పెట్రో కెమికల్స్ రంగంలో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఓఎన్‌జీసీ, కెయిర్న్, రిలయన్స్, ఆదిత్య బిర్లా, టాటా కెమికల్స్ తదితర దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. బయో ఇథనాల్‌కు ఏపీ హబ్‌గా మారిందని ప్రవీణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ఇప్పటికే 20కి పైగా కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. అనంతరం ప్రవీణ్‌కుమార్.. సౌదీ అరేబియా బేసిక్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్, రీజనల్ హెడ్ జనార్దన్ రామాంజనేయులు, సుర్బానా జురాంగ్ డైరెక్టర్ డెన్నీస్ టాన్, దీపక్ నైట్రేట్ సీఎండీ దీపక్ సీ మెహతా, నయారా ఎనర్జీ ప్రెసిడెంట్ దీపక్ అరోరా, బేయర్ కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వీటిలో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, అనకాపల్లి కలెక్టర్ రవిసుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ‘విదేశీ’ వరం!

▶ మొదటి పేజీ తరువాయి

ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్ ఏమన్నారంటే..

వీసా నుంచి విమాన చార్జీల దాకా..

మంచి కాలేజీలో సీటు వచ్చినా అంత డబ్బులు కట్టే స్థోమత లేని రాష్ట్ర విద్యార్థులకు విదేశాల్లో చదువులకు ఒక వరంలా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం అన్ని రకాలుగా తోడ్పాటునిస్తుంది. ఒక భరోసా కల్పిస్తుంది. ఈ పథకాన్ని అత్యంత పారదర్శకంగా ఎక్కడా వివక్ష, లంచాలు లేకుండా అమలు చేస్తున్నాం. క్యూఎస్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిల్చిన టాప్ 50 విద్యాసంస్థల్లో సీటు సాధించిన వారు ఎవరైనా సరే దరఖాస్తు చేసుకోవచ్చు. శాచ్యురేషన్ పద్ధతిలో ఎంతమంది దరఖాస్తు పెట్టుకున్నా అర్హత ఉంటే సపోర్టు అందిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, ఇతరులకైతే రూ.కోటి వరకు చెల్లిస్తున్నాం. విదేశీ విశ్వ విద్యాలయాలకు వెళ్లే పిల్లలను విమాన చార్జీలు, వీసా చార్జీల దగ్గర నుంచి ప్రతి అడుగులోనూ చేయి పట్టుకుని నడిపిస్తున్నాం.

ప్రపంచాన్ని శాసించే లీడర్లు కావాలని..

ఇలాంటి ప్రపంచ ప్రఖ్యాత కాలేజీలలో మన పిల్లలకు ఎవరికైనా సీట్లు వచ్చినా సామాన్యులు, పేదరికం కారణంగా అంత ఫీజులు కట్టి చదవడం సాధ్యమేనా? అన్నది మొట్టమొదట ఈ పథకం గురించి ఆలోచించినప్పుడు నాకు తట్టిన ఆలోచన. ఇలాంటి కాలేజీలలో మన పిల్లలు చదివి బయటకు వస్తేనే రేపొద్దున ప్రపంచాన్ని శాసించే విధంగా టాప్ మోస్ట్ కంపెనీలలో సీఈవోలుగా రాణించే స్థాయికి చేరుకుంటారు. పెద్దస్థాయిలోకి వెళ్లే అవకాశం వస్తుంది. అందుకే అలాంటి కాలేజీలలో సీట్లు సాధించిన మన పిల్లలను సపోర్టు చేయాలని నిర్ణయించుకున్నాం. అలా చేయకపోతే ఏ రకంగా మన పిల్లలను, మన రాష్ట్రాన్ని లీడర్లుగా చూడగలుగుతాం అన్నది ఈ ఆలోచనలకు ప్రేరణ.

నాడు.. ఇచ్చామంటే ఇచ్చామన్నట్టుగా

గత ప్రభుత్వంలో పరిస్థితి చూస్తే కేవలం రూ.10 లక్షలు.. ఎస్సీ ఎస్టీలకు అయితే రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. ఈ అమౌంట్ ఎక్కడ? మనమిస్తున్న రూ.1.02 కోట్లు, రూ.1.16 కోట్లు, రూ.1.09 కోట్లు, రూ.87 లక్షలు, రూ.70 లక్షలు, రూ.1.32 కోట్లు ఫీజు ఎక్కడ? గతంలో ఏదో ఇచ్చామంటే ఇచ్చామన్నట్టుగా ఇచ్చారు. అక్కడ కూడా ప్రతిదానిలో కోత పెట్టేవారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ దొరికేది కాదు. శాచ్యురేషన్ విధానం లేదు. సిఫార్సులతో ఇచ్చేవారు. అది కూడా సక్రమంగా ఇవ్వకుండా 2016–17 నుంచి దాదాపు రూ.318 కోట్లు బకాయిలు పెట్టి ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు.

నేడు అర్హులందరికీ..

ఈరోజు పథకంలో పూర్తి మార్పులు తీసుకొచ్చి శాచ్యురేషన్ విధానంలో అమలు చేస్తున్నాం. అర్హత కలిగి ఉండి టాప్ 50 కాలేజీలు, 21 ఫ్యాకల్టీలలో దాదాపు 320 కాలేజీల్లో సీట్లు ఎవరికి వచ్చినా వర్తింప చేస్తున్నాం. గతంలో ఆదాయ పరిమితి రూ.6 లక్షలు ఉంటే ఇప్పుడు రూ.8 లక్షల వరకూ పెంచాం. అర్హత ఉంటే చాలు.. రూపాయి లంచం లేకుండా, వివక్షకు తావు ఇవ్వకుండా, పార్టీలతో సంబంధం లేకుండా అత్యంత పారదర్శకంగా మన పిల్లలకు తోడుగా ఉండేలా అడుగులు వేస్తున్నాం.

ఏకైక రాష్ట్రం ఏపీ

ఇదో విప్లవాత్మకమైన అడుగు. రాబోయే రోజుల్లో భావితరాలు ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని గుర్తుంచుకునేలా ఇంతసపోర్టు చేస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. టాప్ 50 కాలేజీలు, 21 ఫ్యాకల్టీలలో దాదాపు 320 కాలేజీలలో ఎవరికి సీటు వచ్చినా పారదర్శకంగా సపోర్టుచేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ఇదొక విప్లవాత్మకమైన అడుగుగా చరిత్రలో మిగిలిపోతుంది. ఈ పిల్లలు గొప్పగా ఎదిగి పెద్ద కంపెనీల్లో సీఈవోలుగా, ఉన్నత స్థాయిలో రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.

నాలుగు విడతలుగా స్కాలర్‌షిప్..


ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని నాలుగు విడతలుగా అమలు చేస్తున్నాం. ఇమ్మిగ్రేషన్ కార్డు పొందిన విద్యార్థులకు వెంటనే తొలివిడత ఇస్తాం. ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల అనంతరం రెండో విడత, రెండో సెమిస్టర్ టెర్మ్ ఫలితాలు విడుదలైనప్పుడు మూడోవిడత, విజయవంతంగా నాలుగో సెమిస్టర్ పూర్తి చేసి మార్క్స్ షీటు అప్‌లోడ్ చేయగానే చివరి విడతను విద్యార్థులకు అందించేలా పథకాన్ని డిజైన్ చేశాం. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ పిల్లలందరికీ ఈ టాప్–50 కాలేజీలలో, 21 ఫ్యాకల్టీలలో ఎక్కడ సీటువచ్చినా దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తుంది. తోడుగా ఉంటామని భరోసా ఇస్తున్నా.

మన రాష్ట్ర ఖ్యాతిని పెంచాలి

మన పిల్లలకు అంతా మంచి జరగాలి. తల్లిదండ్రుల మీద ఎటువంటి భారం పడకూడదు. అప్పుల పాలవుతామనే భయం లేకుండా పిల్లలను గొప్ప చదువులకు పంపించాలి. పిల్లలకు కూడా తమ తల్లిదండ్రులు అప్పులు చేసి పంపారనే బాధ ఎక్కడా ఉండకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించాం. పిల్లలు అక్కడకు (విదేశాలకు) వెళ్లి గొప్పగా చదివి మన రాష్ట్ర ఖ్యాతిని ఇంకా పెంచాలన్న మంచి సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని దేవుడు ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నా.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు

ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమశాఖ) రాజన్నదొర, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నాగార్జున, సీఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నతాధికారులు అనంతరాము, బి.జయలక్ష్మి, శ్యామలరావు, కాంతిలాల్ దండే, ఇంతియాజ్, కె.విజయ, జె.వెంకటమురళి, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విదేశీ విద్యా దీవెన నిధులను బటన్ నొక్కి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



విద్యార్థినిని అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పది ఉత్తమ విద్యాసంస్థల్లో ఫీజులిలా..

ఈ టాప్ 50 కాలేజీల్లో చదవాలంటే ఫీజులు ఎలా ఉన్నాయి? సీటు వచ్చినా సామాన్యుడు, పేదవాడు చదువుకునే పరిస్థితి ఉందా? అన్నది ఒక్కసారి గమనిస్తే.. చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ రూ.1.32 కోట్లు, యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో ఎంఎస్ రూ.1.02 కోట్లు, కార్నిగీ మిలన్ యూనివర్సిటీలో టెపర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ రూ.1.16 కోట్లు, లండన్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ రూ.1.13 కోట్లు, కొలంబియా యూనివర్సిటీలో ఎంఎస్ రూ.1.11 కోట్లు, న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్ రూ.1.09 కోట్లు, ఇన్సీడ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫ్రాన్స్‌లో ఎంబీఏ రూ.88 లక్షలు, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ రూ.68.86 లక్షలు, ఎంఐటీలో స్లోన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రూ.67 లక్షలు, యూసీ బర్క్‌లీలో ఎంఎస్ రూ.61 లక్షల నుంచి రూ.2.06 కోట్ల వరకూ ఫీజులున్నాయి. ఉదాహరణగా పది మంచి విద్యాసంస్థలు గురించి చెప్పాను.

దేవుడి వరంలా..

దళితులు, గిరిజనులు, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలను సీఎం జగన్ దేవుడిలా ఆదుకుంటున్నారు. పేద బిడ్డలకు విదేశీ యూనివర్సిటీలలో ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం కల్పించిన వారిని దేవుడు కాక ఇంకేమనాలి. కొండల్లో నివసించే పిల్లలకు కూడా విదేశాలలో చదువుకునే అవకాశం కల్పించిన సీఎంకు గిరిజన జాతి రుణపడి ఉంటుంది. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న టీడీపీ నేతలు గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలి. మేం చేస్తున్నదేంటి? మీరు చేస్తున్నదేంటి?

– పి.రాజన్న దొర, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

చారిత్రక నిర్ణయం

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఒక చారిత్రక నిర్ణయం. గత ప్రభుత్వంలో చాలా అవకతవకలు జరిగాయి. వాటిని సరిదిద్ది గొప్ప నిర్ణయం తీసుకున్నారు. విదేశాలలో ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదివే అవకాశం కల్పించడం దార్శనికతకు నిదర్శనం. ప్రతిపక్షాలు అభూత కల్పనలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

–మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

కలే అనుకున్నా..

నేను అడ్వకేట్ కుటుంబం నుంచి వచ్చా. బీకామ్ ఎల్ఎల్బీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించా. క్వీన్ మేరి యూనివర్సిటీలో మాస్టర్స్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆర్థిక పరిస్థితుల వల్ల అంత గొప్ప వర్సిటీలో చదవడం కలే అనుకున్నా. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా నాకు రూ.28.10 లక్షలు శాంక్షన్ అయ్యాయి. ఎయిర్ ఫేర్, వీసా చార్జీలు కూడా ఇచ్చారు. టాప్ యూనివర్సిటీలలో చదువుకోవడం గొప్ప అవకాశం. మా మైనార్టీ కమ్యూనిటీ తరపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. భవిష్యత్తులో నావంతుగా సమాజానికి ఉపయోగపడతా.

–షేక్ అమియా మొబీన్, విద్యార్థిని, నెల్లూరు

అదృష్టంగా భావిస్తున్నా

సివిల్ ఇంజనీరింగ్ మదనపల్లెలో చదివా. ఆర్థికంగా వెనకబడిన మా కుటుంబంలో ఎవరూ ఉద్యోగులు లేరు. గొప్ప యూనివర్సిటీలలో చదివే స్థోమత లేదు. లండన్ యూనివర్సిటీలో సీట్ సాధించిన నేను జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా లబ్ధి పొందడం అదృష్టంగా భావిస్తున్నా. పేద విద్యార్థులకు ఇది గొప్ప వరం. చదువు పూర్తయ్యాక దేశానికి సేవ చేసి రుణం తీర్చుకుంటా.

– సుష్మశ్రీ, మదనపల్లె (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌లో సీట్ సాధించిన విద్యార్థిని)

తెలంగాణ ఫ్రెండ్స్ ఆశ్చర్యపోయారు

న్యూయార్క్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతానని కలలో కూడా ఊహించలేదు. ఈ స్కీమ్ గురించి తెలియగానే దరఖాస్తు చేసుకున్నా. ఇలాంటి పథకాన్ని ఎక్కడా చూడలేదు. అండర్ గ్రాడ్యుయేషన్ తెలంగాణలో చదువుకున్నా. నా ఫ్రెండ్స్ ఈ స్కీమ్ గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయారు. తాము కూడా ఏపీలో ఉంటే ఈ స్కీమ్ ద్వారా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం లభించేదని చెప్పారు. నా కోర్సు పూర్తవగానే ఏపీకి వచ్చి అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటానని మాట ఇస్తున్నా.

– చరణ్‌కుమార్‌రెడ్డి, (న్యూయార్క్ యూనివర్సిటీలో సీటు పొందిన విద్యార్థి)

క్లుప్తంగా...

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన ముద్రగడ



ముద్రగడకు జ్ఞాపిక అందజేస్తున్న అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): మాజీమంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం గురువారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిశారు. ఆయన విశాఖలోని మంత్రి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులను ముద్రగడకు మంత్రి అమర్‌నాథ్ పరిచయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పలరామ్మూర్తి, 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీశ్, నాయకులు ఈటి శ్యామలరావు, గొంతిన సత్యవతి, అరికట్ల సూర్యనారాయణ, తోట రాజీవ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు వైఎస్సార్‌సీపీ ఘన నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సాక్షి, అమరావతి: భారత రత్న అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ.. కలాం జీవితం అందరికి ఆదర్శప్రాయమన్నారు. కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలో చాలా సాధారణ జీవితం గడిపారని, విద్యార్థులకు, ప్రజలకు వారి జీవితాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించాలంటే ఏకాగ్రత, సంకల్పం అవసరమని బోధించారన్నారు. నవరత్నాల ప్రోగ్రాం వైస్ చైర్మన్ నారాయణమూర్తి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పార్లమెంట్ ముట్టడి

రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు కాచం గుప్తా

సాక్షి, న్యూఢిల్లీ: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు కాచం కృష్ణమూర్తి గుప్తా తెలిపారు. గురువారం ఢిల్లీలో గుప్తా మీడియాతో మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారంపై కేంద్రం చర్యలు తీసుకోకుంటే వచ్చే ఏడాది జనవరి 16న రాంలీలా మైదానంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టి పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. వన్ నేషన్-వన్ రేషన్-వన్ కమీషన్ విధానం అమలు చేయాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పీయూష్‌గోయెల్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల జాతీయ సలహాదారు, ఎంపీ సౌగత్ రాయ్, సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంభర్ బసు, ఏపీ సంఘం ప్రధాన కార్యదర్శి మునగా గిరిజారావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న తరహాలోనే సీమ ప్రాజెక్టులకు జగన్ ప్రాధాన్యం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి




పుంగనూరు: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంతోనే రాయలసీమలో ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయని, అదే తరహాలో సీఎం వైఎస్ జగన్ ఈ ప్రాంతంలో కరువును పారదోలేందుకు సాగు, తాగునీరు అందించేందుకే మూడు ప్రాజెక్టులు మంజూరు చేశారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో గురువారం తొలిరోజు వార్డుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పానికి 30ఏళ్లుగా నీళ్లు ఇవ్వలేని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టుంటుందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమలో పరిస్థితులు గమనించి ప్రాజెక్టులు మంజూరు చేశారని, పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని చెప్పారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాస్తవాలకే ఉరి!

14 ఏళ్లలో ఒక్క ప్రొఫెసర్ పోస్టూ భర్తీ చేయని చంద్రబాబు

- 2017-18లో తప్పుల తడకగా నోటిఫికేషన్
- కోర్టు కేసులతో నిలిచిపోయిన నియామకాలు
- ఆ పాపాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించేలా రామోజీ ఆరాటం
- ఇంటర్ తర్వాత అందరి దృష్టి ఇంజనీరింగ్‌వైపే
- డిగ్రీలో లక్షకు పైగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఉద్యోగాలు
- పీజీలో చేరేందుకు అంతగా ఆసక్తి చూపని విద్యార్థులు



సాక్షి, అమరావతి: ఉన్నత విద్యకు ఉరి బిగిసింది చంద్రబాబు హయాంలోనే. ఆయన అధికారంలో ఉండగా ఏనాడు విశ్వవిద్యాలయాలను పట్టించుకోలేదు. 14 ఏళ్ల అధికారంలో ఉన్నా ఒక్క ప్రొఫెసర్ పోస్టును కూడా భర్తీ చేయలేదు. 2017-18లో తప్పుల తడకగా ఇచ్చిన నోటిఫికేషన్‌తో కోర్టు కేసులు దాఖలయ్యాయి. ఫలితంగా ఆచార్యుల పోస్టుల భర్తీకి బ్రేక్ పడింది. ఇదీ వాస్తవం. రామోజీరావు మాత్రం ఈనాడు ముసుగులో విష ప్రచారం చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వర్సిటీల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వం చొరవ చూపుతుంటే పదేపదే నిస్సిగ్గుగా అసత్యాలు వల్లె వేస్తున్నారు.

కనీసం ఇంగితం లేకుండా..

ఇది టెక్నాలజీ యుగం.. అత్యధికంగా కంప్యూటర్, కృత్రిమ మేథ రంగాల వైపు అంతా ఆసక్తి చూపుతున్నారు. అందులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఈ మార్పు దేశవ్యాప్తంగా ఉంది. సహజంగానే అన్ని చోట్లా ఈ ప్రభావం తప్పదు! ఈనాడు మాత్రం ఇతర రాష్ట్రాల్లో పీజీ విద్యార్థులు, అడ్మిషన్లు తగ్గిపోవడాన్ని ప్రస్తావించకుండా ఇదంతా ఒక్క ఏపీలోనే జరిగిపోతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తోంది. సెంట్రల్ వర్సిటీల్లో సీట్ల భర్తీ గురించి ఈనాడు ఎందుకు ప్రస్తావించలేకపోయింది? పీజీ కౌన్సెలింగ్ జాప్యానికి, అడ్మిషన్లు తగ్గిపోవడానికి అసలు సంబంధమే లేదు. అన్ని విశ్వవిద్యాలయాల డిగ్రీ పరీక్షలు ఆగస్టుకి పూర్తవుతాయి. అందుకే సెప్టెంబర్‌లో ప్రవేశాల నిర్వహణకు షెడ్యూల్ ఇచ్చారు. డిగ్రీ ఫలితాలు రాకుండానే వర్సిటీలో అడ్మిషన్లు ఎలా ఇస్తారనే జ్ఞానం లేకుండా ఇష్టమొచ్చినట్టు రాయడం ఈనాడుకే చెల్లింది. 2021-22లో తొలిసారిగా పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టు నిర్వహిస్తున్న సందర్భంలో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఉన్నత విద్యా మండలి వీడియోలు, పోస్టర్లను రూపొందించింది. దీన్ని అపహాస్యం చేస్తూ సీట్లు ఇస్తామని విద్యార్థులను బతిమిలాడుతున్నట్టు ఈనాడు కథనాలు ప్రచురించడం హేయం.

నకిలీ అడ్మిషన్లకు అడ్డుకట్ట

టీడీపీ హయాంలో ప్రైవేటు కాలేజీలతో కుమ్మక్కై కాగితాలపై పీజీ అడ్మిషన్లు చూపించి ఫీజురీయింబర్స్‌మెంట్ దోచిపెట్టారు. యూజీలో సున్నా అడ్మిషన్లు ఉన్న కాలేజీల్లో సైతం పీజీకి వచ్చే సరికి నూటికి నూరు శాతం అడ్మిషన్లు ఉండేవి. యూజీలోనే పాఠాలు చెప్పడానికి అధ్యాపకులు లేని చోట పీజీ విద్యను నడిపించేశారు. వీటికి ఇప్పుడు ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వర్సిటీల్లో పీజీ విద్యకు ఫీజురీయింబర్స్ ఇస్తోంది. ప్రతిభ ఆధారంగా అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను అందిస్తోంది.

అప్పుడు ఆర్ట్స్ గుర్తు రాలేదా?

రామోజీ దృష్టిలో దార్శనికుడైన చంద్రబాబు ఆర్ట్స్, హిస్టరీ సబ్జెక్టులే అవసరం లేదని తేల్చి చెప్పినప్పుడు ఆయన ఏం చేస్తున్నట్లు? లేడీ శ్రీరామ్, లయోలా చెన్నై, శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లాంటి విద్యా సంస్థలు రాష్ట్రంలో ఒక్కటైనా లేవని శోకాలు పెడుతున్న రామోజీకి గతంలో ఈ విషయం గుర్తు రాలేదా? అధికారం దూరమైందనే అక్కసుతో అజ్ఞానపు విమర్శలు చేయడం సిగ్గు అనిపించట్లేదా? ద్రవిడ వర్సిటీలో ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు ఇప్పుడేదో కొత్తగా తగ్గిపోయినట్టు ఈనాడు చిత్రీకరించింది. నిజానికి 2014 నుంచే తగ్గిపోయాయా? చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఆ వర్సిటీ ఉంది కాబట్టే నాడు గుర్తు లేదేమో?

పెరిగిన ప్లేస్‌మెంట్లు.. ప్రవేశాలు

గత ప్రభుత్వ హయాంలో సాధారణ డిగ్రీలో 37 వేలుగా ఉన్న క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఇప్పుడు లక్షకు పైగా పెరిగాయి. సాధారణంగా డిగ్రీ తర్వాత ఉద్యోగాల్లో చేరే విద్యార్థులు పీజీపై ఆసక్తి చూపరు. ఇప్పుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు దాదాపు 3 రెట్లు పెరగడంతో సహజంగానే పీజీ అడ్మిషన్లు తగ్గుతాయి. ఉద్యోగం చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో పీజీ చదువుతారు. ఇంటర్ తర్వాత డిగ్రీ కంటే ఇంజనీరింగ్ వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగింది. కారణం.. ప్రభుత్వం విద్యా దీవెన కింద పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద మెస్ చార్జీలను కూడా అందించడమే.

ఇవి మార్పులు కాదా?

గత నాలుగేళ్లలో సీఎం జగన్ దేశంలోనే తొలిసారిగా ఏపీలోని పలు యూనివర్సిటీల్లో సంస్కరణలు తెచ్చారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు, రీజనల్ క్లస్టర్ గ్రూపులను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ఏ కోర్సు అభ్యసించినా విద్యార్థికి కచ్చితంగా ఉపాధి లభించేలా ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఈ ఏడాది డిగ్రీలో కొత్తగా సింగిల్ మేజర్ సబ్జెక్టును ప్రవేశపెట్టింది. వీటికి తోడు 100కిపైగా మైనర్ సబ్జెక్టుల్లో విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నైపుణ్య కోర్సులు, ఇంటర్న్‌షిప్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను తీసుకొచ్చింది. ప్రపంచ స్థాయి మేటి వర్సిటీల్లో ఉన్న నాలుగేళ్ల కోర్సును నూతన జాతీయ విద్యా విధానంతో అనుసంధానం చేసి విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రణాళికలు ఈనాడుకు కనపడవా?

యూజీసీ చర్యలూ తప్పేనా?

యూజీసీ సైతం సెంట్రల్ వర్సిటీలకు కామన్ ఎంట్రన్స్ టెస్టు నిర్వహిస్తోంది. తెలంగాణ కూడా స్టేట్ వర్సిటీలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. చాలా రాష్ట్రాల్లో వర్సిటీలు ఇదే పద్ధతి అవలంబిస్తున్నాయి. మరి రామోజీకి తాను నివాసం ఉంటున్న తెలంగాణలోని వర్సిటీలు కనిపించట్లేదు కానీ ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలపై మాత్రం వల్లమాలిన ప్రేమ కురిపిస్తున్నారు. ఇది కడుపు మంటతో వచ్చిన కపట ప్రేమే కదా! గతంలో ఒక విద్యార్థి వివిధ విశ్వవిద్యాలయాలకు విడివిడిగా ఎంట్రన్స్ టెస్టులు రాయాల్సి వచ్చేది. ప్రతి వర్సిటీకి ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఒకే టెస్టుతో అర్హత సాధించి ఇష్టమైన వర్సిటీలో చేరే వెసులుబాటు కలిగింది. దీని ద్వారా టాలెంట్ కలిగిన విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు ఉన్న వర్సిటీలో తొలి ప్రాధాన్య సీటు పొందుతున్నారు.

అందుకే 2018-19లో ఇంజనీరింగ్‌లో చేరికలు 87 వేలు ఉంటే ఇప్పుడు 1.20 లక్షలకు చేరుకున్నాయి. అంటే 30 వేల మందికిపైగా డిగ్రీలో చేరాల్సిన విద్యార్థులు సాంకేతిక విద్య వైపు వెళ్తున్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇంటర్ తర్వాత డ్రాపవుట్లు 21 శాతం ఉండగా ఇపుడు 6 శాతానికి తగ్గాయి. ఇదంతా విద్యావ్యవస్థ బలోపేతం కాదా రామోజీ?

ద్రావిడియన్ వర్సిటీలో ఆర్ట్స్ గ్రూప్ ప్రవేశాలు ఇలా..

కోర్సు	2014-15	2015-16	2016-17	2017-18
ఎంఏ లింగ్విస్టిక్స్	0	0	0	0
ఎంఏ హిస్టరీ	2	5	5	0
ఎంఏ ఫిలాసఫీ	1	0	0	0
ఎంఏ కన్నడ	9	4	8	8
ఎంఈడీ	34	0	0	4
మొత్తం	46	9	13	12

ఆ భూములు ఖర్జూరనాయుడివా?: మంత్రి రోజా



పుత్తూరు రూరల్: రాష్ట్రం మొత్తం మీద 31 లక్షలకుపైగా పేదలకు ఇళ్లు కట్టిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజంగానే దానకర్ణుడేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. తిరుపతి జిల్లా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని దాసరిగుంట, గోవిందపాళెం, పిళ్లారిపట్టు సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ ఇటీవల అమరావతిలో 50 వేలమంది పేదల ఇళ్ల నిర్మాణానికి జగనన్న భూమిపూజ చేస్తే.. ఆ భూములు ఎవరివి? ఆయన దానకర్ణుడా? అంటూ చంద్రబాబు మాట్లాడారని గుర్తుచేశారు. ఆ భూములు చంద్రబాబు తండ్రి ఖర్జూరపునాయుడివా.. అని ప్రశ్నించారు. అమరావతిలో పేదవాళ్లకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయరాదంటూ కోర్టుకెక్కిన చంద్రబాబు అండ్ కోను ప్రతి పేదవాడు గుర్తుపెట్టుకోవాలని కోరారు. గంజాయి అమ్ముతూ పట్టుబడింది టీడీపీ నాయకులేనని, వారితో సెల్ఫీలు దిగింది లోకేశేనని చెప్పారు.

బాబుతోనే రాష్ట్రం భ్రష్టుపట్టింది: ఎంపీ భరత్



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అవలంభించిన విధానాలతోనే రాష్ట్రం భ్రష్టుపట్టిందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు, 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకొనే బాబు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. 'నీరు-చెట్టు' పథకం పేరుతో రూ.7 వేల కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో రూ.వందల కోట్లు దుర్వినియోగం చేశారన్నారు. సీఎంగా చేసేందేమీ లేకపోగా నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధి చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు చెవాకులు మాట్లడటం తగదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఏపీ ప్రభుత్వం కేంద్రం నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తోందని విమర్శించడం సరికాదని చెప్పారు. పార్లమెంటులో మణిపూర్ ఇష్యూతో పాటు ఏపీకి ప్రత్యేకహోదా విషయమై చర్చిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి తమ పార్టీ మద్దతివ్వదని చెప్పారు.

లోకేశ్ నిల్.. యాంకర్ ఫుల్

బీసీ సదస్సులో జీవోని.. జియో అని ఉచ్చరించిన లోకేశ్



ఒంగోలు సబర్బన్: జయహో బీసీ సదస్సులో యాంకర్‌దే ప్రధాన పాత్రగా మారింది. గురువారం ఒంగోలు నగరంలో పాత గుంటూరు రోడ్డులోని ఏ1 ఫంక్షన్ హాల్లో 'జయహో బీసీ' సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీకి చెందిన బీసీ నాయకులు, బాధితులుగా చెప్పుకుంటున్న వారి కుటుంబ సభ్యులను పిలిపించారు. ఈ కార్యక్రమం మొత్తం యాంకర్ ఉదయభాను పాత్రే ఎక్కువైంది. దీంతో పరిస్థితి లోకేశ్ నిల్.. యాంకర్ ఫుల్ అన్న చందంగా తయారైంది. లోకేశ్ మాట్లాడుతూ '9 నెలలు ఆగండి.. వైఎస్సార్‌సీపీ నేతలను బజారులో తరిమితరిమి కొడదాం. టీడీపీ నాయకులను వేధించిన వైఎస్సార్‌సీపీ నాయకులను లోపలేసి శిక్ష పడేంత వరకూ పడుకోను..' అంటూ శపథం చేశారు. గనుల శాఖను ఘన్నుల శాఖగా ఉచ్చరించిన లోకేశ్.. జీవోను జియో... అని అనడంతో సదస్సులో అందరూ ఒక్కరాసిగా నవ్వారు. జయహో బీసీ సదస్సులా కాకుండా ఇది టీడీపీ సర్వసభ్య సమావేశంలా సాగింది.

కూటి బిల్లు దగ్గరా కక్కుర్తేనా లోకేశా!

కందుకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో జరిగిన లోకేశ్ పాదయాత్రలో టీడీపీ నేతల కక్కుర్తి బయటపడింది. ప్రతి ఒక్కరికీ అది చేస్తా, ఇది చేస్తానంటూ హామీలతో ఊదరగొడుతున్న లోకేశ్ పాదయాత్రలో జనాలకు అన్నం పెట్టిన ఫుడ్ కాంట్రాక్టర్‌కు మాత్రం టీడీపీ నేతలు బిల్లు ఎగ్గొట్టేందుకు ప్రయత్నించారు. ఈ నెల 15, 16 తేదీల్లో లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో లోకేశ్ పాదయాత్ర చేశారు. ఆ సమయంలో కార్యకర్తలకు భోజనం సరఫరా కాంట్రాక్టును కందుకూరుకు చెందిన గడ్డం మాల్యాద్రి అనే వంట మాస్టర్‌కు రూ.10.60 లక్షలకు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఇచ్చారు. భోజనాలు సరఫరా చేసిన తర్వాత రూ.8 లక్షలే ఇచ్చారు. మిగిలిన డబ్బు ఇవ్వబోమని చెప్పారు. మాల్యాద్రి ఇటీవల ఓ పోలీస్ అధికారి ఇంటికి వెళ్లినప్పుడు తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నారు. ఆ పోలీస్ అధికారి టీడీపీ నాయకులకు ఫోన్ చేసి వంట మాస్టర్ డబ్బులు తిరిగి ఇవ్వాలని చెప్పారు. భోజనం కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎగ్గొట్టిన విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపీ నేతల కక్కుర్తిపై నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. దీంతో టీడీపీ నాయకులు దిగివచ్చి మాల్యాద్రికి బిల్లు మొత్తం చెల్లించారు.

ఆర్యవైశ్యులపై లోకేశ్ కపట ప్రేమ: కుప్పం ప్రసాద్



ఒంగోలు: ఆర్యవైశ్యులపై టీడీపీ నాయకుడు నారా లోకేశ్ కపటప్రేమ చూపిస్తున్నారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ విమర్శించారు. ఆయన ఒంగోలులో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నారని, టీడీపీ నాయకులకు ఆ విషయం తెలియకపోతే లబ్ధిపొందిన మహిళల బ్యాంకు పాస్‌బుక్‌లను పరిశీలించాలన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం వల్ల ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సైతం విస్మరించిన ఘనత టీడీపీదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నవంబరు 1న రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించారన్నారు. రాజకీయంగా ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ఏం చేశారనే దానిపై చర్చకు తాము సిద్ధమని.. లోకేశ్‌కు దమ్ముంటే చంద్రబాబు హయాంలో ఏం చేశారనే దానిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

దేశవ్యాప్త సమస్యపై రాష్ట్రాన్ని విమర్శిస్తారా?

పవన్ కళ్యాణ్, ప్రతిపక్షాలపై వాసిరెడ్డి పద్మ ధ్వజం



సాక్షి, అమరావతి: మహిళల అదృశ్యం దేశవ్యాప్త సమస్య అని, దీనిపై రాజ్యసభలో చర్చ జరిగితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌నే లక్ష్యంగా చేసుకుని పవన్ కళ్యాణ్, ప్రతిపక్షాలు విమర్శలు చేయడం దుర్మార్గమని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. ఏ రాష్ట్రం స్పందించని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందిస్తూ అదృశ్యమైన మహిళలు, బాలికల్లో 78 శాతం మందిని గుర్తించి తిరిగి వారి ఇళ్లకు చేర్చడంలో దేశంలోనే ఏపీ రెండో స్థానంలో ఉన్న విషయం పవన్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న సమస్యను రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థకు ముడిపెట్టడం సబబు కాదన్నారు. అందుకే ఆయన సమాధానం చెప్పాలని నోటీసు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణపై ఆ మహిళల సమక్షంలోనే చర్చించేందుకు పవన్ సిద్ధమా అని ఆమె సవాల్ విసిరారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ పదవీ కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (ఏపీఎస్‌సీఎస్‌సీ) చైర్మన్‌గా ద్వారంపూడి భాస్కర్ రెడ్డి పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. 2021 జూలై 30న ఆయనను రెండేళ్ల కాలపరిమితితో ప్రభుత్వంఏపీఎస్‌సీఎస్‌సీ చైర్మన్‌గా నియమించింది. ఈ నెల 29తో పదవీ కాలం ముగియనుండటంతో మరో ఏడాది ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ హెచ్.అరుణ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

పలు రైళ్ల రద్దు



సాక్షి, హైదరాబాద్: గుంటూరు డివిజన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా దక్షిణమధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. ఈ మేరకు గుంటూరు-డోన్, గుంటూరు-కాచిగూడ, కాచిగూడ-మెదక్, గుంటూరు-సికింద్రాబాద్ మధ్య నడిచే రైళ్లు ఆగస్టు 2వ తేదీ వరకు రద్దు కానున్నాయి. రేపల్లె-మార్కాపురం, మార్కాపురం-తెనాలి, హుబ్లీ-విజయవాడ, గుంటూరు-తెనాలి మధ్య నడిచే రైళ్లు పాక్షికంగా రద్దు కానున్నాయి.

ఎమ్మెల్యే బొల్లాపై టీడీపీ శ్రేణుల దాడి

- జగనన్న సురక్ష కార్యక్రమానికి వెళ్తుండగా అడ్డగింత
- రాళ్లు, కర్రలు, గాజు సీసాలతో ఎమ్మెల్యే కారుపై దాడి
- టీడీపీ రౌడీమూకల దాడిలో గాయపడ్డ ఎమ్మెల్యే గన్‌మెన్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఎమ్మెల్యేను కాపాడేందుకు గాలిలో ఒక రౌండ్ కాల్పులు జరిపిన సీఐ
- రాజకీయంగా ఎదగలేకే నన్ను అంతమొందించేందుకు యత్నం
- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు



మాట్లాడుతున్న మంత్రి రజిని. పక్కన ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు

సాక్షి, నరసరావుపేట, వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై గురువారం వినుకొండ పట్టణంలో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రోడ్డుపై కారును అడ్డగించి కర్రలు, రాళ్లు, గాజు సీసాలతో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే బొల్లా గన్‌మెన్ తలపై టీడీపీ జెండాలు కట్టిన వెదురు కర్రలతో దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. టీడీపీ శ్రేణుల రాళ్ల దాడి నుంచి ఎమ్మెల్యేను రక్షించే క్రమంలో కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైతం గాయపడ్డారు. బొల్లాపల్లి మండలం వడ్డెంగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే బొల్లా తన కారులో ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వెళుతున్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు, కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు చేశారంటూ నిరసన కార్యక్రమం పేరిట వందలాది మంది టీడీపీ కార్యకర్తలు గుమికూడి ఒక్కసారిగా ఎమ్మెల్యే కారును అడ్డగించారు. నిరసన కార్యక్రమానికి పోలీసుల నుంచి అనుమతి తీసుకోలేదు. ప్రభుత్వ భూముల్లో మట్టి అమ్ముకున్న ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలని, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన అనుచరులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు, టీడీపీ జెండాలతో భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే కాన్వాయ్‌ను చుట్టుముట్టారు. పోలీసులు వారిస్తున్నా ఎమ్మెల్యేపై దాడికి యత్నించారు. సుమారు గంటసేపు కాన్వాయ్‌ని కదలనివ్వకుండా రణరంగం సృష్టించారు. ఇంతలోనే అక్కడికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను చూసి మరింత రెచ్చిపోయి రాళ్లు, గాజు సీసాలు, కొబ్బరి బొండాలతో దాడికి తెగబడ్డారు. ఎమ్మెల్యేను టీడీపీ శ్రేణుల దాడి నుంచి తప్పించేందుకు పోలీసులు లాఠీచార్జి చేసినా వెనక్కి తగ్గలేదు. ఎమ్మెల్యే కారుపై పెద్దపెద్ద బండలతో దాడి చేశారు. ఎమ్మెల్యేను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న గన్‌మెన్ నబీపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. పరిస్థితి అదుపు తప్పడంతో వినుకొండ టౌన్ సీఐ సాంబశివరావు గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రద్దు చేసుకుని పోలీసు బందోబస్తు నడుమ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. పోలీసులు వినుకొండ పట్టణంలో 144 సెక్షన్‌ను విధించారు.

పథకం ప్రకారమే దాడి..

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై పలు ఆరోపణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే బొల్లా తగిన ఆధారాలు చూపుతూ తన నిజాయితీని నిరూపించుకుంటూ వస్తున్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఆగస్టు ఒకటో తేదీన వినుకొండలో జరగనున్న నేపథ్యంలో పొలిటికల్ మైలేజీ కోసం ఎలాగైనా గొడవలు సృష్టించి అధికార పార్టీపై, స్థానిక ఎమ్మెల్యేపై లోకేశ్‌తో విమర్శలు చేయించాలని ఆంజనేయులు తాపత్రయపడుతున్నారు. పథకం ప్రకారమే వినుకొండలో సంగం డెయిరీలో కూర్చుని టీడీపీ అల్లరి మూకలను రెచ్చగొట్టి వదిలారు. ముందస్తు పథకంలో భాగంగానే ఎమ్మెల్యే కారు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేయించారు. అదే సమయంలో తమ అనుకూల మీడియాలో మాత్రం వైఎస్సార్‌సీపీ నేతలే తమపై దాడులు చేశారని ప్రచారం చేయించారు.

నాపై దాడికి జీవీ పక్కా ప్లాన్: ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ అభివృద్ధి, కార్యకర్తల కోసం తన ప్రాణాలైనా లెక్క చేయనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. టీడీపీ అల్లరి మూకల దాడి అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాజకీయంగా ఎదగలేక తనను అంతమొందించేందుకు జీవీ ఆంజనేయులు కుట్ర పన్నారని ఆరోపించారు. గతంలో బొగ్గరం తిరునాళ్లలో తన కారుపై రాళ్లురువ్వి దాడులకు పాల్పడ్డారని, మరోమారు తనపై దాడికి జీవీ పక్కా ప్లాన్ వేశారని చెప్పారు.

దాడిని ఖండించిన మంత్రి రజిని

ఎమ్మెల్యే బొల్లాపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు మంత్రి రజిని, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. నరసరావుపేటలో వారు మీడియాతో మాట్లాడుతూ కోల్పోయిన తమ ప్రాభవాన్ని పెంచుకునేందుకే చంద్రబాబు, లోకేశ్ ఇలా దాడులను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు వారిని ఎప్పటికీ నమ్మబోరన్నారు.

వినుకొండ ప్రశాంతతను చెడగొడుతున్న జీవీ

'తన రాజకీయ లబ్ధి కోసం జీవీ అంజనేయులు నిత్యం ఏదో ఒక గొడవ చేస్తూ వినుకొండ ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. ఎన్నడూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. ఎమ్మెల్యే బొల్లాను రాజకీయంగా ఎదుర్కొవడం చేతకాక టీడీపీ వర్గాలు ఇలా దాడులకు తెగబడుతున్నాయి.'

– మక్కెన మల్లికార్జున, మాజీ ఎమ్మెల్యే

మహిళల మిస్సింగ్‌పై అడ్డగోలు ఆరోపణలు

- 30 వేల మంది మహిళలు మిస్సింగ్ అన్నది అవాస్తవం
- వాస్తవానికి 2,705 మంది మాత్రమే మిస్సింగ్: డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: 'వాస్తవాలు తెలుసుకోకుండా కొంతమంది ఆరోపణలు చేస్తున్నారు. 30 వేల మంది మహిళలు మిస్సింగ్ అయ్యారనడం శుద్ధ అబద్ధం. ఎన్సీఆర్బీ నివేదికల ప్రకారమూ రాష్ట్రంలో మిస్సింగ్ మహిళలు 2,705 మంది మాత్రమే. ఆరోపణలు చేసే ముందు నివేదికలు సరిగా చూడాలి' అని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్సీఆర్బీ డేటాలో నమోదైన 26,000 మిస్సింగ్ కేసుల్లో 23,400 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని, ఇందుకు నివేదికలున్నాయని అన్నారు. 2019కు ముందు రిపోర్ట్ అయిన వాటిలో 1,542 కేసులు మిగిలాయని, వాటిని ప్రతి ఏటా తాజా కేసులకు కలపడం వల్ల దాదాపు 4 వేలుగా సంఖ్య కనిపిస్తోందని వివరించారు. వాస్తవంగా 2,705 మందిని మాత్రమే గుర్తించాల్సి ఉందన్నారు. సామాజిక ఘర్షణ, కుటుంబంలో విభేదాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమ వ్యవహారం తదితర కారణాలతో చాలామంది ఇళ్లు వదలి వెళ్తున్నారని తెలిపారు.

కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్

రాష్ట్రంలో కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ మంచి ఫలితాలు ఇస్తోందని చెప్పారు. ఈ విధానం ద్వారా మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, ఇతర తీవ్రమైన 122 నేరాల్లో 100 కేసుల విచారణ పకడ్బందీగా జరిపామని, ఈ కేసుల్లో నిందితులకు న్యాయస్థానాలు మరణ శిక్ష మొదలుకొని 30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించాయన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 3 నెలల్లోనే వీటిని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. దిశ చట్టం రాష్ట్రంలో మహిళలకు రక్షణ కవచమని చెప్పారు. మహిళలందరూ దిశ యాప్‌లో వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు అన్ని జిల్లాల్లో, పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సెల్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

త్వరలో పదోన్నతులు

పోలీసు శాఖలో త్వరలో పదోన్నతులు చేపట్టనున్నట్లు డీజీపీ చెప్పారు. రేంజ్‌లలో తేడాల వల్ల పదోన్నతి లభించని 100 మందికి సీఐలుగా ప్రమోషన్ లభిస్తుందని అన్నారు. మరో 200 మంది ఎస్సైలకు కూడా పదోన్నతి లభిస్తుందన్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లిన కారణంగా కానిస్టేబుళ్ల నియామకం ఆలస్యమవుతోందని, ఎస్‌ఐ అభ్యర్థుల నియామకం క్లియర్ అయిందని తెలిపారు.

గంజాయితో సంబంధం లేదు

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, నేరాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. ఏ ఘటన జరిగినా గంజాయితో ముడిపెట్టడం సరికాదన్నారు. బాపట్ల, ఒంగోలు, నెల్లూరులో ఇటీవల యాదృచ్ఛికంగా జరిగిన ఘటనలకు, గంజాయికి సంబంధం లేదని చెప్పారు. బాపట్లలో చిన్న పిల్లాడి కేసులో కూడా గంజాయితో సంబంధం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు, రవాణాను పూర్తిగా కట్టడి చేస్తున్నామని, 7,119 ఎకరాల్లో గంజాయి పంటను నిర్మూలించామని చెప్పారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఆ రాష్ట్ర అధికారులతో సంప్రదిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, నిరంతర వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచడం ద్వారా 36 శాతం రోడ్డు ప్రమాదాలను అదుపు చేశామన్నారు.

అనంత కరుణామయుడు (అల్లాహ్)! ఆయనే త్రాసును నెలకొల్పాడు. తద్వారా మీరు తూకంలో మోసానికి పాల్పడ కూడదని! న్యాయంగా తూకం చేయండి. తూకంలో తగ్గించకండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 జూలై 2023

సంస్కరణల స్వీయహననం!

ప్రజలు, ప్రతిపక్షాల నుంచి నెలల తరబడి నిరసన వ్యక్తమవుతున్నా, తాము అనుకున్నదే చేసే పాలకులు ప్రపంచమంతటా ఉంటారు. మొత్తం 93 లక్షల జనాభాలో, రెండున్నర లక్షల మందికి పైగా జనవరి నుంచి వీధికెక్కి నిరసనకు దిగుతున్నా, ఇజ్రాయెల్‌లోని బెంజమిన్ నెతన్యాహూ సర్కార్ తాను అనుకున్నదే చేసింది. దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని అత్యంత భారీ నిరసనల్ని సైతం తోసిపుచ్చి, ఇజ్రాయెలీ పార్లమెంట్ వివాదాస్పద న్యాయసంస్కరణల్లో మరో కీలక అంశానికి సోమవారం ఆమోద ముద్ర వేసింది. దేశంలో అధికార సమతూకాన్ని మార్చేసే ఈ చర్య సంచలనమైంది. మంత్రులు తీసుకొనే నిర్ణయాలు 'నిర్హేతుకం' అనిపించినప్పుడు వాటిని కొట్టివేసేందుకు సుప్రీమ్ కోర్ట్‌కు ఇప్పటి దాకా అధికారముంది. సరికొత్త సోకాల్డ్ 'సహేతుకత' బిల్లుతో దానికి కత్తెర పడనుంది.

రాబోయే రోజుల్లో మరో ఓటింగ్‌లో న్యాయ నియామకాలపైనా ప్రభుత్వానికే మరిన్ని అధికారాలు కట్టబెట్టాలన్నది తదుపరి ఆలోచన. ఈ మార్పుల్ని కొందరు సమర్థిస్తున్నప్పటికీ, అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. కలిగే విపరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, అధిక శాతం ఇజ్రాయెలీలు లౌకికవాద, వామపక్ష, ఉదారవాదులు. కానీ, తీవ్ర మితవాద పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుతో అక్కడి ప్రభుత్వ విధానమూ మితవాదం వైపు మొగ్గుతోంది. ఆ ప్రభుత్వాలకూ, న్యాయవ్యవస్థకూ మధ్య తరచూ ఘర్షణ తలెత్తుతోంది. దీనికి విరుగుడుగా కోర్టు కోరలు పీకేయాలనేది ఛాందస, జాతీయవాద నెతన్యాహూ సర్కార్ ప్రయత్నం. పాలకులపై ఉన్న ఏకైక అంకుశమైన కోర్ట్‌ను సైతం అలా ప్రభుత్వ నియంత్రణలోకి తెస్తే, వ్యవస్థల పరంగా ఉన్న సమతూకం దెబ్బతినడం ఖాయం. అందుకే, ఇన్ని నెలలుగా దేశంలో ఈ భారీ ప్రజాందోళనలు.

కార్యనిర్వాహక, శాసననిర్మాణ, న్యాయవ్యవస్థలు మూడింటికీ మధ్య అధికార విభజనలో అనేక అంశాలను మార్చాలని నెతన్యాహూ కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన సారథ్యంలోని సాంప్రదాయవాద, మతతత్త్వ సంకీర్ణ ప్రభుత్వం అందుకు కంకణం కట్టుకుంది. అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న ఆయన కోర్టు భవిష్యత్ తీర్పులు తనపై ప్రభావం చూపకుండా ఉండేందుకే ఈ పని చేస్తున్నారని విమర్శకుల మాట. నిజానికి, ఇజ్రాయెల్‌లో రాజ్యాంగమంటూ లేదు గనక, పై మూడు వ్యవస్థల మధ్య వ్యవహారమంతా వ్యక్తిగత చట్టాలు క్రమబద్ధీకరిస్తుంటాయి. పార్లమెంట్‌లో రెండో సభ లేదు గనక అది చేసే చట్టాలకు అవసరమైతే ముకుతాడు వేసేలా సుప్రీమ్ కోర్ట్‌కే బలమైన స్థానం ఉందక్కడ! ఇలా న్యాయవ్యవస్థకు అతిగా అధికారాలున్నాయనేది ప్రభుత్వ మద్దతుదార్ల భావన. ఎంపీల్లా జడ్జీలనేమీ ప్రజలు నేరుగా ఎన్నుకోవడం లేదనీ, ఇప్పుడీ ప్రతిపాదిత సంస్కరణలతో అధికార సమతూకం మెరుగై, ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుందనీ వారి వాదన.

సంస్కరణల్ని వ్యతిరేకిస్తున్నవారు మాత్రం దీన్ని ప్రజాస్వామ్య విధ్వంసం అంటున్నారు. లింగ సమానత్వం, లైంగిక అల్పసంఖ్యాకుల రక్షణ లాంటి అంశాలను గతంలో సుప్రీం పదేపదే సమర్థించిందనీ, రేపు ఈ కొత్త సంస్కరణలతో అందుకు అవకాశం లేక సమాజం చీలిపోతుందనీ వాదిస్తున్నారు. తాజా సంస్కరణలు దేశంలో అతి సాంప్రదాయ వర్గాన్ని బలోపేతం చేస్తాయన్నది లౌకికవాదుల భయం. ఈ అంశం సైన్యం దాకా పాకింది. ఇప్పటికే స్త్రీ పురుషులిద్దరూ సైన్యంలో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధన నుంచి అతి సాంప్రదాయ యూదులను ప్రభుత్వం మినహాయించింది. సుప్రీం దీన్ని తప్పుబట్టి, ఇది దుర్విచక్షణ అని పదే పదే ప్రకటించింది. ఇప్పుడీ న్యాయ సంస్కరణల్ని అమలుచేస్తే, స్వచ్ఛంద సేవ నుంచి వైదొలగుతామంటూ వెయ్యిమందికి పైగా ఇజ్రాయెలీ ఎయిర్ ఫోర్స్ రిజర్విస్టులు హెచ్చరించారు. గూఢచర్య సంస్థలు సహా అనేక ఇతర విభాగాల్లోని వారూ తమదీ ఆ మాటే అంటున్నారు. అదే జరిగితే ఆ దేశ భద్రతకు ముప్పే!

మరోపక్క, పార్లమెంట్ ఆమోదించిన సంస్కరణ క్లాజుపై కోర్టుకెక్కనున్నట్టు పౌరసమాజ బృందాలు ప్రకటించాయి. అంటే తమ అధికారాలకు కత్తెర వేయడం సహేతుకమో, కాదో జడ్జీలే పరీక్షించాల్సి వస్తుంది. న్యాయమూర్తులు గనక ఈ సంస్కరణను అడ్డుకుంటే, ఇజ్రాయెల్ ఊహించని జాతీయ సంక్షోభంలో పడవచ్చు. ఒకవేళ దాన్ని నివారించేందుకు ప్రభుత్వం తాజా సంస్కరణను ఉపసంహరించుకుంటే, అది చివరకు పాలక సంకీర్ణం కుప్పకూలడానికి దారి తీయవచ్చు. ఏదైనా చిక్కే! మధ్యప్రాచ్యంలో ఏకైక ఆధునిక ప్రజాస్వామ్యంగా ఇజ్రాయెల్‌కున్న పేరు ఈ మొత్తం వ్యవహారంలో దెబ్బతింటుంది. దేశ ఆర్థికవ్యవస్థ, విదేశాంగ విధానం పైనా దెబ్బ పడుతోంది.

న్యాయసంస్కరణల సంక్షోభంతో ఫిబ్రవరి నాటికి 400 కోట్ల డాలర్లు ఇజ్రాయెల్ నుంచి తరలిపోయాయట. అలాగే, దేశ శ్రామికశక్తిలో 11 శాతం మంది దాకా హైటెక్ రంగ ప్రవీణులు. వారిలో అధికశాతం సంస్కరణల్ని వ్యతిరేకిస్తూ, వీధికెక్కినవారే! ఈ సాంకేతిక ప్రతిభాశాలురు దేశం విడిచి పోవచ్చు. అలా జరిగితే అది మరో దెబ్బ. ఇక, న్యాయ ప్రక్షాళనకు బలమైన మద్దతుదారులంతా ప్రధానంగా ఇజ్రాయెల్ దురాక్రమణను సమర్థిస్తున్నవారే! మరోమాటలో ఈ తీవ్ర మితవాదులంతా దేశాన్ని నిరంకుశ మతరాజ్య వ్యవస్థగా మార్చి, ఆక్రమణలతో దేశాన్ని విస్తరించాలని కోరుకుంటున్నవారే. దశాబ్దాల కష్టంతో నిర్మాణమైన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల సుస్థిరతకూ, అభివృద్ధికీ, భద్రతకూ దేనికీ ఇది శ్రేయోదాయకం కాదు. ప్రజాస్వామ్య విలువల పునాదిపై ఎదిగి, పొరుగు దేశాలకు తనను కాస్తంత భిన్నంగా నిలిపిన ఆ మౌలిక సూత్రాన్నే కాలరాస్తానంటే అది ఇజ్రాయెల్‌కు ఆత్మహననమే. బిల్లుతో నెతన్యాహూ బలోపేతులయ్యారేమో కానీ, ఇజ్రాయెల్ బలహీనమైపోయింది.

ఇది భారతీయ మహిళల గురించి...

అభిప్రాయం



బర్ఖా దత్

ఒక రిపోర్టర్‌గా, నేను దశాబ్దాలుగా లెక్కలేనన్ని భయంకర ఘటనలను చూశాను. కానీ ఆ వీడియోలో ఉన్నది వేరే – ఇద్దరు మహిళల దుస్తుల్ని విప్పి, నగ్నంగా ఊరేగించారు. వారిలో ఒకరిని తర్వాత క్రూరంగా సామూహిక అత్యాచారం చేశారు. ఇది చూసిన ప్రతి భారతీయ మహిళ హృదయం బద్దలైపోయింది. ఈ భయంకరమైన కేసు గురించి తనకు (వీడియో బయటికి రాకముందు) తెలియదని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అంటున్నారా? లేక తనకు తెలిసిందనీ, కానీ చర్య తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాననీ ఒప్పుకుంటున్నారా? ఎలాగైనా సరే, ఇది ఆయన అసమర్థతను లేదా నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తుంది. బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి లేదా ఆయన్ని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి!

"ఆ వీడియోలో ఉన్న స్త్రీలకు జరిగింది అనుభవించడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటాను," అని మణిపూర్ కుకీ సమాజానికి చెందిన హక్కుల కార్యకర్త గ్లాడీ హుంజన్ నాతో అన్నారు. కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నందున ఆమె పదాలను కూడా కూడగట్టుకోలేక పోయారు. నిరాశ, నిస్సహాయత, కోపం, వేదనతో ఆమె ఏడ్చినప్పుడు, నేను కూడా ఏడ్చాను.

ఒక రిపోర్టర్‌గా, నేను దశాబ్దాలుగా లెక్కలేనన్ని భయంకర ఘటనలను చూశాను. కానీ ఆ వీడియోలో ఉన్నది వేరే – ఇద్దరు మహిళల దుస్తుల్ని విప్పి, నగ్నంగా ఊరేగించారు. ఒక మూక వాళ్లను తోసుకుంటూ, నెట్టుకుంటూ వచ్చింది. వారిలో ఒకరిని తర్వాత క్రూరంగా సామూహిక అత్యాచారం చేశారు. ఇది చూసిన ప్రతి భారతీయ మహిళ హృదయం బద్దలైపోయింది.

గుమికూడినవాళ్లు చూస్తుండగానే మూక ద్వారా లైంగిక వేధింపులకు గురైన 21 ఏళ్ల మహిళ గురించీ, ఆమెను రక్షించడానికి ప్రయత్నించినందుకు అక్కడికక్కడే మూక చంపేసిన ఆమె సోదరుడి గురించీ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. అతడి వయస్సు కేవలం 19 సంవత్సరాలు.

ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మందలింపులు రెండు నెలలుగా జడత్వంలో ఉండిపోయిన ఒక ముఖ్యమంత్రిని నిద్ర లేపాయి. అకస్మాత్తుగా, కొన్ని గంటల వ్యవధిలో, ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు.

కాబట్టి, ఇన్ని రోజులు ఎన్. బీరేన్ సింగ్ ఈ ఘటనపై ఉద్దేశపూర్వకంగా వేరే దృష్టితో చూస్తున్నారా లేక ఏం జరిగిందో ఆయనకు నిజంగానే తెలియదా? ఎలా భావించినా ఆయన (ఇప్పటికే తగ్గిపోయిన) విశ్వసనీయత గురించి సానుకూల మాట రాదు.

నన్ను వివరించనివ్వండి

ఈ సామూహిక అత్యాచారం, హత్యా ఘటన మే 4న జరిగినట్లు మనకు తెలుసు. జీరో ఫస్ట్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ (జీరో–ఎఫ్ఐఆర్)గా పిలిచే మొదటి పోలీసు ఫిర్యాదును మే 18న దాఖలు చేశారు. 2012లో జరిగిన సామూహిక అత్యాచారం తర్వాత, జస్టిస్ జేఎస్ వర్మ ప్యానెల్ ప్రవేశపెట్టిన విధానం ఇది. లైంగిక వేధింపుల బాధితురాలు భారత దేశంలో ఎక్కడైనా, అధికార పరిధితో సంబంధం లేకుండా పోలీసు కేసును దాఖలు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఆ తర్వాత



ఎఫ్ఐఆర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపుతారు. ఈ కేసులో జూన్ 21న సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఎఫ్ఐఆర్‌ను పంపారు.

60 రోజులకు పైగా, అత్యాచారం–హత్య ఘటనపై ఎఫ్ఐఆర్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఈ వీడియో బయటపడి, దేశం మొత్తాన్ని ఆగ్రహానికి గురి చేసి ఉండకపోతే, రేపిస్టులు, హంతకులు ఇంకా బయటే ఉండేవారు. కాబట్టి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఈ భయంకరమైన కేసు గురించి తనకు తెలియదని సింగ్ అంగీకరిస్తున్నారా? లేక తనకు తెలిసిందనీ, కానీ చర్య తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాననీ ఒప్పుకుంటున్నారా?

ఎలాగైనా సరే, ఇది ఆయన అసమర్థతను లేదా నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తుంది. బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి లేదా ఆయన్ని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి. ఈ ఒక్క అతి భయానక సంఘటన వల్ల మాత్రమే కాదు, గత రెండు నెలలుగా ఆయన దారుణ వైఫల్యాల కారణంగా ఆయన్ని తొలగించాలి. ఇంకా జాతీయ పతాక శీర్షికలకు ఎక్కని ఇతర అత్యాచారాలు, హత్యా ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. అవును, వాస్తవానికి, జాతి విభజనకు సంబంధించి రెండు వైపులా బాధితులు, నేరస్థులు ఉన్నారు.

నిజమేమిటంటే, బీరేన్ సింగ్ ఆఖరికి తన సొంత శాసన సభ్యులను కూడా రక్షించడంలో విఫలమయ్యారు. ఉదాహరణకు వుంగ్‌జగిన్ వాల్తే గురించి ఆలోచించండి. ఆయన సింగ్ సహచరుడు, భారతీయ జనతా పార్టీ శాసన సభ్యుడు, ముఖ్యమంత్రి సలహాదారు. ఆయనపై దాడి జరిగింది. ఆయన మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఢిల్లీలోని ఆసుపత్రి బెడ్‌లో కట్లతో పడి ఉన్నారు. తమ కుటుంబం ఎప్పటికీ మణిపూర్‌కు తిరిగి వెళ్లదని ఆయన భార్య అన్నారు.

నిజమేమిటంటే, స్థానిక పరిపాలనలోని అన్ని విభాగాలు జాతుల పరంగా చీలిపోయినప్పటికీ, ఇప్పటికీ విశ్వసనీయతను కలిగి ఉన్న ఏకైక వ్యవస్థ సైన్యం మాత్రమే. మైతేయిలు, కుకీల మధ్య బఫర్ జోన్‌లను ఏర్పాటు చేస్తున్నది సైన్యమే; ఇరువైపులా కమ్యూనిటీ నాయకులతో చర్చలను ప్రారంభించిందీ సైన్యమే. పైగా ఇటీవలి ఒక వీడియోలో చెప్పినట్లుగా, 'మానవీయంగా ఉండటం బలహీనతకు సంకేతం కాదు' అని సైన్యం భారతీయులకు గుర్తు చేస్తోంది. ఇంకా గుర్తుంచుకోండి, మణిపూర్‌లోని అనేక ప్రాంతాలలో సైన్యం సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టానికి చెందిన చట్టపరమైన రక్షణ లేకుండా పనిచేస్తోంది.

ఆ వీడియో కీలకమైన సాక్ష్యాలను అందించిందనీ, వ్యక్తులను గుర్తించడంలో పోలీసులకు సహాయపడిందనీ బీరేన్ సింగ్ పేర్కొన్నారు. అలా అయినప్పుడు, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖలోని కొందరు అధికారులు మణిపూర్‌పై నివేదికలను, ప్రదర్శనలను (వీటిలో నావి కూడా ఉన్నాయి) ఆపమని కోరడం విడ్డూరం కాదా? ఆ మహిళలను గుర్తించేలా ఉన్నవీ, లేదా దాడికి సంబంధించిన క్రూరత్వాన్ని తెలిపేవీ చూపడానికి ఏ మీడియా హౌస్‌ను కూడా అనుమతించకూడదు. అలాంటి వీడియోలను బ్లాక్ చేయాలి. అయితే, నిర్దిష్టమైన సంపాదకీయ రక్షణతో ఆ వీడియోను ప్రస్తావిస్తున్నప్పుడు కూడా దాని చుట్టూ ఉన్న మీడియా కవరేజీని తొలగించడం అంటే, మణిపూర్ భయానక స్థితిని వివరంగా చెప్పడాన్ని తీవ్రంగా అడ్డుకోవడమే అవుతుంది.

"ఇది కుకీలు లేదా మెయితీల గురించి కాదు... ఇది భారతీయ మహిళల గురించి. మొత్తం భారతీయ మహిళల గురించి" అని గ్లాడీ హుంజన్ చిన్నపిల్లలా ఏడుస్తూ నాతో చెప్పారు. ఈ వీడియో చూసి భారతీయ మహిళలమైన మనం వణికిపోయిన సమయంలోనే, లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ పార్లమెంటేరియన్‌కు ఢిల్లీ పోలీసుల నుంచి అనూహ్యంగా బెయిల్ వచ్చింది. పైగా అత్యాచార దోషి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు పెరోల్ వచ్చింది.


మణిపూర్ గురించి, ఆ వైరల్ వీడియో గురించి మనందరం పట్టించుకోవాలి. మణిపూర్ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి రాష్ట్ర పతి పాలన విధించడమే ప్రారంభ చర్య అవుతుంది.

వ్యాసకర్త ప్రముఖ పాత్రికేయురాలు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎవరైనా సరే!



మోదీ తర్వాత ఎవరు? అత్యంత మూర్ఖమైన ప్రశ్న. ఎవరైనా ఆయనకన్నా మంచి ప్రధాని కాగలరు. ఎవరైనా! ఇండియా మార్పును కోరుతోంది. ఒక కొత్త ముఖం, నిజమైన నాయకుడు కావాలి.

– సంజయ్ ఝా, రచయిత

ఏకపక్ష రాతలు



మణిపూర్ హింసలో భాగమయ్యే మూక మైతేయిలు అయితే, ప్రతి ఒక్కరూ హిందువులైన ఆధిపత్య మైతేయిలు' అని కారం జల్లుతారు. వేరే మూక అయితే, అది కేవలం 'మూక' మాత్రమే. మణిపూర్ ప్రస్తుత పరిస్థితి మీద జనాలు ఎలా తీర్పులిస్తున్నారో అర్థం కావట్లేదా?

– చిత్ర అహంతెమ్, మణిపూర్ కాలమిస్ట్

ఫర్లేదా?



పాకిస్తాన్‌లోని అలీ మసీదులో దాక్కున్న తీవ్రవాదిని వెతుకుతూ పోలీసులు వెళ్లారు. తీవ్రవాది తనను తాను పేల్చుకోవడంతో మసీదు పేలిపోయింది. పశ్చిమ దేశాల్లో ఖురాన్‌ను కాల్చినందుకు నిరంతర నిరసనలు జరుగుతున్నాయి. కానీ తమలో ఒకడే మసీదును పేల్చినందుకు ఎవరి మనోభావాలూ గాయపడలేదా?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

పులుపు ఫలం



విటమిన్ సి ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తంలో యాంటీ ఆక్సిడెంట్ల స్థాయిలు 30 శాతం వరకు పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కోవడంలో ఇవి శరీర సహజ రక్షణ వ్యవస్థకు సాయపడుతాయి.

– డెన్నిస్ వాకర్, ఫిజీషియన్

నవ కాశ్మీరం



శ్రీనగర్ పాత దారుల గుండా 34 ఏళ్ల తర్వాత మొహర్రం ఊరేగింపును అనుమతించడంలోని ప్రత్యేకతను బయటివాళ్లు కొందరే అర్థం చేసుకోగలరు. ధార్మిక మతభేదాల సంక్లిష్టత, భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఇది నిజమైన మార్పు.

– రిఫి సూరి, జర్నలిస్ట్

మా గోవా!



గోవాకు వచ్చినప్పుడు, గోవాను గోవన్లు ఎలా ఎంజాయ్ చేస్తారో అలా చేయండి. గోవాలో 'ఏదైనా చేయచ్చు' అన్న ఆలోచనతో మీ 'పోకిరి ప్రవర్తన'ను వెంట తేవద్దు. మీ పిచ్చి ఫ్యాంటసీలు తీర్చడానికి గోవా అనేది సానికొంప కాదు. స్వర్గం. చక్కెర లేని బ్లాక్ కాఫీ మాత్రమే తాగుతున్నాను.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆయన మార్గంలోనే ఐక్యత సాధ్యం

భారత కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు, పీడిత ప్రజల ప్రియతముడు, భారత ప్రజా యుద్ధ పంథా రూపొందించటంలో ప్రముఖ పాత్ర వహించిన అమరుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి(టీఎన్) వర్ధంతి నేడు. టీఎన్ అనంతపురం జిల్లాలోని 'తరిమెల' గ్రామంలో 1917న జన్మించారు. లా కోర్సు చదవడానికి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చేరి దక్షిణ భారతదేశం నుంచి మొదటి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో 'యుద్ధం–ఆర్థిక ప్రభావం' అన్న పుస్తకం రాసినందుకు ఆయన్ని బ్రిటిష్ వలస పాలకులు తిరుచరాపల్లి జైలుకు తరలించారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. తండ్రి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను వ్యతిరేకించారు. ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారు. 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అవసరమైన వాటిని సమకూర్చే బాధ్యతను తీసుకున్నారు. 1948లో పార్టీపై నిషేధం విధించినప్పుడు రహస్య జీవితంలోకి వెళ్లారు. ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు ఉద్యమా నికి కంటకంగా ఉన్న తన తండ్రిని అవసరమైతే అంతమొందించా లన్న పార్టీ నిర్ణయాన్ని ఆమోదించి వర్గ చైతన్యాన్ని ప్రదర్శించారు. తండ్రిని వ్యతిరేకించి వెయ్యి ఎకరాల కుటుంబ భూములు ప్రజలకు పంపిణీ చేశారు.



తరిమెల నాగిరెడ్డి

ఎంపీగా ఒకసారి, ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచారు. ప్రజా ప్రతినిధిగా విప్లవం సాధించలేనని గ్రహించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కమ్యూనిస్టు పార్టీలో మితవాద ధోరణిని వ్యతిరేకిస్తూ కొంతమంది 1964లో బయటికి వచ్చి సీపీఎంగా ఏర్ప డ్డారు. ఈ పార్టీ ఏర్పాటులో తరిమెల నాగిరెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆ పార్టీ కూడా విప్లవ కార్యాచరణలో విఫలమయ్యిందని దాని నుంచి బయటికి వచ్చి 'ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ కారుల సమన్వయ కమిటీ'ని ఏర్పాటు చేశారు. చారు మజుందార్ అతివాద, వ్యక్తిగత హింసావాదానికి వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించేందుకు మద్రా స్‌లో సమావేశమైన సందర్భంగా నాగిరెడ్డితో పాటు రాష్ట్రనాయకత్వం మీద ఏపీ ప్రభుత్వం కుట్రకేసు బనాయించింది. కేసు విచారణ సందర్భంగా తనపై మోపబడిన నేరారోపణకు సుదీర్ఘమైన స్టేట్‌మెంట్‌ను కోర్టులో జడ్జీకి వినిపించారు టీఎన్. అదే ఆ తరువాత 'తాకట్టులో భారతదేశం' అనే పుస్తకంగా వెలువడింది. 1975లో భారత కమ్యూనిస్టు విప్లవ కారుల సమైక్యతా కేంద్రం–మార్క్సిస్ట్, లెనినిస్ట్ (యూసీసీఆర్ఐ–ఎమ్ఎల్)ను ఏర్పాటు చేశారు. ఇంతలో ఇందిరాగాంధి దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి యూసీసీఆర్ఐ (ఎమ్ ఎల్)తో పాటు ఇతర విప్లవ సంస్థలపై నిషేధం విధించారు. టీఎన్ రహస్య జీవితం గడుపుతూ అనారోగ్యానికి గురై మారు పేరుతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ 1976 జూలై 28న హైద్రబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన చూపిన మార్గంలో విప్లవ కారులు ఐక్యం కావాలి.

– బొల్లిముంత సాంబశివరావు
ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
(నేడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వర్ధంతి)

దేశ ప్రయోజనాల దృష్టితో మెలగాలి

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

ఈశాన్య రాష్ట్రాల్లో జాతుల మధ్య ఘర్షణలు, దాడులు, ప్రతి దాడులు, హింస, దౌర్జన్యాలు, గృహ దహనాలు సర్వసాధారణమైన విషయం. అస్సాం రాష్ట్రం 20 సంవత్సరాలు అగ్నిగోళంగా మండింది. నాగాలాండ్ రాష్ట్రం ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితుల విషయంలో దేశంలోని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించి, పరిస్థితులు చక్కదిద్ది, తమ రాజకీయ హుందాతనాన్ని నిలబెట్టుకున్నాయి. నేడు దేశంలో రాజకీయ పార్టీలు మాత్రం తమ రాజకీయ స్వార్థాలను పండించుకోవడంలో పోటీ పడుతున్నాయనేది వాస్తవం.

మణిపూర్‌లో కుకీలు, మైతేయిలు ఆదిమ తెగలు అనే విషయం మర్చిపోకూడదు. మైతేయిలు మైదాన ప్రాంత వాసులు కాబట్టి అభివృద్ధిలో ముందు ఉన్నారు. కుకీలు కొండ ప్రాంతవాసులు కావడంతో వెనకబడి పోయారు. మైతేయిల అభివృద్ధి పైనా, రాజకీయ చురుకుదనం పైనా, చైతన్య శీలత పైనా అపోహలను కుకీ ప్రజల మనసుల్లో ప్రణాళికాబద్ధంగా అనేక అంతర్జాతీయ సంస్థలు నిర్మాణం చేశాయనేది వాస్తవం. ఇక మైతేయిల విషయానికొస్తే కుకీల స్వాధీనంలో ఎక్కువ భూమి ఉందనీ, ప్రత్యేక ఆదివాసీ చట్టాలను వినియోగించుకుని, విదేశాల నుండి వచ్చే నిధులతో జల్సాలు చేస్తున్నారనీ, తాము జనాభా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, తక్కువ భూమితో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదనీ, కుకీలు మైదాన ప్రాంతాల్లోకి చొర బడుతున్నారనీ, బర్మా నుండి వచ్చే అక్రమ వలసదారులకు వారు ఆశ్రయం కల్పిస్తున్నారనీ భావిస్తున్నారు. పైగా రాష్ట్రంలో హిందూత్వ విలువలకు ప్రాతినిధ్యం వహించే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడం కుకీ తెగను రెచ్చగొట్టే వారికి బలాన్ని ఇచ్చిన విషయం అయ్యింది.



ఇక ఇద్దరు కుకీ మహిళల నగ్న ఊరేగింపు వీడియో పార్లమెంటు సమావేశాల ముందు ప్రస్తావనకు రావడం, మోదీ ప్రభుత్వ వ్యతిరేకులకు పెద్ద ప్రచారాస్త్రమే. మణిపూర్ దురాగతాలను ప్రపంచానికి చూపించి, భారతదేశాన్ని అంతర్జాతీయంగా అప్రతిష్ఠ పాలు చేయడానికి కొన్ని అంతర్జాతీయ సంస్థలు పన్నిన కుట్ర అని ఎందుకు భావించకూడదు? కశ్మీర్ లోయలో ఇంతకంటే భయంకరమైన సంఘటనలు ఏళ్ల తరబడి చోటు చేసుకున్నాయి. ఇక్కడ జరిగిన సంఘటనలకు మసి పూసి మారేడు కాయ చేసిన మీడియాలోని ఒక వర్గం నేడు మణిపూర్ సంఘ టనలను భూతద్దంలో చూపించి, రాక్షసానందం పొందాలని చూడడం ఒక వైచిత్రి. కుకీలు క్రైస్తవ మతానికి చెందిన వారనీ, మైతేయిలు హిందూ మతానికి చెందిన వారనీ రాష్ట్రంలోని ప్రభుత్వం కుకీల పట్ల పక్షపాతం ప్రదర్శిస్తుందనీ, మోదీ ప్రభుత్వ వ్యతిరేక వర్గం తన పైశాచికతకు పదును పెట్టింది. దహనం చేయబడ్డ మైతేయిల ప్రాంతాలు, శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎవరికీ ఎరుకరావు. ముఖ్య మంత్రిని తొలగించి, రాష్ట్రపతి పరిపాలన అమలు చేస్తే, ఘర్షణలు సద్దు మణుగుతాయని కాంగ్రెస్ పార్టీ చెప్పే నీతులు పనికి వచ్చేవి కావు. ఈ ప్రయోగాన్ని తాను కశ్మీర్ రాష్ట్రంలో చేసి, చేతులు కాల్చుకున్నదనే విషయం దేశ ప్రజలందరికీ తెలుసు. కుకీలను రెచ్చగొట్టడంలో కాంగ్రెస్ పాత్ర పరోక్షంగా ఉందనే విమర్శకుల అభిప్రాయాలను కొట్టి పారేయలేం.

ఇక మణిపూర్ సంఘటనలపై ప్రతిపక్షాలు చేసే విమర్శలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలు చేసే ప్రతి విమర్శల్లో రాజకీయ విజ్ఞత కొరవడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో హత్యలు మానభంగాల కేసులు తారస్థాయికి చేరుకున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింస, దౌర్జన్యాలూ వాస్తవమే. అక్కడి సంఘటనలను చూపించి, మణిపూర్ సంఘటనలను కప్పిపుచ్చాలని చూడడం భావ్యం కాదు. కుకీలకు మైతేయిలకు మధ్య సాంస్కృతిక, భౌగోళిక విభేదాలను అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు దేశ విశాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని పరిష్కరించడానికి ముందుకు రావాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

మత సామరస్యానికి ప్రతీక

హిందూ, ముస్లింలు కలిసి మెలిసి జరుపుకొనే పండుగలలో మొహర్రం (పీర్ల) పండుగ ముందు వరుసలో ఉంటుంది. ముస్లిం సోదరుల కంటే చాలా చోట్ల హిందువులే భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఈ పండుగ జరుపుకొంటారు. కొన్ని చోట్ల హిందువులే పీర్ల పండుగ నిర్వాహకులుగా ఉంటారు. అటువంటి ఊళ్లలో హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'జాలిగామా' ఒకటి.

ఈ గ్రామంలో సారా అమ్మడం వృత్తిగా జీవించిన ఆరెకటికవారిని ఇప్పటికీ సారోళ్లు (సారావాళ్లు) అని వ్యవహరిస్తారు. గత రెండు మూడు వందల ఏళ్ల నుండి మొహర్రం పీర్ల పండుగను ఈ సారోళ్లు నిర్వహిస్తూ ఉండడం వల్ల వీరి ఇంటి పేరు 'సాహెబ్ జాదా'గా మారింది. ఈ వ్యాస రచయిత ఆ కుటుంబానికి చెందినవాడే.



నాలే హైదర్, హిమామ్ ఖాసీం, లాల్ సాహెబ్ పేర్లతో పిలిచే మూడు పీర్లను మొహర్రం పండుగకు పది రోజుల ముందే నిలబెట్టి భక్తి విశ్వాసాలతో కొలుస్తారు. పీర్ల పండుగకు ముందు రాత్రి చావిడి (పీర్ల కొట్టం) దగ్గర మొత్తం గ్రామమంతా మేల్కొని జాగారం చేస్తుంది. ఆ రాత్రి ఒక కట్టెకు చాదర్లు కట్టి, కొబ్బరి బట్టీల దండలు, పూల మాలలతో అలంకరించి ఊదు పొగ వేస్తూ ఊరంతా ఊరేగిస్తారు. పీర్లకొట్టం దగ్గర అగ్ని గుండం ఏర్పాటు చేసి యువకులు గుండ్రంగా తిరుగుతూ దులావ్ ఆడుతారు. మహిళలు బతుకమ్మ, కోలాటం ఆడుతూ, పాటలు పాడుతూ రాత్రి మొత్తం గడుపుతారు.

జాలిగామా పీర్లను మొక్కితే వివాహం కాని వారికి వివాహం అవుతుందనీ, పిల్లలు పుట్టని వారికి పిల్లలు పుడతారనీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయనీ, ప్రజలకు ఆరోగ్యం బాగుంటుందనేది ప్రజల విశ్వాసం. దీనితో చుట్టు పక్కల గ్రామాల వారు, హైదరాబాద్ నగరం నుంచి కూడా పెద్ద ఎత్తున జనం తరలి వచ్చి పాల్గొంటారు. మలీదా, షర్బత్, రోట్, చొంగ్, జిలేబి, తియ్యని బూంది, కొబ్బరి బట్టీలు... పీర్లకు ప్రసాదంగా సమర్పిస్తారు. పీర్ల పండుగ రోజు 'జాతర అంగడి' నిర్వహించి అన్ని రకాల వస్తువులు, బట్టలు, పిండి వంటలు విక్రయిస్తారు. వందల ఏళ్ల క్రితం జాలిగామా గ్రామం చెరువులో చేతి ఆకారంలో 'పంజా' దొరికిందనీ, అప్పటి నుంచి ఆ ఊరిలో పీర్లను నిలబెట్టి పీర్ల పండుగను పెద్ద ఎత్తున జరుపుతున్నారనీ చెబుతారు.

'కర్బలా' మైదానంలో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన హస్సేన్, హుస్సేన్ సోదరుల సంస్మరణార్థం ముస్లింలలో ఒక వర్గం ప్రజలు పదిరోజులు నిరసన దినాలుగా పాటిస్తారు. నల్లబట్టలు ధరించి ఆ సోదరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడుతుంటారు.

– డా॥ సాహెబ్ జాదా విజయ భాస్కర్, టీచర్ । 92908 26988
(రేపు మొహర్రం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.దశమి ఉ.9.38 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అనూరాధ రా.9.10 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.38 నుండి 4.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.51 నుండి 12.24 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

పద్మ అవార్డులకు నామినేషన్ల స్వీకరణ

సాక్షి, అమరావతి: కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2024 గణతంత్ర దినోత్సవం రోజున ప్రదానం చేసే పద్మ అవార్డులకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు శాప్ ఎండీ హర్షవర్ధన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన క్రీడాకారులు www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి విజయవాడలో సీ ఫుడ్ ఫెస్టివల్

- రూ.699కే అన్‌లిమిటెడ్ సీఫుడ్ బఫెట్

సాక్షి, అమరావతి: స్థానిక వినియోగం పెంచడం, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించడం లక్ష్యంగా విజయవాడలో ఏ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నుంచి 3 రోజుల పాటు దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది. పలు రకాల సముద్ర చేపల ప్రదర్శనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర'పేరిట పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తోన్న ఆక్వా హబ్స్, ఫిష్ అవుట్‌లెట్స్ నిర్వాహకులు తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఫెస్టివల్‌లో పాల్గొనే ప్రజలకు అన్ లిమిటెడ్ సీ ఫుడ్ బఫెట్‌ను కేవలం రూ.699లకే అందిస్తున్నారు. రాష్ట్రంలో లభించే చేపలు, సముద్రపు ఆహారం గుణగణాలను వాటిలో ఉండే పోషక విలువలను ప్రజలకు వివరించి వారిపై మత్స్య ఉత్పత్తుల వినియోగంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు చెప్పారు.

108 అంబులెన్స్ డ్రైవర్ సాహసం

- వరద నీటిలో వాహనం నడిపి రోగి ప్రాణాలు కాపాడిన కార్తీక్



వరద నీటిలో రోగిని తీసుకువస్తున్న అంబులెన్స్ డ్రైవర్ కార్తీక్

పెనుగంచిప్రోలు: వరద నీటిలో 108 వాహనం నడిపిన డ్రైవర్.. రోగి ప్రాణాలను కాపాడాడు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన డయాలసిస్ పేషెంట్ కొలగంటి బాబూరావు తీవ్ర అనారోగ్యానికి గురి కావటంతో గురువారం అత్యవసరంగా 108లో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించాల్సి వచ్చింది. వత్సవాయి నుంచి లింగాల మీదుగా వచ్చేందుకు మున్నేరు వరద ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచి పోయాయి. పెనుగంచిప్రోలు మున్నేరు కాజ్‌వేపై కూడా వరద నీరు చేరుతోంది. రోగి కోసం ధైర్యంతో డ్రైవర్ కార్తీక్ కాజ్‌వేపై 108 వాహనం నడిపి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి చేర్చాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


కాలిన గాయాల చికిత్సపై ఎయిమ్స్‌లో వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ అనంత సిన్హా తదితరులు


మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో గురువారం కాలిన గాయాల చికిత్సపై వర్క్‌షాప్ జరిగింది. ఇందులో నేషనల్ అకాడమీ ఆఫ్ బర్న్స్ ఇండియా (ఎన్ఏబీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ అనంత సిన్హా చికిత్స గురించి వివరించారు. దేశంలో ఏటా 70 లక్షల మంది కాలిన గాయాలకు గురి అవుతున్నారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది బర్న్ పేషెంట్లకు సకాలంలో వైద్యం అందిస్తే వైకల్యాన్ని నివారించవచ్చునన్నారు. కాలిన గాయాలకు మొదటి 24 గంటల్లో చికిత్స ఎలా నిర్వహించాలి, అనంతరం శస్త్ర చికిత్సలు, వాటి నిర్వహణ, పోషకాహారం ప్రాముఖ్యత, కాలిన గాయాల మచ్చలకు చికిత్స విధానంపై వర్క్‌షాప్‌లో వివరించారు. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మెడికల్ కళాశాలల నుంచి 300 మంది వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పలు విభాగాల వైద్యులు, నర్సులు శిక్షణ పొందారు.

భక్తుల బసకు కంటైనర్లు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువ అయినప్పుడు తాత్కాలికంగా బస చేసేందుకు వీలుగా విశాఖకు చెందిన దాత శ్రీ మూర్తి విరాళంగా అందజేసిన 2 మొబైల్ కంటైనర్లను గురువారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ప్రారంభించారు. ఒక కంటైనర్‌ను జీఎన్‌సీ వద్ద ఉన్న టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ డిపోలో విధులు ముగించుకుని డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు కేటాయించారు. మరో కంటైనర్‌ను రాంభగీచా–3 ఎదురుగా ఏర్పాటు చేశారు. వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..మొబైల్ కంటైనర్లలో భక్తులు బస చేసేందుకు పరుపులు, స్నానపు గది, మరుగుదొడ్లు ఉన్నాయని చెప్పారు. ఈ కంటైనర్ల విలువ రూ.25 లక్షలు అని తెలిపారు. తిరుమలలో అన్నమయ్య భవనం ఎదురుగా నిర్మించిన కావేరి విశ్రాంతి గృహాన్ని చైర్మన్, ఈవో ప్రారంభించారు.

'బ్రహ్మ మల్లిక' కనువిందు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ గుడి వద్ద అరుదైన బ్రహ్మ మల్లిక పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. ఆఫ్రికా ఖండంలోనే పెరిగే బ్రహ్మ మల్లిక (బావోబాబ్) వృక్షాలను ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణ ఆలయ ప్రాంగణంలో పెంచుతున్నారు. అరుదైన ఈ మొక్కల విత్తనాలను సత్యనారాయణ ఆరేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో ఆఫ్రికా నుంచి తెప్పించి 7 మొక్కలను పెంచారు. అవి ఇప్పుడు పువ్వులు పూసి కాయలు కాసాయి. ఈ మొక్కలు 40 అడుగుల ఎత్తు పెరగడమే కాకుండా 3వేల ఏళ్ల పాటు బతికే అవకాశం ఉందన్నారు. బావోబాబ్ వృక్షాన్ని తెలుగులో బ్రహ్మ మల్లిక అని అంటారు. ఎత్తుగా, లావుగా పెరిగే ఈ వృక్షానికి తెలుపు రంగులో పుష్పాలు పూస్తాయి. వీటి పండ్లు ఎండిన తర్వాత వాటిలో తెల్లగుజ్జు రొట్టె ముక్కలా కనిపిస్తుంది.




తీరంలో నీలి తిమింగలం

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం పాతమేఘవరం, డి.మారువాడ మధ్యన సముద్రతీరానికి భారీ నీలి తిమింగలం గురువారం కొట్టుకొచ్చింది. 25 అడుగుల పొడవు, 5 టన్నుల బరువు ఉంది. దీన్ని చూసేందుకు భారీగా ప్రజలు తీరానికి వచ్చారు. – సంతబొమ్మాళి

కృష్ణా నదిలో వరద జోరు

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల గేట్లు ఎత్తివేత

- శ్రీశైలం ప్రాజెక్టులోకి 71,547 క్యూసెక్కులు
- తుంగభద్రలోనూ పెరిగిన వరద ఉధృతి
- మూసీ నుంచి పులిచింతలలోకి 18,239 క్యూసెక్కులు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1,37,294 క్యూసెక్కులు సముద్రంలోకి
- నేడు కూడా కృష్ణాలో వరద కొనసాగే అవకాశం



సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్: పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి గురువారం సాయంత్రం 6 గంటలకు 1.65 లక్షల క్యూసెక్కులు చేరుతుండటం.. నీటి నిల్వ 93.28 టీఎంసీలకు చేరుకోవడంతో గేట్లు ఎత్తి దిగువకు 1.75 లక్షల క్యూసెక్కులను కర్ణాటక అధికారులు వదులుతున్నారు. ఇప్పటికే నారాయణపూర్ డ్యామ్ నిండుకుండలా మారడంతో.. గేట్లు ఎత్తేసి దిగువకు 1.18 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో గేట్లు ఎత్తి 27,846, విద్యుదుత్పత్తి చేస్తూ 42,576 వెరసి 70,422 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఈ జలాలకు హంద్రీ నుంచి 1,125 క్యూసెక్కులు తోడవుతుంటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి 71,547 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 817.7 అడుగుల్లో 39.2 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తుండటంతో మూసీ నుంచి పులిచింతలలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 18,239 క్యూసెక్కులు చేరుతుండటంతో పులిచింతలలో నీటి నిల్వ 21.88 టీఎంసీలకు చేరుకుంది. పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మున్నేరు వరదకు కట్టలేరు, పాలేరు, వైరా, వాగులు, వంకల ప్రవాహం తోడవుతున్నాయి. దీంతో గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,37,294 క్యూసెక్కులు చేరుతుండటంతో.. అంతే స్థాయిలో అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారు. బేసిన్‌లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం కూడా కృష్ణా నదిలో ఇదే రీతిలో వరద కొనసాగే అవకాశం ఉంది.

గురువారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1,697.57	93.28	1,65,833	1,75,000
నారాయణపూర్	1,615	37.64	1,609.71	30.61	1,42,000	1,18,980
ఉజ్జయిని	1,630	117.64	1,606.92	55.51	21,201	-
జూరాల	1,045	9.66	1,042.22	7.97	34,000	70,422
తుంగభద్ర	1,633	105.79	1,615.59	49.76	1,11,566	-
శ్రీశైలం	885	215.81	817.70	39.2	71,547	-
నాగార్జునసాగర్	590	312.05	515.60	141.38	0	-
పులిచింతల	175	45.77	156.66	21.88	18,239	-
ప్రకాశం బ్యారేజ్	57.05	3.07	57.05	3.07	1,37,294	1,37,294

సగం నిండిన తుంగభద్ర

కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్ర బేసిన్‌లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో తుంగభద్రలో వరద ప్రవాహం మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,11,566 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 49.76 టీఎంసీలకు చేరుకుంది. అంటే తుంగభద్ర డ్యామ్ దాదాపుగా సగం నిండింది. వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే ఈనెల 31 నాటికి తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తే అవకాశం ఉంది. అప్పుడు తుంగభద్ర జలాలు కూడా సుంకేశుల బ్యారేజ్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతాయి.

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు

- అప్రమత్తమైన పోలీసులు
- విస్తృత కూంబింగ్



ఏవోబీలో పోలీసు బలగాల గాలింపు చర్యలు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): నిషేధిత మావోయిస్టు పార్టీ ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరవీరుల వారోత్సవాలకు పిలుపునిచ్చింది. మావోయిస్టుల వారోత్సవాలతో ఆంధ్రా, ఒడిశా సరిహద్దుతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతమంతా పోలీసుశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. భారీగా పోలీసు బలగాలు కూంబింగ్ చర్యలు చేపడుతున్నాయి. మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరిట ఇటీవల విడుదలైన లేఖలో అమరవీరుల వారోత్సవాలతో సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీంతో మావోయిస్టుల అమర వీరుల వారోత్సవాలను భగ్నం చేసే లక్ష్యంగా ఎస్పీ తుహిన్‌సిన్హాతో పాటు ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల పోలీసు అధికారులంతా వ్యూహాత్మంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి పోలీసు బలగాలు అడవిలో జల్లెడ పడుతున్నాయి. ప్రజాప్రతినిధులను మారుమూల ప్రాంతాల పర్యటనలను రద్దు చేసుకోవాలని పోలీసుశాఖ నోటీసులు జారీ చేసింది. అలాగే మారుమూల ప్రాంతాల ఆర్టీసీ బస్సులను కూడా రద్దు చేశారు.

నిండుగా గోదావరి

- బాబ్లీ నుంచి ధవళేశ్వరం వరకూ ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- రికార్డు స్థాయిలో ప్రవహిస్తున్న వరద
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- విలీన మండలాలు, లంక గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం



భారీ వర్షాలకు ఏలూరు జిల్లా చింతలపూడి పరిధిలో ఎర్రకాల్వ ప్రాజెక్టు జలకళతో కళకళలాడుతున్న దృశ్యం

సాక్షి, అమరావతి/సాక్షి అమలాపురం/సాక్షి ప్రతినిధి, ఏలూరు/చింతూరు/ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి చిట్టచివరి బ్యారేజీ ధవళేశ్వరం వరకూ నిండుగా ప్రవహిస్తోంది. బాబ్లీతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి ఎప్పటికప్పుడు వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూలై నాలుగో వారంలోనే గోదావరి బాబ్లీ నుంచి ఇంతలా ప్రవహించడం చరిత్రలోనే తొలిసారి అని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బాబ్లీ నుంచి గురు వారం రాత్రి 9 గంటలకు తెలంగాణలోని శ్రీరాంసాగర్‌లోకి 2,92,889 క్యూసెక్కులు వస్తుండటంతో నీటి నిల్వ 78.36 టీఎంసీలకు చేరుకుంది. శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, కాళేశ్వరం, సమ్మక్క గేట్లు ఎత్తి భారీగా వరద నీరు దిగువకు వదిలేస్తున్నారు. భద్రాచలం వద్దకు గురువారం రాత్రి 9 గంటలకు 11,77,133 క్యూసెక్కులు వస్తుండటంతో నీటి మట్టం 48.70 అడుగులకు చేరుకుంది. భద్రాచలం నుంచి పోలవరం ప్రాజెక్టులోకి 11,81,219 క్యూసెక్కులు చేరుతుండగా 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి గురువారం రాత్రి 9 గంటలకు 13,24,274 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి మట్టం 14 అడుగులకు చేరుకుంది. దాంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. గోదావరి డెల్టాకు నాలుగు వేల క్యూసెక్కులను విడుదల చేస్తూ బ్యారేజ్ 175 గేట్లను ఎత్తేసి 13,20,274 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి లేదా ఆదివారం ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి ఎగువ నుంచి 19 నుంచి 21 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్యారేజ్‌లో నీటి మట్టం 17.75 అడుగులు దాటితే.. అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

విలీన మండలాల్లో వరద ఉధృతి

గోదావరికి తోడు శబరి ఉధృతి కారణంగా విలీన మండలాలైన కూనవరం, వీఆర్‌పురం, చింతూరుల్లో వరద గురువారం రాత్రి వరకు పెరుగుతూనే ఉంది. దీంతో ఈ మండలాల్లో 93 గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. పోలవరం ముంపు మండలమైన వేలేరుపాడులో 33 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు చెందిన పదివేల కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. జాతీయ రహదారులు–30, 326 పైకి చేరడంతో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

లంకలను చుట్టుముడుతున్న వరద నీరు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లంక గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టుతోంది. వరద పెరగడంతో లంకల్లో వరద నీరు చేరుతోంది. గ్రామాలకు వెళ్లే కాజ్‌వేలు నీట మునిగాయి. శుక్రవారం ముంపు మరింత పెరగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని బూరుగులంక రేవులో 20 మంది సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసి గర్భిణీలు, పిల్లలు, వృద్ధులను తరలిస్తున్నారు.

బలహీనపడిన అల్పపీడనం

- రాష్ట్రంలో మరో రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు
- మునేరు ఉధృతితో విజయవాడ–హైదరాబాద్ మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షి, నెట్‌వర్క్: అల్పపీడనం బలహీనపడటంతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టింది. శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం గురువారం తెలిపింది. ఉత్తరాంధ్రకు ఆనుకుని దక్షిణ ఒడిశా, దాని పొరుగు ప్రాంతాలపై విస్తరించిన అల్పపీడనం బలహీనపడి దక్షిణ ఒడిశా, దానికి ఆనుకుని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన జల్లులు పలు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఆదివారం పలు చోట్ల తేలికపాటి జల్లులకు అవకాశం ఉంది.

ప్రాజెక్టుల్లో జలకళ

రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. బుధవారంతో పోల్చితే గురువారం పలు జిల్లాల్లో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 2.24 సెంటీ మీటర్లుగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 6.02 సెంటీ మీటర్లు, విశాఖపట్నం జిల్లాలో 5.24 సెంటీ మీటర్లు, కృష్ణా జిల్లాలో 4.48 సెంటీ మీటర్లు, నంద్యాల జిల్లాలో 4.43 సెంటీ మీటర్లు, ఎన్టీఆర్ జిల్లాలో 4.19 సెంటీ మీటర్లు చొప్పున అత్యధిక వర్షపాతం కురిసింది. తిరుపతి జిల్లాలో 0.21 సెంటీ మీటర్లు అత్యల్ప వర్షపాతం నమోదైంది. బుధవారం అర్ధరాత్రి వరకూ కురిసిన వర్షాలతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలు ఏర్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడటంతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులు, చెరువులు వరద నీటితో కళకళలాడుతున్నాయి. ఎర్రకాల్వ, తమ్మిలేరు ప్రాజెక్టుల నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది.

విజయవాడ–హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ మళ్లింపు

మున్నేరు వాగు ఉధృతి కారణంగా ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం, కీసర గ్రామంలో 65వ జాతీయ రహదారిపై నీరు ప్రవహిస్తున్న కారణంగా విజయవాడ –హైదరాబాద్ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడలోని పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఆయన వివరాలు చెప్పారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి, మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి మీదుగా వెళ్లాలన్నారు. వరద ప్రవాహం తగ్గే వరకు ఈ సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. వరద నీటిలో వాహనాలు నడిపే సాహసం చేయవద్దని హెచ్చరించారు. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద గురువారం భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో నగర డీసీపీ విశాల్‌గున్నీ, వెస్ట్‌జోన్ ఏసీపీ హనుమంతరావు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మైలవరం, తిరువూరు, ఖమ్మం మీదుగా మళ్లించారు.

కులవాదుల చర్యలతో బహుజనులకు తప్పని బాధలు

- 1,033వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: బాబు అండ్‌కో ఆధ్వర్యంలో కులవాదులు చేస్తున్న చర్యలతో 29 గ్రామాల్లోని బహుజనులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,033వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికలను పక్కన బెట్టి.. తన స్వార్థం కోసం బాబు అడ్డదారిలో వెళ్లినందునే రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. రాజధాని పేరుతో రూ.3.50 లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క శాశ్వత నిర్మాణం చేయకుండా ఈ ప్రాంతాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు.. అమరావతి ఉద్యమం పేరుతో మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నాడని మండిపడ్డారు. రాజధానిలో పేదలకు ఇళ్ల నిర్మిస్తుంటే గగ్గోలు పెడుతున్న బాబు అండ్ కో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చిన ఆర్–5 జోన్‌లో ఎలక్ట్రానిక్ హబ్ నిర్మిస్తానని చెప్పి అక్కడ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో రైల్వే లైన్, మెట్రో నిర్మాణం చేసి రూ. 21 వేల కోట్లు ఇస్తామని చెప్పిన బీజేపీ ఎంత నిధులు కేటాయించిందో చెప్పి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడాలన్నారు. మార్గదర్శి కేసులో నిందితుడుగా ఉన్న రామోజీ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు బహుజనుల ఇళ్ళ స్థలాలపై పత్రికలో విషం కక్కడం ఆయన దుష్ట బుద్ధికి నిదర్శనమని చెప్పారు. నాయకులు బేతపూడి సాంబయ్య, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో ప్రధాన కార్యాలయమైన విజయవాడలోని విద్యుత్ సౌధతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆపరేషన్ సర్కిల్ కార్యాలయాల వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. జేఏసీ ఆధ్వర్యాన గురువారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని, అప్పటికీ తమ డిమాండ్లు పరిష్కరించపోతే నిరవధిక సమ్మె చేస్తామని నాయకులు తెలిపారు. వన్‌మెన్ కమిషన్ సిఫారసులు పక్కనపెట్టి పీఆర్సీ ఇవ్వాలని, కొత్త జిల్లాలకు కొత్త పోస్టులతో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వారికి శాశ్వత ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు ఇవ్వాలని, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2(ఎనర్జీ అసిస్టెంట్)లు విధినిర్వహణలో చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్యం అందించాలని, నాణ్యమైన పరికరాలు, పనిముట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని తదితర 12 ప్రధాన డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చాలని ఉద్యోగులు కోరారు. కాగా, ఈ ఆందోళనల వల్ల వినియోగదారులకు విద్యుత్ సరఫరాను అందించడంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు 'సాక్షి'కి తెలిపారు.

ముంపు బాధితులకు బాసటగా నిలవండి

- అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- ఆహారం, తాగునీరు, ఇతర వసతుల్లో ఏ లోటూ ఉండకూడదు
- గోదావరిలో వరద పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన
- సహాయక చర్యల కోసం ఇప్పటికే రూ.12 కోట్లు విడుదల
- వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధం

సాక్షి, అమరావతి: గోదావరిలో వరద పెరుగుతుండడంతో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల వల్ల ఉప నదులు పొంగి ప్రవహిస్తుండడంతో గోదావరి తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ ముంపు బాధితులకు బాసటగా నిలవాలని ఆదేశించారు. వరదలు, వర్షాల నేపథ్యంలో గురువారం ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో పరిస్థితులను అధికారులు సీఎంకు వివరించారు. 42 మండలాల్లోని 458 గ్రామాల పట్ల అప్రమత్తంగా ఉన్నామని, మూడు ఎన్‌డీఆర్ఎఫ్, నాలుగు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని వెల్లడించారు. భారీ వర్షాలు కురుస్తున్న ఇతర ప్రాంతాల పరిస్థితిని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి నదికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్స్ పని చేస్తున్నాయని, ముంపునకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో బోట్లు సహా సహాయక సిబ్బందిని సిద్ధం చేశామని చెప్పారు. ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు, ఇతర మండలాల్లో ఇప్పటికే సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి, ముంపు ప్రాంత ప్రజలను తరలించామన్నారు. ఆహారం, మందులు ఇతరత్రా అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. కోనసీమ జిల్లాలో 150 బోట్లను సిద్ధంగా వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని మూడు మండలాల్లో ముంపునకు ఆస్కారం ఉన్న గ్రామాల్లో సహాయక బృందాలు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సహాయక శిబిరాల్లో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని, తాగు నీరు ఇతరత్రా సదుపాయాల విషయంలో ఎక్కడా లోటు రాకూడదని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని, వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, ఆ మేరకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

వరద ప్రభావిత జిల్లాలకు నిధులు విడుదల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద ప్రాంతాల్లో సహాయ పునరావాస చర్యల కోసం రూ.12 కోట్లు విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామ రాజు, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు రూ.3 కోట్లు చొప్పున, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.2 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేశారు. ముంపు గ్రామాల నుంచి వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వాళ్లకు తాగునీరు, ఆహారం, పాలు వంటివి సమకూర్చడం, హెల్త్ క్యాంప్‌లు, పారిశుధ్య నిర్వహణ, తదితర పనుల కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. బాధితులను తరలించేందుకు ఏపీఎస్ఆర్‌టీసీ బస్సులను ఉపయోగించాలని, తుపాన్ షెల్టర్లతో పాటు అవసరమైతే స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా వాడుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో రోడ్లపై కూలిపోయిన చెట్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని తెలిపారు.

9, 10 తేదీల్లో ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు: రాష్ట్రంలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో తొలి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన 765 సీట్లను భర్తీ చేసేందుకు ఆగస్టు 9, 10 తేదీల్లో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండో విడత కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆగస్టు నాలుగో తేదీన ప్రకటిస్తామని చెప్పారు. రెండో విడత కౌన్సెలింగ్‌ను నాలుగు ట్రిపుల్ ఐటీలకు కలిపి నూజివీడులోనే నిర్వహిస్తామని తెలిపారు.

'కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో విస్తృత అవకాశాలు'

సాక్షి, అమరావతి: ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో విశ్వవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవా లని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను పరిశ్రమల రంగంతో అనుసంధా నం చేసే ప్రక్రియలో భాగంగా గురువారం హెచ్‌సీఎల్ టెక్ సంస్థతో కలిసి సాంకేతిక విద్యాశాఖ రాష్ట్రస్థాయి వెబినార్ నిర్వహించింది. ఈ వెబినార్‌లో 22 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుంచి 740మంది విద్యార్థులు, 171మంది కంప్యూటర్ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మణిపూర్ ఘటనపై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మణిపూర్‌లో లైంగికదాడి ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టనుంది. ఈ కేసు విచారణను రాష్ట్రం వెలుపల, అస్సాంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారి ఒకరు తెలిపారు. దీనిపై ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనుంది. రాష్ట్రంలో ఘర్షణలకు సంబంధించిన అయిదు తీవ్రమైన కేసులను ఇప్పటికే దర్యాప్తు జరుపుతున్న సీబీఐకే మే 4 నాటి కేసును కేంద్రం అప్పగించింది. కాగా, మణిపూర్‌లో ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు చెందిన కొందరు ఎంపీలు పర్యటించనున్నారు.

ఆగస్టు 25, 26న 'ఇండియా' కూటమి సమావేశం

న్యూఢిల్లీ: 26 పార్టీలతో కూడిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తదుపరి సమావేశం ఆగస్టు 25, 26న మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరుగనుంది. ఈ భేటీకి శివసేన(ఉద్ధవ్ ఠాక్రే), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(శరద్ పవార్) ఉమ్మడిగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. విపక్షాల తొలి సమావేశం బిహార్ రాజధాని పాట్నాలో, రెండో సమావేశం కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన సంగతి తెలిసిందే. ముంబైలో జరిగే మూడో సమావేశంలో ప్రధానంగా సీట్ల పంపకంపై విపక్ష నాయకులు చర్చించనున్నట్లు సమాచారం.

కిమ్‌తో రష్యా మంత్రి భేటీ



సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయుగు భేటీ అయ్యారు. ప్రాంతీయ భద్రత, సైనిక అంశాలపై ఆయనతో చర్చించినట్లు ఉ.కొరియా అధికారిక మీడియా తర్వాత వెల్లడించింది. 1950–53 కొరియా యుద్ధానికి విరామం పలికి 70 వసంతాలు పూర్తిచేసుకుంటున్న వేళ కిమ్‌తో రష్యా రక్షణ మంత్రి సమావేశంకావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పాంగ్‌యాంగ్‌లో సమావేశమైన సెర్గీ, కిమ్‌లు పలు అంశాలపై పరస్పర ఒప్పందానికి వచ్చారు. రష్యా రక్షణ మంత్రి సెర్గీని కిమ్ ఆయుధాల ఎగ్జిబిషన్‌కు తీసుకువెళ్లారు. అందులో ఉ.కొరియా ఇటీవల ప్రయోగించిన క్షిపణి వేరియంట్లను దగ్గరుండి చూపించారు.



బిలియనీర్ల దగ్గర్నుంచి రాజకీయ నాయకుల వరకు, క్రీడాకారుల దగ్గర్నుంచి నటీనటుల వరకు అదృశ్యం కావడం చైనాలో సర్వ సాధారణంగా మారింది. కొన్నాళ్ల పాటు కనిపించకుండా పోయిన తర్వాత ఏ అవినీతి ఆరోపణలో చిక్కుకోవడమో, జైలుకు వెళ్లడమో లేదంటే లో ప్రొఫైల్‌లో ఉండడమో జరుగుతోంది. ఇలా అదృశ్యమైన వారి జాబితా క్రమంగా పెరుగుతోంది. ఇన్నాళ్లు విదేశాంగ మంత్రిగా పని చేసిన చిన్‌గాంగ్ తాజాగా ఆ జాబితాలో చేరారు. నెలరోజులుగా ఆయన కనబడకుండా పోయినా ప్రభుత్వం పెదవి విప్పడం లేదు. ఆయన స్థానంలో వాంగ్ యీని విదేశాంగ మంత్రిగా నియమించింది. ఆ సమయంలోనూ చిన్‌గాంగ్ ఆచూకీపై మౌనం పాటించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అదృశ్యం అంటే.. ఇక అంతే

ఇది చైనా మిస్టరీ
పోతే జైలుకు లేదా అజ్ఞాతంలోకి
జాబితా పెరుగుతోంది
తాజాగా చిన్‌గాంగ్ పరిస్థితి ఇదే!

చైనా ప్రభుత్వ విధానాలను విమర్శించిన వారే ఇప్పటివరకు అదృశ్యమవుతూ వచ్చారు. కానీ చిన్‌గాంగ్‌ది దీనికి పూర్తిగా భిన్నం. అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడుగా ఆయనకు పేరుంది. రష్యా, వియత్నాం, శ్రీలంక నుంచి వచ్చిన అధికారులతో జూన్ 25న చివరిసారిగా ఆయన కనిపించారు. అప్పట్నుంచి ఎన్నో కీలకమైన సదస్సుల్ని చైనా వాయిదా వేసింది. కొన్ని సమావేశాలకు వాంగ్ యీ హాజరయ్యారు. చైనా సోషల్ మీడియాలో నెటిజన్లు చిన్‌గాంగ్ గురించి తెలుసుకోవాలని ప్రయత్నించినా 'నో రిజల్ట్స్ అన్న సందేశమే వస్తోంది. హాంగ్‌కాంగ్‌కి చెందిన మహిళా జర్నలిస్టు ఫు షియోన్‌తో వివాహేతర సంబంధమే చిన్‌గాంగ్ అదృశ్యానికి కారణమని తెలుస్తోంది. ప్రపంచంలోని రాజకీయ ప్రముఖుల్ని ఇంటర్వ్యూ చేసే ఆమె 2022లో చిన్‌గాంగ్‌ను ఇంటర్వ్యూ చేశారు. అదే ఆమె చివరి ఇంటర్వ్యూ. ఆ తర్వాత ఆమె కనిపించకుండా పోవడంతో ఇద్దరి మధ్య సంబంధం ఉందనే అనుమానాలున్నాయి. వివాహేతర సంబంధాలను చైనా కమ్యూనిస్ట్ పార్టీ అనుమతించదు. ఈ వ్యవహారం కారణంగానే అధ్యక్షుడితో చిన్‌గాంగ్‌కు విభేదాలు వచ్చాయన్న ప్రచారం జరుగుతోంది. చిన్‌గాంగ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కొన్నిసార్లు ప్రభుత్వం చెబుతున్నా నమ్మేట్టు లేదు.

రెన్ జికియాంగ్

చైనాలో రియల్ ఎస్టేట్ టైకూన్ రెన్ జికియాంగ్ 2020 మార్చిలో అదృశ్యమయ్యారు. కరోనా మహమ్మారిని నియంత్రించడంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ ఒక విదూషకుడు తరహాలో వ్యవహరించారంటూ వ్యాఖ్యానించిన కొద్ది రోజుల్లోనే ఆయన కనిపించకుండాపోయారు. ఏడాది తర్వాత అవినీతి ఆరోపణలపై ఆయనకు 18 ఏళ్ల జైలు శిక్ష విధించారు.

అదృశ్యమైన ప్రముఖులు వీరే

హు జింటావో

చైనా మాజీ అధ్యక్షుడు హు జింటావోను అత్యంత నాటకీయ పరిణామాల మధ్య గత ఏడాది అక్టోబర్‌లో చైనీస్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నుంచి బలవంతంగా స్టీవార్డ్స్ బయటకు తీసుకువెళ్లడం సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండు నెలల పాటు ఆయన కనిపించకుండా పోయారు. అనారోగ్య కారణాలతో ఆయన సమావేశం విడిచి వెళ్లారని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. రాజకీయ కారణాలతోనే అతన్ని సమావేశం నుంచి పంపేసినట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత డిసెంబర్‌లో చైనా నాయకుడు జియాంగ్ జెమిన్ అంత్యక్రియల సమయంలో జింటావో కనిపించారు.

జాక్ మా

చైనాలో అత్యంత సంపన్నుడు, ఆలీబాబా గ్రూప్ వ్యవస్థాపకుడు జాక్ మా 2020 చివర్లో కనిపించకుండా పోయారు. చైనా ప్రభుత్వ ఆర్థిక నియంత్రణలను విమర్శిస్తూ ప్రసంగించిన కొద్ది రోజుల్లోనే జాక్ మా అదృశ్యమయ్యారు. ఆ తర్వాత కొద్ది రోజులకే చైనా దర్యాప్తు సంస్థల నుంచి ఆయనకు సమన్లు అందాయి. ఆయన కొత్తగా పెట్టబోయే కంపెనీలకు అనుమతుల్ని ప్రభుత్వం రద్దు చేసింది. జాక్ మా సంపదలో సగానికి సగం కోల్పోయినట్టు అంచనా. అప్పట్నుంచి ఆయన ఇప్పటివరకు బహిరంగంగా ఎవరికీ కనిపించలేదు. ప్రస్తుతం ఆయన టోక్యోలో ఉన్నారని తెలుస్తోంది.

బావో ఫ్యాన్

చైనాకు చెందిన టెక్నాలజీ డీల్ మేకర్ బావో ఫ్యాన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అదృశ్యమయ్యారు. చైనా రనెసాన్స్ హోల్డింగ్స్ అనే ప్రైవేటు బ్యాంకు వ్యవస్థాపకుడైన బావోను చైనా ప్రభుత్వ ఏజెన్సీల అధికారులు విచారిస్తున్నారంటూ ఆయన కంపెనీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏ దర్యా ప్తు సంస్థలు ఆయనని విచారిస్తున్నారో, కారణాలేంటో ఇప్పటివరకు బయట ప్రపంచానికి తెలీదు.

గువో గ్వాంగ్‌చాంగ్

2015లో అదృశ్యమైన అయిదుగురు ఎగ్జిక్యూటివ్‌లలో ఫోసన్ ఇంటర్నేషనల్ గ్రూప్ చైర్మన్ గువో గ్వాంగ్‌చాంగ్ ఉన్నారు. కొన్నాళ్లు కనిపించకుండా పోయిన ఆ తర్వాత హఠాత్తుగా ఒకరోజు ప్రత్యక్షమయ్యారు. ఫుట్‌బాల్ క్లబ్‌కి యజమాని కూడా అయిన గ్వాంగ్‌చాంగ్‌ని అవినీతి కేసుల్లో దర్యాప్తు సంస్థలు అదుపులోనికి తీసుకొని తర్వాత విడిచిపెట్టినట్టు వార్తలు వచ్చాయి.

ఫ్యాన్ బింగ్‌బింగ్

రాజకీయ నాయకులు వ్యాపార వేత్తలతో పాటు చైనాలో నటీనటుల చుట్టూ అదృశ్యం మిస్టరీ నెలకొంది. 2018 జూలైలో ఫ్యాన్ బింగ్‌బింగ్ అనే నటీమణి హఠాత్తుగా కనిపించకుండాపోయారు. సోషల్ మీడియాకి ఆమె దూరమయ్యారు. బింగ్ బింగ్ చైనా విడిచి పెట్టారని, గృహ నిర్బంధంలో ఉంచారన్న వదంతులు వ్యాపించాయి. దాదాపుగా ఏడాది తర్వాత బయటకు వచ్చిన ఆమె పన్నులు ఎగ్గొట్టినందుకు 8.83 కోట్ల యువాన్‌లు జరిమానా చెల్లించారు.

పెంగ్ షూయీ

చైనా టెన్నీస్ క్రీడాకారిణి పెంగ్ షూయీ 2022లో అదృశ్యమైంది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధికారి జాంగ్ గయోలిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే ఆమె కనిపించకుండా పోయారు. ప్రస్తుతం ఆమె చైనాలోనే ఉంటున్నారని తెలుస్తోందికానీ లో ప్రొఫైల్‌లో ఉన్నారు.



సికార్‌లో బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

'రెడ్ డైరీ' కాంగ్రెస్‌ను ముంచేస్తుంది

- అందులోని అవినీతి రహస్యాలే వారిని ఓడిస్తాయి
- రాజస్తాన్‌లోని బహిరంగ సభలో ప్రధాని మోదీ విమర్శలు

సికార్(రాజస్తాన్): రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ అక్రమ, ఆర్థిక లావాదేవీల చిట్టా ఈ 'రెడ్ డైరీ'లో ఉందంటూ బహిష్కృత మంత్రి రాజేంద్ర గుఢా చేసిన ఆరోపణలకు ప్రధాని మోదీ వంతపాడారు. ఈ ఆరోపణలకు దేశవ్యాప్తంగా 1.25 పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితంచేసే కార్యక్రమం వేదికగా నిలిచింది. సికార్‌లో జరిగిన ఈ వేడుకలో ఇంకొన్ని అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. ' బ్రిటిష్ వారు దేశాన్ని వదిలివెళ్లిపోవాలని గాంధీజీ 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చారు. ఇప్పుడు ఇవ్వాల్సిన నినాదం 'అవినీతి క్విట్ ఇండియా, వారసత్వం క్విట్ ఇండియా, బుజ్జగింపు క్విట్ ఇండియా'. కాంగ్రెస్ వారి కొల్లగొట్టే దుకాణంలో కొత్త సరుకే ఈ 'రెడ్ డైరీ'. గెహ్లోట్ సర్కార్ పేపర్ లీక్ పరిశ్రమను నడుపుతోంది. కాంగ్రెస్ వారి అవినీతి రహస్యాలు అందులో దాగిఉన్నాయి. ఆ అవినీతి ఈసారి ఎన్నికల్లో వారిని ఓటమిపాలుచేయనుంది' అని మోదీ అన్నారు. ' రెడ్‌డైరీ పేజీలు తెరిస్తే చాలా మంది పెద్ద తలకాయల బండారాలు బయటపడతాయని ప్రజలే చెబుతున్నారు' అని ఆరోపించారు.

పేరు మార్చి ఏమార్చి..

'ఇందిరాగాంధీ హయాంలో ఇందిరనే ఇండియా, ఇండియానే ఇందిర' అని ప్రజల్ని ఏమార్చారు. తర్వాత యూపీయేనే ఇండియా, ఇండియానే యూపీయే' అని మభ్యపెట్టారు. బ్రిటిష్ సంస్థకు ఇండియా పదాన్ని జోడించి దేశంలో అడుగుపెట్టి దోచుకున్న ఈస్టిండియా కంపెనీ సంగతి తెల్సిందే. ఇండియా పేరున్న సిమీపై నిషేధం విధించాక ఎఫ్‌పీఐ పేరిట మళ్లీ ఉగ్రవాదులు దాడులకు దిగారు. ఇప్పుడు కాంగ్రెస్, దాని జట్టు పార్టీలు ఇదే ఎత్తుగడతో తమ కూటమికి ఇండియా అని పేరుపెట్టుకున్నాయి' అని మోదీ ఆరోపించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో మోదీ పర్యటించడం గత ఆరునెలల్లో ఇది ఏడోసారి కావడం గమనార్హం. 'ప్రజల ఆకాంక్షలు నెరవేరడంతో విపక్షాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి' అని గుజరాత్‌లోని తొలి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అయిన రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో మోదీ విమర్శించారు.

గెహ్లోట్ 'ఎరుపు' దాడి

మోదీ విమర్శలపై సీఎం గెహ్లోట్ ఘాటుగా స్పందించారు. 'ఎరుపు(రెడ్) డైరీ ఊహాత్మకం. వాస్తవానికి అలాంటిది లేదు. మాజీ మంత్రిని పావుగా వాడి రాజకీయం చేస్తున్నారు. నిజానికి అదొకటి ఉంటే మీ చేతిలో కీలుబొమ్మలైన ఈడీ, ఐటీ, సీబీఐలు ఎందుకు ఇంతవరకు దాని వివరాలు తెల్సుకోలేకపోయారు? ఎర్ర సిలిండర్(ఎల్పీజీ సిలిండర్) ఏకంగా రూ.1,150కి విక్రయిస్తూ అసలైన దోపిడీకి పాల్పడింది మోదీనే. ఎర్ర టమాటాలు రూ.150 పైగా ఎగబాకడానికి మీరే కారణం. ఇంత ధరకు సిలిండర్, టమాటాలు కొనాల్సిరావడంతో ఆగ్రహంతో ప్రజల ముఖాలు ఎర్రబడిపోయాయి. రాజస్తాన్ ప్రజలు ఈసారీ బీజేపీకి ఎర్రజెండానే చూపిస్తారు' అని అన్నారు.' రాష్ట్రానికి విచ్చేసిన మీకు మూడునిమిషాల ప్రసంగం ద్వారా ఆహ్వానం పలికే అవకాశాన్ని పీఎంఓ కార్యాలయం తొలగించింది. అందుకే ఇలా ట్వీట్ ద్వారా మీకు స్వాగతం పలుకుతున్నా' అని గెహ్లోట్ ట్వీట్‌చేశారు. దీనిపై ప్రధాని కార్యాలయం స్పందించింది. 'కాళ్లకు గాయాల కారణంగా మీరు హాజరుకావట్లేరని మీ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినందుకే షెడ్యూల్ మార్చాం. అయినా రావాలనుకుంటే ఇదే మా ఆహ్వానం. వచ్చేయండి' అని పీఎంఓ తేల్చిచెప్పింది.

సభలో అదే అలజడి

- మణిపూర్ హింసపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సిందే
- తమ డిమాండ్‌పై పట్టువీడని ప్రతిపక్ష సభ్యులు
- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, ఆందోళనల పర్వం
- పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల హోరు కొనసాగుతూనే ఉంది. విపక్ష ఎంపీలు తమ డిమాండ్‌పై ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు వచ్చి, సమాధానం ఇవ్వాల్సిందేనని వారు తెగేసి చెప్పారు. ప్రధానమంత్రి మొండి వైఖరిని నిరసిస్తూ నల్లరంగు దుస్తులు ధరించి పార్లమెంట్‌కు హాజరయ్యారు. విపక్షాల నినాదాలు, ఆందోళనలతో ఉభయ సభల్లో గురువారం సైతం వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. మణిపూర్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. మోదీ మౌనాన్ని వీడాలని, మణిపూర్ హింసపై నోరు విప్పాలని బిగ్గరగా నినాదాలు చేశారు. దీంతో అధికార బీజేపీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. 'మోదీ, మోదీ' అంటూ నినాదాలు ప్రారంభించారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష సభ్యుల నినాదాల హోరు మధ్యే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఖనిజ చట్ట సవరణ బిల్లును, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ జన్‌విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత జన్‌విశ్వాస్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. 76 కాలం చెల్లిన చట్టాల రద్దుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలియజేసింది. అనంతరం లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఆ భేటీని బహిష్కరించిన ఎంపీలు

రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశాన్ని ప్రతిపక్ష ఎంపీలు బహిష్కరించారు. మణిపూర్ అంశంపై ప్రధాని వైఖరికి నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు చెప్పారు. రాజ్యసభ బీఏసీలో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీ సమావేశాన్ని జైరాం రమేశ్(కాంగ్రెస్), మీసా భారతి(ఆర్జేడీ), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ) బహిష్కరించారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) సభ్యుడు కేశవరావు గైర్హాజరయ్యారు.

దేశాన్ని విభజిస్తున్నారు: రాహుల్

దేశాన్ని విభజించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలసికట్టుగా కుట్రపన్నుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ప్రజల దుఃఖం బాధ వారికి పట్టడం లేదు. అధికారం తప్ప వారికి మరి దేనిపైనా ఆసక్తి లేదు' అని అన్నారు. యువజన కాంగ్రెస్ గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రసంగించారు. 'బీజేపీ–ఆర్ఎస్ఎస్‌కి కావాల్సింది అధికారమే. దాని కోసం ఏమైనా చేస్తారు. అధికారం కోసం వారు మణిపూర్‌ను రావణకాష్టంలా మారుస్తారు. యావత్ దేశాన్ని నిప్పుల కుంపటి చేస్తారు. దేశ ప్రజల బాధ, శోకం వారికి పట్టదు' అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'మీరు ఒక వైపు కూర్చొని ప్రేమను పంచుతూ ఉంటారు. దేశానికి, దేశ ప్రజలకి గాయమైతే మీకూ ఆ నొప్పి తెలుస్తుంది. కానీ వాళ్లకి అలాంటి భావాలే లేవు. ఆర్ఎస్ఎస్, బీజేపీకి ప్రజల బాధ ఏంటో తెలీదు. వాళ్లు దేశాన్ని విభజించే పనిలో బిజీ' అని అన్నారు.

రాజ్యసభ నుంచి విపక్షాల వాకౌట్

రాజ్యసభలోనూ విపక్ష ఎంపీల ఆందోళన కొనసాగింది. మణిపూర్‌లో మంటలు చెలరేగుతున్నా ప్రధాని ఎందుకు మాట్లాడడం లేదని విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో చైర్మన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష నేత ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, అధికారపక్ష ఎంపీలు అడ్డుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. పునఃప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి ఠాకూర్ సినిమాటోగ్రఫీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. రాజ్యసభలో విపక్షాల తీరును ఆయన తప్పుపట్టారు. దాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఒక సమయంలో ప్రతిపక్ష సభ్యులు 'ఇండియా, ఇండియా' అంటూ నినాదాలు చేయగా, బీజేపీ సభ్యులు 'మోదీ, మోదీ' అంటూ నినదించారు. సినిమాటోగ్రఫీ సవరణ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందింది.



పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో ఖర్గే తదితరులు

76 శాతం థర్మల్ ప్లాంట్ల నుంచే

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం విద్యుత్ అవసరాల్లో దాదాపు 76 శాతం అవసరాలను థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచే సమకూర్చుకోవాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1,750 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా లోక్‌సభలో విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుకునే ఉద్దేశంతో నిర్మిస్తున్న భిన్నరకాల విద్యుత్ ప్లాంట్ల వివరాలనూ మంత్రి వెల్లడించారు. 'మొత్తంగా 25వేలకుపైగా మెగావాట్ల సామర్థ్యంతో 18 బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తున్నారు. వాటిలో ఒకటి గ్యాస్ ఆధారిత థర్మల్ ప్లాంట్ ఉంది. మొత్తంగా 18వేల మెగావాట్ల సామర్థ్యంతో 42 హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. 8వేల మెగావాట్ల సామర్థ్యంతో అణువిద్యుత్ కేంద్రాలను నెలకొల్పుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ సామర్థ్యం దేశం సొంతం. 3.6 శాతం మిగులును సాధించాం. డిమాండ్ అత్యధికంగా ఉన్నప్పుడూ 0.7 శాతం మిగులును సాధించాం' అని మంత్రి వెల్లడించారు. అయితే 2023 ఏప్రిల్–జూన్ కాలంలో మాత్రం 0.2 శాతం లోటు కనిపించిందని మరో ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా మంత్రి వెల్లడించడం గమనార్హం.

గగన్‌యాన్ మాడ్యూల్ ప్రొపల్షన్ పరీక్షలు విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరి ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో గగన్‌యాన్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం (జీఎంపీఎ్‌స)తో మరో రెండు హాట్ టెస్ట్‌లను విజయవంతంగా నిర్వహించినట్టు ఇస్రో ప్రకటించింది. సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్(ఎస్ఎంపీఎస్)ను బెంగళూరులోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్, వలియామల, తిరువనంతపురంలలో డిజైన్ చేసి, అభివృద్ధి పరిచారు. ఈ తరహాలో మొదటి హాట్ టెస్ట్‌ను ఈనెల 19న నిర్వహించారు. పేజ్–2 టెస్ట్ సిరీస్‌లో రెండు, మూడు హాట్ టెస్ట్‌లను బుధవారం చేపట్టి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. 723.6 సెకెండ్ల పాటు సాగిన ప్రారంభ హాట్‌టెస్ట్ ఆర్బిటల్ మాడ్యూల్ ఇంజెక్షన్, 100 ఎన్ థ్రస్టలు లిక్విడ్ అపోజిమోటార్ (ఎల్ఏఎం) ఇంజిన్‌ల కాలిబ్రేషన్ బర్న్‌ను ప్రదర్శించారు. నాన్ అపరేషన్ ఇంజిన్‌ను గుర్తించి, వేరు చేయడానికి కాలిబరేషన్ బర్న్ అవసరమైంది. లామ్ ఇంజిన్‌ల రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లు ఊహించిన విధంగా పనిచేయడంతో ఈ పరీక్షలు విజయవంతమైనట్లు ఇస్రో ప్రకటించింది.

ఆఫ్రికా దేశం నైగర్‌లో సైనిక కుట్ర

నియామె: పశ్చిమ ఆఫ్రికా దేశం నైగర్‌లో సైనిక కుట్ర జరిగింది. బుధవారం ఉదయం ప్రెసిడెన్షియల్ గార్డ్స్ సభ్యులు అధ్యక్షుడు మహ్మద్ బజౌమ్ నివాసాన్ని చుట్టుముట్టారు. బజౌమ్‌ను, ఆయన భార్యను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ టీవీ కేంద్రాన్ని అధీనంలోకి తీసుకుని, తమను తాము నేషనల్ కౌన్సిల్‌గా గురువారం ప్రకటించుకున్నారు. శాంతిభద్రతలు, ఆర్థిక పరిస్థితులు క్షీణించినందునే దేశ రక్షణ బాధ్యతను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్మీయే దేశ రక్షణ బాధ్యత వహిస్తుందని, బయటి శక్తుల జోక్యాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీనిపై విదేశాంగ మంత్రి హస్సౌమి మస్సౌదౌ స్పందించారు. 'సైనిక కుట్ర జరిగింది. కానీ, మేం దానిని అంగీకరించం. అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలి. తిరుగుబాటును ప్రజలు తిప్పికొట్టాలి'అని ఆయన పిలుపునిచ్చారు. తిరుగుబాటు వెనుక ప్రెసిడెన్షియల్ గార్డ్స్ జనరల్ ఒమర్ టిచనీ హస్తం ఉందనే అనుమానాలున్నాయి. ఈయన్ను బాధ్యతల నుంచి తప్పించేందుకు అధ్యక్షుడు బజౌమ్ ప్రయత్నించడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. తిరుగుబాటుకు సైన్యం కూడా మద్దతు ప్రకటించింది. ఇలా ఉండగా పొరుగుదేశం బెనిన్ అధ్యక్షుడు పాట్రిస్ టలోన్ మధ్యవర్తిగా రంగంలోకి దిగారు. ఫ్రాన్సుకు వలసదేశంగా ఉన్న నైగర్‌కు 1960లో స్వాతంత్ర్యం వచ్చింది. ఎట్టకేలకు 2021లో మహ్మద్ బజౌమ్ సారథ్యంలో తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అప్పటి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

'ఈడీ' మిశ్రా పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ: ఇప్పటికే పలుమార్లు పదవీ కాలం పొడిగింపుతో వివాదాస్పదమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ పదవీకాలంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఒక స్పష్టతనిచ్చింది. ఈఏడాది సెప్టెంబర్ 15వ తేదీదాకా ప్రస్తుత ఈడీ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా ఆ పదవిలో కొనసాగవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. ఆతర్వాత పొడగింపు ఉండబోదని తేల్చిచెప్పింది. అక్టోబర్ 15 వరకు ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రప్రభుత్వం అభ్యర్థిస్తున్న విషయం విదితమే. 'విస్తృతస్థాయి ప్రజా, జాతి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పొడిగింపును మంజూరుచేశాం. ఇకపై కుదరదు' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. 'మిశ్రా తర్వాత ఈ పదవిలోకొచ్చి వచ్చే వ్యక్తి మినహా ఈ డిపార్ట్‌మెంట్‌లో ఇంకెవ్వరూ ఈ పదవికి అర్హులులేరని చెప్పాలనుకుంటున్నారా?' అని కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. 'అలాంటి భావన వచ్చేలా చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. ఈడీ చీఫ్‌గా ఈయనే కొనసాగాలనే ఉద్దేశం కేంద్రానికి కూడా లేదు. కానీ అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)కు సంబంధించిన కీలక సమీక్ష ప్రక్రియ జరుగుతున్న ఈ తరుణంలో ప్రస్తుత ఉన్నతాధికారినే ఈడీగా కొనసాగిస్తే భారత్‌కు కలిసి వస్తుంది. ఎందుకంటే పొరుగుదేశాలు భారత్‌ను ఎఫ్ఏటీఎఫ్ వారి 'గ్రే' జాబితాలోకి నెట్టేయాలని కుట్రపన్నుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో ఈడీ చీఫ్ కొనసాగింపు అనివార్యం' అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వివరణ ఇచ్చారు.

30 ఏళ్లకు మొహర్రం

శ్రీనగర్: దాదాపు మూడు దశాబ్దాల అనంతరం మొదటిసారిగా జమ్మూలో షియా ముస్లింలు మొహర్రం ఊరేగింపు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం శ్రీనగర్ గుండా లాల్ చౌక్ ఏరియా మార్గంలో గురువారం భారీ మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఊరేగింపు సాగింది. షియాలు పెద్ద సంఖ్యలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గురుబజార్ నుంచి దాల్‌గేట్ మార్గంలో జెండాలు చేబూని శాంతియుతంగా ముందుకు సాగారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం ప్రబలిన తర్వాత..గత 30 ఏళ్లలో మొహర్రం ఊరేగింపు జరగడం ఇదే మొదటిసారని కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ తెలిపారు.

వేడుకల్లో సినిమా పాటలకు కాపీరైట్ వర్తించదు

- రాయల్టీ వసూలు చేయకూడదు
- కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాల్లో సినిమా పాటలను ప్లే చేయడం కాపీరైట్ చట్టం ఉల్లంఘన కిందకు రాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వివాహాది శుభకార్యాల్లో సినిమా పాటల ప్రదర్శన కోసం కాపీరైట్ సొసైటీలు బలవంతంగా రాయల్టీ వసూలు చేస్తున్నాయంటూ ఫిర్యాదులు వస్తుండడంతో కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. వేడుకల్లో సినిమా పాటలు వాడుకుంటే ఎవరూ రాయల్టీ వసూలు చేయకూడదని ఆదేశించింది. ఈ మేరకు డిపార్టుమెంట్ ఫర్ ప్రమోషన్, ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్సవాల సమయంలో సినిమా పాటలు ప్లే చేయడానికి రాయల్టీ వసూలు చేయడం కాపీరైట్ చట్టం–1957లోని సెక్షన్ 52(1)కు పూర్తిగా విరుద్ధమని పేర్కొంది. మతపరమైన కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో ప్రదర్శించే సాహిత్యం, నాటకం, సంగీతం లేదా ఏదైనా సౌండ్ రికార్డింగ్‌లు కాపీరైట్ చట్టం ఉల్లంఘన కిందకు రావని సెక్షన్ 52(1)(జెడ్ఏ)లో ఉందని తెలియజేసింది. వివాహ ఊరేగింపులు, పెళ్లికి సంబంధించిన ఇతర సంప్రదాయ ఉత్సవాలు, కార్యక్రమాలు మతపరమైన వేడుకల కిందకే వస్తాయని ఉద్ఘాటించింది. వివాహ వేడుకల్లో సినిమా పాటలు వాడుకున్నందుకు రాయల్టీ చెల్లించాలని కాపీరైట్ సంస్థలు డిమాండ్ చేస్తే స్పందించవద్దని సామాన్య ప్రజలకు డీపీఐఐటీ సూచించింది.

అయోధ్యలో ప్రతిష్టాపనకు ప్రధానికి ఆహ్వానం

అయోధ్య: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. జనవరిలో జరుగనున్న ఆలయ ప్రారంభోత్సవానికి శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది. గర్భాలయంలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. విగ్రహ ప్రతిష్టాపన వేడుకలో పాల్గొనాలని కోరుతూ ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపించినట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి 24వ తేదీల మధ్య సమయం ఇవ్వాలని కోరామని, ఈ మేరకు ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్యగోపాల్ దాస్ సంతకంతో లేఖ రాశామని తెలిపారు. ప్రతిష్టాపన కార్యక్రమానికి దేశ విదేశీ ప్రముఖులతోపాటు లక్షలాది మంది సామాన్య భక్తులు తరలివస్తారని, ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ట్రస్టు భావిస్తోంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి ప్రధాని మోదీ 2020 ఆగస్టులో స్వయంగా భూమిపూజ చేశారు.

పడవ మునక.. 21 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో ప్రయాణికుల పడవ మునిగిన ఘటనలో 21 మంది చనిపోయారు. మరో 40 మందిని సహాయక సిబ్బంది కాపాడారు. రిజాల్ ప్రావిన్స్ బినంగోనన్ పట్టణ సమీపంలో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన సమయంలో పడవలో ప్రయాణికులెందరున్నారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. గాలులు బలంగా వీస్తుండటంతో ప్రయాణికులంతా పడవలో ఒకే వైపునకు చేరడంతో ప్రమాదం జరిగిందన్నారు.

పురావస్తు తవ్వకాల్లో కాల్చిన మట్టి బంతి లభ్యం

తిరువొత్తియూరు: విరుదునగర్, వెంబకోట్టై సమీపంలోని పురావస్తు తవ్వకాల్లో కాల్చిన బంతి లభ్యమైంది. వివరాలు.. విరుదునగర్ జిల్లా వెంబన్‌కోట్ సమీపంలోని విజయ కరిసల్ కులంలో రెండు దశల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు తవ్విన 15 గుంతల్లో చెకుముకి బంతి, మట్టి బొమ్మలు, స్మోకింగ్ టూల్స్ సహా 3,050కి పైగా వస్తువులు దొరికాయి. ఈ క్రమంలో గురువారం తవ్విన తవ్వకాలలో చెకుముకి రాయితో తయారు చేసిన బంతి కనిపించింది. దీన్ని తొలుత కాల్చిన వస్తువుగా గుర్తించారు. పురావస్తు తవ్వకాల డైరక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పూర్వీకులు (ఆదిమానవులు) జంతువులను వేటాడే సమయంలో కాల్చిన మట్టి బంతులను వినియోగించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. 50 లక్షల మందికి ఉచిత విద్యుత్ కనెక్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు.



వ్యవసాయ సదస్సు, ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

- అన్నదాతలకు కొత్త పరిజ్ఞానంపై అవగాహన తప్పనిసరి
- వ్యవసాయ సదస్సు– 2023లో సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- తిరుచ్చి వేదికగా మూడు రోజుల పాటు నిర్వహణ
- 50 లక్షల మందికి ఉచిత విద్యుత్ కనెక్షన్లు
- కురువై ప్యాకేజీ గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

సాక్షి, చెన్నై: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సంఘం– 2023 పేరిట తిరుచ్చి వేదికగా భారీ సదస్సు, ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని గురువారం సీఎం స్టాలిన్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి 50 వేల మంది రైతులకు పాల్గొనే అవకాశం కల్పించారు. ఇక్కడ రైతు ఉత్పత్తుల, పంటలు, సాంకేతిక అంశాలు, ఆధునిక యంత్రాలు, సౌరశక్తి యంత్రాలు, పశు పోషణ, చేపల పెంపకం, సెరికల్చర్, అగ్రి ఇంజినీరింగ్ , చక్కెర ఉత్పత్తి, సీడ్ సర్టిఫికేషన్ తదితర అంశాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రోబొటిక్ సేవలు, కొత్త విధానాలను అనుసరిస్తూ చేపట్టిన సరికొత్త సాగు అంశాలను విశదీకరిస్తున్నారు. వీటన్నింటినీ సీఎం స్టాలిన్ వీక్షించారు. రైతుల నుంచి, ఆయా సంఘాలు, సంస్థల ప్రతినిధుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ వరి ఉత్పత్తిలో అధిక దిగుబడి సాధించిన ముగ్గురికి అవార్డులతో పాటు నగదు ప్రోత్సాహాన్ని సీఎం అందజేశారు. ఆ మేరకు నామక్కల్‌కు చెందిన రైతు రంగస్వామి తరపున ఆయన సతీమణి రెండో బహుమతి చెంగల్పట్టుకు చెందిన శరవణన్‌కు రూ. 75 వేలు నగదు, మూడో బహుమతి ఈరోడ్‌కు చెందిన మూర్తికి రూ. 50 వేలు నగదు ప్రోత్సాహాన్ని సీఎం అందజేశారు.

రైతు సంక్షేమానికి భరోసా

రైతులను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ, అత్యుత్తమ రంగాల్లో వ్యవసాయం కూడా ఒకటిగా మారిందన్నారు. వ్యవసాయ కార్పొరేషన్ ఏర్పాటుతో అన్నదాల సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేశామని గుర్తు చేశారు. ఇతర రంగాల తరహాలో వ్యవసాయ రంగం కూడా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే రైతు సంక్షేమానికి మరింత భరోసా, భద్రత కలిగినట్టు పేర్కొన్నారు. కలైంజ్ఞర్ గ్రామీణ సమగ్ర వ్యవసాయ అభివృద్ధి ప్రాజెక్టు, సీఎం వర్షాధార భూముల అభివృద్ధి ఉద్యమం, వ్యవసాయ భూముల్లో స్థిరమైన పచ్చదనమే లక్ష్యంగా ఉద్యమం, నీటి ప్రాజెక్టుల విస్తృతం, అగ్రి కల్చరల్ టెక్నాలజీ మేనేజ్ మెంట్ ఏజెన్సీ, వ్యవసాయ రంగంలోని యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ప్రత్యేక కార్యాచరణపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో ఏటా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతోందని గుర్తు చేస్తూ, దీనిని మరింతగా పెంపునకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. భూగర్భ జలాలను రైతులు సంవృద్ధిగా వినియోగించుకోవాలన్న కాంక్షతోనే ఉచిత విద్యుత్ కనెక్షన్లను పంపిణీ చేశామన్నారు. 2023–24లో చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకుంటున్నామని పేర్కొంటూ, ఆది ద్రావిడ, గిరిజన రైతులకు జీవనోపాధికి ప్రాధాన్యతను కల్పిస్తూ రూ. 11 కోట్లు అదనంగా కేటాయించామన్నారు. రైతుల కోసం అనేక వెబ్‌సైట్లు, యాప్‌లను ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరిస్తూ, ఇందులోని అంశాల ఆధారంగా రైతులు సాగుబడులపై దృష్టి పెట్టాలని కోరారు. కాయగూరలు, పండ్ల సాగుబడిలో రాణించే రైతులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. వ్యవసాయ రంగంలోకి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, వ్యూహాలను అంది పుచ్చుకునే విధంగా రైతులు ముందుకెళ్లాలని, ఇలాంటి ప్రదర్శనలు మరింత విస్తృతం కావాలని సీఎం పిలుపు నిచ్చారు. రైతులు ఉత్పత్తిదారుల మిగిలి పోకూడదని, అమ్మకం దారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రైతు హితాన్ని కాంక్షించే సంస్థలకు మూలధన సాయం, రుణ హామీలను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. రైతుల కోసం కురువై సాగుబడి ప్రత్యేక ప్యాకేజీ నమోదు ప్రక్రియను ఆగస్టు 15 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం తంజావూరు జిల్లా మనమేరియ పట్టి పంచాయతీలో సీఎం పర్యటించారు. అక్కడ జరుగుతున్న మహిళా హక్కు పథకం లబ్ధిదారుల ఎంపికను పరిశీలించారు.

50 వేల ఉచిత కనెక్షన్లు..

ఈ వేడుకలో 2023–24లో యాభై వేల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. 12 మంది రైతులకు కనెక్షన్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తమిళనాడు విద్యుత్ కార్పొరేషన్ ద్వారా ఈ పంపిణీ విస్తృతం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, అన్బిల్ మహేశ్ పొయ్యామొళి, తంగం తెన్నరసు, ఎస్ఎస్ శివశంకర్, టీఆర్‌పీ రాజా, తమిళనాడు ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి కేఎస్ విజయన్ పాల్గొన్నారు.



వీరమ్మాల్‌కు అవార్డుతో పాటు రూ. లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న సీఎం స్టాలిన్



కొత్త సాంకేతికతతో పుష్పాల ఉత్పత్తి, రోబో, డ్రోన్‌లను పరిశీలిస్తూ..

న్యూస్‌రీల్

ఐపీఎల్‌కు వ్యతిరేకంగా పిటిషన్

- బీసీసీఐను ఆశ్రయించాలని పిటిషనర్‌కు కోర్టు సూచన

సాక్షి, చెన్నై: ఐపీఎల్ మ్యాచ్‌లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాగా ఈ విషయంపై బీసీసీఐను ఆశ్రయించాలని పిటిషనర్, ఐపీఎస్ అధికారికి హైకోర్టు సీజే నేతృత్వంలోని బెంచ్ సూచించింది. వివరాలు.. ఐపీఎల్ మ్యాచ్‌ల క్రికెట్ అభిమానులకు ఎంతో ఉత్సాహాన్ని నింపుతున్న విషయం తెలిసిందే. భారత్‌లో జరిగే ఈ మ్యాచ్‌లను చూసేందుకు స్టేడియాలకు తండోపతండాలుగా అభిమానులు తరలి రావడం జరుగుతోంది. అదే సమయంలో ఈ మ్యాచ్‌లు అన్ని ఫిక్సింగ్, బెట్టింగ్‌లతో జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఐపీఎల్ బెట్టింగ్‌లు, ఫిక్సింగ్‌లకు వ్యతిరేకంగా ఐపీఎస్ అధికారి సంపత్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. ఐపీఎల్ మ్యాచ్‌లను బెట్టింగ్, ఫిక్సింగ్ పూర్తిగా కట్టడి అయ్యే వరకు నిర్వహించకూడదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్ గురువారం హైకోర్టు సీజే గంగా పుర్వాల, న్యాయమూర్తి ఆదికేశవులు బెంచ్ ముందు విచారణకు వచ్చింది. వాదనల అనంతరం ఈ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. బెట్టింగ్, ఫిక్సింగ్ ఫిర్యాదులను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

కొనసాగుతున్న ఉద్రిక్తత

సాక్షి,చెన్నై: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) అధికారుల తీరును నిరసిస్తూ నైవేలి పరిసర గ్రామాల్లోని ప్రజలు ఆందోళనకు దిగారు. ఈక్రమంలో పలుచోట్ల బస్సులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడులకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. కడలూరు జిల్లా నైవేలిలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ లిగ్నైట్ కార్పొరేషన్ నేతృత్వంలో స్థల సేకకరణ వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. పంట పొలాలను నాశనం చేస్తూ ప్రొక్లయినర్ల ద్వారా అధికారులు దూకుడుగా ముందుకెళ్లడాన్ని రాష్ట్రంలోని అన్నాడీఎంకే, పీఎంకే, తదితర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అధికారుల దూకుడుకు కళ్లెం వేస్తూ గురువారం కూడా ఆందోళనలు కొనసాగాయి. రైతులకు పరిహారం చెల్లించాలని, పంట పొలాలను సర్వనాశనం చేయవద్దని ఎన్ ఎల్‌సీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు సూచించారు. కాగా, ఆందోళనలు ఉధృతం అవుతుండడం, బస్సులపై రాళ్ల దాడి జరడంతో వందలాది మంది పోలీసులతో గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అదే సమయంలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ఎల్‌సీలో పనిచేస్తున్న జీవా ఒప్పంద కార్మికులు పోరుబాట పట్టడం గమనార్హం.

ముమ్మరంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు

కొరుక్కుపేట: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థ పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించక ముందే ఆసంస్థకు చెందిన తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు, నిర్వాహకుల ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు తరచూ దాడులు చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో అసాంఘిక శక్తులకు ఆర్థిక సాయం చేస్తోందంటూ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన 15 రాష్ట్రాల్లోని 93 చోట్ల ఎన్ఐఏ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఫలితంగా దేశవ్యాప్తంగా 100 మందికి పైగా అనుమానితులను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. తమిళనాడులో 8 మందిని అరెస్టు చేశారు. తదనంతరం దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థను ఐదేళ్ల పాటు నిషేధించింది. ఈక్రమంలో చెన్నై పెరంబూరు బ్యారక్స్ రోడ్డులోని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్ ఇల్లు , అలాగే పురసైవాక్కంలోని థాకర్‌వీధిలోని ఇళ్లలో ఈడీ అధికారులు గురువారం సోదాలు చేశారు. కొన్ని బ్యాంకు పాస్ పుస్తకాలు, డిజిటల్ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు తేలిసింది.

తిరుచెందూర్ ఆలయంలో తెల్ల ఏనుగు విహారం



మాడవీధుల్లో విహరిస్తున్న తెల్ల ఏనుగు

కొరుక్కుపేట: శివుడి అవతారంగా భావించే తెల్ల (పిండి చల్లిన) ఏనుగు తిరుచెందూర్ ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించింది. వివరాలు.. ఆడిమాసంలో స్వాతి నక్షత్రం రోజున తిరుకాలయ కొండపై 63 మంది నాయనార్లలో ఒకరైన సుందరమూర్తి నాయనార్‌కు శివుడు తెల్ల ఏనుగు రూపంలో దర్శనమిచ్చాడని ప్రతీతి. దీనికి గుర్తుగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక వేడుక నిర్వహించారు. అలాగే ఆలయ ఏనుగు శరీరంపై పిండి చల్లి సుందరమూర్తి నాయనార్ ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయం లోపలి ప్రాకారంలోని 108 మహాదేవ గర్భాలయం ఎదుట చేరాముల్లు , సుందరమూర్తి నాయనార్‌లు వేర్వేరు పల్లకిలపై భక్తులకు దర్శనమిచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్ నియామకంపై ఉత్కంఠ

- రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఫైల్‌పై ఎటూ తేల్చని గవర్నర్



టీఎన్‌పీఎస్సీ కార్యాలయం

సాక్షి, చెన్నై: టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మాజీ డీజీపీ శైలేంద్రబాబు నియామకానికి ఆమోద ముద్ర వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విన్నపాన్ని రాజ్‌భవన్ పట్టించుకోవడం లేదనే విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ ఫైల్‌పై గవర్నర్ సంతకం పెట్టకుండా నాలుగు వారాలుగా జాప్యం చేస్తుండాన్ని డీఎంకే పాలకులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వివరాలు.. తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య జరుగుతున్న వార్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే అనేక తీర్మానాలు, ముసాయిదాలను గవర్నర్ తుంగలో తొక్కేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్ పదవిని భర్తీ చేయాలని గత నెల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పదవిలో మాజీ డీజీపీ శైలేంద్రబాబును నియమించేందుకు నిర్ణయించారు. డీజీపీగా ఆయన గత నెల ఆయన పదవీ విరమణ పొందారు. వెనువెంటనే ఆయన్ని గౌరవించే విధంగా, ఆయన సేవలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, రాజ్ భవన్ మాత్రం ఈ విషయంపై కరుణ చూపనట్లు తెలిసింది. శైలేంద్రబాబు నియామకానికి ఆమోద ముద్ర వేయాలని రాజ్ భవన్‌కు పంపించిన ఫైల్‌పై ఇంత వరకు గవర్నర్ ఆర్ఎన్ రవి సంతకం చేయలేదని సమాచారం. 28 రోజులుగా ఈ ఫైల్ రాజ్ భవన్‌లోనే పడి ఉండటం గమనార్హం. ఇక సంతకం చేయక పోగా, అవసరమైన పక్షంలో అదనపు సమాచారాన్ని కూడా రాజ్ భవన్ కోరకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పిస్తోందని తెలిసింది. ఇలాంటి సమయంలో మరోమారు గవర్నర్ దృష్టికి టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ నియామకానికి సంబంధించి లేఖ పంపించేందుకు మానవ వనరుల అభివృద్ధి శాఖ వర్గాలు కసరత్తులు ప్రారంభించినట్లు భావిస్తున్నారు. అప్పటికే రాజ్ భవన్ నుంచి స్పందన లేకుంటే, సీఎం స్టాలిన్ తన విశేష అధికారాలను ప్రయోగించేందుకు సిద్ధమయ్యే అవకాశం ఉందనే ప్రచారం జోరందుకుంది.

5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: ధర్మపురి నుంచి కర్ణాటకకు గురువారం ఐదుటన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నించిన డ్రైవర్ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసులు ముమ్మరంగా నిఘా పెట్టాలని సివిల్ సప్లై క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం ఐజీ కామిని ఆదేశించారు. దీంతో మండల పోలీసు ఎస్పీ బాలాజీ ఆధ్వర్యంలో ధర్మపురి పౌర సరఫరాల క్రైం ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్, శక్తివేల్, వేణుగోపాల్, గోవిందన్ కారిమంగళం సమీపంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో 94 బస్తాల్లో 5000 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు.

ఆగస్టు 5న తెప్పకాడుకు రాష్ట్రపతి?

- బొమ్మన్, బెల్లి దంపతుల ఆహ్వానం మేరకు..



ద్రౌపది ముర్ము

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు జిల్లా ముదుమలై అభయారణ్యంలోని తెప్పకాడు ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయించినట్లు తెలిసింది. ది ఎలిఫెంట్ విస్పరర్స్ లఘు చిత్రంలో నటించిన బొమ్మన్ , బెల్లి దంపతుల ఆహ్వానం మేరకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వివరాలు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినానంతరం ఆధ్యాత్మిక నగరం మదురైలోని మీనాక్షి అమ్మవారి దర్శనార్థం, క్లాసికల్ సిటీ కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రం సందర్శనార్థం వ్యక్తిగత పర్యటనగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రానికి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అధికారిక పర్యటనకు ఆమె సిద్ధం అవుతున్నారు. దివంగత డీఎంకే నేత కరుణానిధి స్మారక మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాజరు కాలేక పోయిన ఆమె తాజాగా చెన్నై వర్సిటీ స్నాతకోత్సవంతో పాటు తెప్పకాడును సందర్శించనున్నట్లు తెలిసింది.

గతంలో ప్రధాని..

ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది.. ఆస్కారు అవార్డును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ లఘు చిత్రం కోయంబత్తూరు జిల్లా ముదుమలై అభయారణ్యంలోని తెప్పకాడు ఏనుగుల సంరక్షణ కేంద్రంలో చిత్రీకరించిన సమాచారంతో ఏప్రిల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆ పరిసరాలను సందర్శించారు. తాజాగా ద్రౌపది ముర్ము తెప్పకాడును సందర్శించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ చిత్రంలో గున్న ఏనుగును సంరక్షించిన బొమ్మన్ , బెల్లి దంపతులను గతవారం రాష్ట్రపతి ఢిల్లీకి పిలిపించి ఉన్నారు. రాష్ట్రపతి భవన్‌లో బొమ్మన్ , బెల్లి దంపతుల తెప్పకాడుకు రావాలని ఆహ్వానించడంతో పర్యటనకు ద్రౌపది ముర్ము సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఆగస్టు 5వ తేదీన తెప్పకాడుకు, 6వ తేదీన చెన్నై వర్సిటీ స్నాతకోత్సవానికి ఆమె హాజరు కానున్నట్లు అధికారులు వెల్లడించారు.

పన్నీరుసెల్వానికి హైకోర్టులో ఊరట

- ఆయన వారసుడికి కూడా..



పన్నీరు సెల్వం, రవీంద్రనాథ్

సాక్షి, చెన్నై: మాజీ సీఎం పన్నీరు సెల్వం, ఆయన వారసుడు రవీంద్రనాథ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. వీరి గెలుపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌లో కింది కోర్టు ఉత్తర్వులను న్యాయమూర్తి ఆనంద వెంకటేషన్ రద్దు చేశారు. వివరాలు.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పన్నీరు సెల్వం వారసుడు రవీంద్రనాథ్ ఎంపీగా పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. అలాగే 2021 ఎన్నికలలో బోడినాయనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పన్నీరు సెల్వం ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఇద్దరు నామినేషన్ పత్రాలలో అనేక వాస్తవాలను దాచి పెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొంటూ తేని కోర్టును ఆ నియోజకవర్గ ఓటరు మిలాని ఆశ్రయించాడు. తర్వాత ఈ పిటిషన్ వ్యవహారం హైకోర్టుకు చేరింది. దీంతో కోర్టు సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. దీంతో ఈ ఇద్దరూ ఇరకాటంలో పడ్డారు. కింది కోర్టు ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పన్నీరు సెల్వం, రవీంద్రనాథ్ అప్పీల్‌కు వెళ్లారు. తాము సరైన సమాచారం ఇవ్వకుండా ఉండి ఉంటే, నామినేషన్లు తిరస్కరనకు గురై ఉండేవని కోర్టులో వాదించారు. తాము ఎలాంటి తప్పుడు సమాచారం ఇవ్వలేదని, కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీంతో పన్నీరు, రవీంద్రనాథ్‌కు ఊరట కలిగే విధంగా కింది కోర్టు ఉత్తర్వులను న్యాయమూర్తి ఆనంద వెంకటేషన్ బెంచ్ రద్దు చేశారు.

నేటి నుంచి అన్నామలై పాదయాత్ర

- 128 రోజులు 234 నియోజకవర్గాల్లో పర్యటన
- రామేశ్వరానికి నేడు అమిత్ షా
- దూరంగా పళణి స్వామి



మాట్లాడుతున్న అన్నామలై

సాక్షి, చెన్నై: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్రంలో ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రకు సిద్ధమయ్యారు. శుక్రవారం రామేశ్వరంలో జరిగే ఈ యాత్ర ప్రారంభోత్సవ వేడుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. వివరాలు.. రామేశ్వరం నుంచి చెన్నై వరకు 234 అసెంబ్లీ నియోజకవర్గాలను , 39 లోక్‌సభ నియోజకవర్గాలను కలుపుతూ పాదయాత్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిర్ణయించిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం ఈ యాత్ర రామేశ్వరంలో ప్రారంభం కానుంది. ఇక్కడ జరిగే బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ పాల్గొంటారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మదురైకు వచ్చే అమిత్ షా, అక్కడి నుంచి హెలికాఫ్టర్‌లో రామేశ్వరం వెళ్తారు. అన్నామలై యాత్ర ప్రారంభమైన తర్వాత అమిత్ షా ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. యాత్రలో భాగంగా దక్షిణ తమిళనాడులోని పార్టీ ముఖ్య నేతలతో అమిత్ షా సమావేశం కానున్నట్లు తెలిసింది.

128 రోజుల పాటు..

ఈ యాత్ర కోసం చెన్నై నుంచి మదురైకు గురువారం అన్నామలై బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఈ యాత్ర బీజేపీతోపాటు మిత్ర పక్ష పార్టీల కోసం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2024లో మళ్లీ ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టడమే లక్ష్యంగా, కూటమి పార్టీలను కలుపుకుని ఈ యాత్రలో అడుగులు వేయనున్నట్లు చెప్పారు. తొమ్మిదేళ్ల పాటుగా ప్రధాని మోదీ రూపంలో తమిళనాడుకు దక్కిన ఫలాలను, నియోజకవర్గాల వారీగా ప్రజలకు వివరిస్తామన్నారు. తమిళ ప్రజల ఆదరణ, అభిమానాన్ని చూరగొంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ యాత్ర 128 రోజుల పాటు జరుగుతుందని, పది నగరాల్లో బహిరంగ సభలకు ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం మోదీ ఏం చేశారు..? అనే నినాదంతో రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేసి రామేశ్వరంలో లక్షల పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. 29వ తేదీ సాయంత్రం తొలి నియోజకవర్గంగా రామేశ్వరం నుంచి యాత్ర ప్రారంభమౌతుందన్నారు. శుక్రవారం కేవలం యాత్ర ప్రారంభోత్సవం మాత్రమేనని ఉంటుందని తెలిపారు. బహిరంగ సభలకు కేంద్ర కేబినెట్ మంత్రులు హాజరు అవుతారన్నారు. కూటమిలోని మిత్రులు యాత్రకు తమ ఆదరణ, అభిమానం చూపిస్తున్నారని, వారి ప్రతినిధులు ఈ యాత్రకు వస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ యాత్ర ప్రారంభోత్సవ వేడుకకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి హాజరు కావడం లేదు. ఆయన అనారోగ్య సమస్య పేరిట సేలంలోనే ఉండడం గమనార్హం. ఇక అన్నామలైకు వ్యతిరేకంగా పళణి స్వామి దూకుడు ప్రదర్శిస్తున్న నేపథ్యంలో.. ఆయన దూరం కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆయన తరపున ఎవరైనా అన్నాడీఎంకే ప్రతినిధులు అమిత్ షాతో కలిసి యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొంటారా..? లేదా..? అనే అంశంపై ఉత్కంట నెలకొంది.

మరో వారం పాటు వర్షాలు

- మేట్టూరులోకి కావేరి నీరు



సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఏడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం గురువారం ప్రకటించింది. కావేరి నదిలో నీటి ఉధృతి పెరగడంతో మేట్టూరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. వివరాలు.. గత నాలుగైదురోజులుగా రాష్ట్రంలో పలు జిల్లాలలో విస్తారంగా, మోస్తారు వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. చెన్నై, శివారుల్లో రాత్రులలో అక్కడక్కడ వర్షం పడుతోంది. ఈ పరిస్థితులలో ఈ వర్షాలు 7 రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. నీలగిరి, కోయంబత్తూరు, ఈరోడ్, దిండుగల్, తేని, తెన్‌కాశి జిల్లాలలో ఉరుములు మెరుపులతో, మిగిలిన చోట్ల మోస్తరుగా వర్షం పడే అవకాశం ఉందని వివరించారు. చెన్నై, శివారులలో అక్కడక్కడ వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కావేరిలోకి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నీళ్లు గురువారం వేకువ జామున మేట్టూరు జలాశయంలోకి ప్రవేశించింది. కర్ణాటకలో సెకనుకు 22 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినా, మేట్టూరు జలాశయంలోకి నాలుగు వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతోంది. ఈ శాతం క్రమంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇక ఈరోడ్‌లోని భవానీ సాగర్ జలాశయం నీటిమట్టం 83 అడుగులకు చేరింది.

క్లుప్తంగా

10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 51 ఏళ్ల మహిళ


రహీలా భాను

అన్నానగర్: కరూర్‌లో 41 ఏళ్ల మహిళ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. వివరాలు.. కరూర్ జిల్లా కృష్ణరాయపురం ప్రాంతానికి చెందిన రహీలా భాను (51). ఈమె పూవంబాడి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో వంటపని చేస్తోంది. 1989లో 9వ తరగతి పూర్తి చేసిన ఈమె కుటుంబ పరిస్థితుల కారణంగా పాఠశాలకు వెళ్లలేదు. ఈ క్రమంలో 10వ తరగతి ఉత్తీర్ణులైతేనే న్యూట్రిషన్ ఆర్గనైజర్ పోస్టుకు అర్హత సాధించే అవకాశం ఉన్నందున 10వ తరగతి పరీక్షలు హాజరు కావాలని నిర్ణయించుకుని గత ఏప్రిల్‌లో జరిగిన 10వ తరగతి సాధారణ పరీక్షలకు ప్రత్యేక అభ్యర్థిగా దరఖాస్తు చేసుకుంది. ఈమె ఇంగ్లీషు, సోషల్‌సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించింది. ఆపై తాను ఉత్తీర్ణత సాధించని తమిళం, గణితం, సైన్స్ సబ్జెక్టులకు జూన్‌లో జరిగిన సప్లిమెంటరీ పరీక్షకు దరఖాస్తు చేసిపరీక్ష రాసింది. ఈ క్రమంలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఇందులో రహీలా భాను తమిళం, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యారు.

రూ.10 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తులు

అన్నానగర్: విరుదాచలంలో దాచిన రూ.10 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్న పోలీసులు గోడౌన్‌ను సీజ్ చేశారు. వివరాలు.. కడలూరు జిల్లా విరుదాచలం పాలక్కరై సమీపంలో ధనరామ్ (45) ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను స్మగ్లింగ్ చేసి ఓ గోడౌన్‌లో దాచినట్లు పోలీసులకు గురువారం రహస్య సమాచారం అందింది. దీంతో విల్లుపురం క్రైమ్ ఇంటిలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ జెరాల్డ్ రాబిన్‌సన్ నేతృత్వంలో పోలీసు అధికారులు ధనరామ్ గోడౌన్‌లో తనిఖీలు చేశారు. అందులో 31 పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. ధనరామ్ బెంగుళూరు నుంచి వాటిని తెప్పించి గోడౌన్‌లలో భద్రపరిచి షాపులకు పంపిణీ చేసినట్లు తేలింది. తదనంతరం పోలీసులు ధనరామ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుండి పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని గోడౌన్‌ను సీలు వేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేంద్రన్

తిరువళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ సూచించారు. తిరువళ్లూరులోని డీఆర్‌బీసీసీసీ తెలుగు మైనారిటీ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమం గురువారం హెచ్‌ఎం కలైసెల్వవన్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే రాజేంద్రన్ హాజరై విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలో నాణ్యమైన ఆహారంతో పాటు విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మరింత రాణించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం ప్రణాళికబద్ధంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఉదయమలర్, కౌన్సిలర్లు టీకే బాబు, పద్మావతి, అంబిక పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఇండియన్ బ్యాంకు లాభాలు


ఇండియన్ బ్యాంకు ఎండీ, సీఈఓ జైన్

కొరుక్కుపేట: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఫలితాలు ఆశాజనకంగా నమోదైనట్టు ఆ బ్యాంకు ఎండీ, సీఈఓ ఎస్ఎల్ జైన్ తెలిపారు. 2023 జూన్ 30తో ముగిసిన మొదటి త్రైమాసికంలో నికర లాభం 41 శాతం పెరిగిందని ఆయన ప్రకటించారు. ఈమేరకు గురువారం సాయంత్రం చెన్నైలోని ఇండియన్ బ్యాంకు ప్రధాన కార్యాయలంలో బ్యాంకు ఫలితాలను ప్రకటించారు. ఇందులో పాల్గొన్న జైన్ బ్యాంకు ఫలితాలను వివరించారు. ఈక్రమంలో 2023 జూన్ 30తో ముగిసిన మొదటి క్వార్టర్‌లో నికర లాభం రూ.1,709 కోట్లు నమోదైందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 41 శాతం లాభం పెరిగిందని తెలిపారు. తమ బ్యాంకు డిజిటల్ సేవలతో పాటు విద్యార్థులకు, ఎంఎస్ఎంఈలకు, ఇతరులకు రుణాలను అందిస్తూ పలు అవార్డులను అందుకుందని పేర్కొన్నారు.

స్టీల్ వినియోగంపై అవగాహన

సాక్షి, చెన్నై : నిర్మాణ రంగంలో స్టీల్, ఉక్కు తదితర సామాగ్రి వాడకం, టీఎంటీ బార్‌లను పరిరక్షించే విధంగా ఏడాది పాటు రాష్ట్రంలో అవగాహన ప్రచారానికి శ్రీకారం చుట్టామని ఏఆర్‌ఎస్ స్టీల్స్ వ్యవస్థాపకుడు అశ్విని కుమార్ భాటియా తెలిపారు. చెన్నై నుంచి తమిళనాడు వ్యాప్తంగా 2780 కి.మీ దూరం నిర్వహించనున్న ఈ అవగాహన కార్యక్రమాన్ని గురువారం స్థానికంగా ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నో ద ట్రూత్ పేరిట ప్రజలకు అవగాహన కల్పించే ఈ ప్రచారంలో జర్మన్ టెక్నాలజీతో కూడిన స్పెక్ట్రో మీటర్ పొందు పరిచిన 12 మొబైల్ టెక్ ల్యాబ్ స్కాంపేయిన్ వాహనాలు పాల్గొంటున్నాయని తెలిపారు. తమిళనాడులో సాంప్రదాయంగా నిర్మాణ సామాగ్రి, టీఎంటీ బార్‌ల వినియోగ దారులకు అత్యున్నత, నాణ్యతతో కూడిన మెటీరియల్ ఎల్లప్పుడూ అందే విధంగా ప్రచారం జరుగుతోందన్నారు. నిర్మాణ రంగంలో నాణ్యత కీలకమని, అందుకే నిర్మాణాలు జరిగే ప్రాంతాలకు వెళ్లి స్టీల్, ఉక్కు తదితర సామాగ్రిని పరీక్షించే విధంగా మొబైల్ టెక్ ల్యాబ్‌లు పనిచేస్తాయన్నారు. సాధారణంగా ఈ పరిశోధన ఒకటికి రూ. 1500 ఖర్చు అవుతుందని, అయితే, తాము పూర్తిగా ఉచిత సేవగా ప్రచారంలో పరిశోధన అవకాశం కల్పిస్తు న్నామని చెప్పారు.

దురైమురుగన్ తనయుడికి వారెంట్

- వేలూరు కోర్టులో ఎంపీ కదిర్ ఆనంద్ హాజరు


కోర్టు నుంచి బయటకు వస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎంకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ తనయుడు, వేలూరు పార్లమెంట్ సభ్యుడు కదిర్ ఆనంద్ గురువారం మధ్యాహ్నం వేలూరు కోర్టులో హాజరయ్యారు. 2015, మార్చి 29 దాఖలు చేసిన ఆదాయపు పన్ను రిటర్న్స్ అనంతరం రూ.కోటి 4 లక్షల 94,060 నగదును డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్ ఆలస్యంగా సమర్పించినట్లు ఐటీ శాఖ వేలూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈ కేసు కొట్టివేయాలని 2017వ సంవత్సరంలో కదిర్ ఆనంద్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు, పన్ను చెల్లింపులో జాప్యం కారణంగా కేసును కొనసాగించలేమని పిటిషన్‌లో పేర్కొంది. ఈ కేసులో ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేశారా అనే వాటిపై వేలూరు కోర్టులో జరుగుతున్న కేసు విచారణలో ట్రయల్ కోర్టు జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ కదిర్‌ఆనంద్ ఫిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో వేలూరు కోర్టులో జరుగుతున్న ఈ కేసు విచారణ ఈనెల 11వ తేదీ హాజరు కావాల్సి ఉండగా ఆయన హాజరు కాలేదు. దీంతో కదిర్ ఆనంద్ గురువారం వేలూరు కోర్టులో స్వయంగా హాజరు కావాలని వారెంట్ పంపారు. దీంతో ఆయన మధ్యాహ్నం వేలూరు కోర్టులో హాజరయ్యారు. ఈ కేసు విచారణను ఆగస్టు 25వ తేదీకి హాజరుకావాలని వాయిదా వేశారు. దీంతో ఆయన కోర్టు నుంచి ఇంటికి వెళ్లారు. ఎంపీ కదిర్ ఆనంద్ వేలూరు కోర్టుకు రావడంతో ఆ ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది.

రోడ్డు బాగు చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

తిరుత్తణి: బురదమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని విద్యార్థులు గురువారం రాస్తారోకో చేశారు. తిరుత్తణి సమీపం కృష్ణసముద్రం దళితవాడలో వంద కుటుంబాలు నివాశముంటున్నాయి. దళితవాడకు చెందిన విద్యార్థులు ప్రాథమిక పాఠశాలకు కృష్ణసముద్రానికి, ఆపై చదువుకునేందుకు తిరుత్తణి, బుచ్చిరెడ్డిపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. అయితే దళితవాడకు వెళ్లే మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారి ఆ రోడ్డులో నడిచి వెళ్లడం కష్టంగా మారింది. గ్రామానికి రోడ్డు ఏర్పాటుచేయాలని పలుమార్లు పంచాయతీ నిర్వాహకులు, బీడీఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆగ్రహంతో విద్యార్థులు తిరుత్తణి–పొదటూరుపేట మార్గంలో రాస్తారోకో చేశారు. వాహనరాకపోకలు స్తంభించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

తిరువళ్లూరు రైల్వేస్టేషన్ తనిఖీ

- అమృత్ భారత్ ప్రాజెక్ట్ కింద చేపట్టనున్న పనులపై డీఆర్‌ఎం ఆరా


తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం

తిరువళ్లూరు: అమృత్ భారత్ ప్రాజెక్టు పథకం కింద తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో జరగనున్న అభివృద్ధి పనులు, రైల్వేస్టేషన్‌లో దీర్ఘకాలికంగా వున్న సమస్యలను పరిస్కరించడంపై దక్షిణ మధ్య రైల్వే చెన్నై డీఆర్‌ఎం విశ్వనాథన్ ఎర్రా గురువారం ఉదయం అధికారులతో కలిసి తనిక్షీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఇండియన్ రైల్వే తరపున అమృత్ భారత్ ప్రాజెక్టు పథకం కింద దేశంలో ఎంపిక చేసిన రైల్వేస్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా 1,257 రైల్వేస్టేషన్‌లను ఎంపిక చేయగా, రాష్ట్రం నుంచి 73 రైల్వేస్టేషన్‌లను ఎంపిక చేశారు. ఈ జాబితాలో చెన్నై జోన్‌లోని గుమ్మిడిపూండి, తాంబరం, అంబత్తూరు, తిరువళ్లూరు, అరక్కోణం, జోలార్‌పేటతో సహా 14 రైల్వేస్టేషన్‌లు ఉన్నాయి. దీంతో పాటు సబర్బన్ ఎలక్ట్రికల్ రైల్ టెర్మినల్ జాబితాలోనూ తిరువళ్లూరును చేర్చారు. రైలు ప్రయాణికుల వినియోగానికి అనుగుణంగా పలు అభివృద్ధి ఆధునికీకరణ పనులను చేపట్టనున్నారు. చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ విశ్వనాథన్ ఎర్రా నేతృత్వంలోని అధికారుల బృందం తిరువళ్లూరు, అంబత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. అనంతరం అరక్కోణం, జోలార్‌పేట రైల్వేస్టేషన్‌ల తనిఖీ కోసం బయలుదేరి వెళ్లారు.

అధ్యాపకురాలి ఇంట్లో 29 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: కళాశాల అధ్యాపకురాలి ఇంటిలో 29 సవర్ల నగలు, నగదు చోరీ చేసిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోవై సాయిబాబా కాలనీ 8వ వీధికి చెందిన వారు గురు జ్ఞానాంబికై (47) ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది. ఇంట్లో దాచిన 29 సవర్ల నగలు, రూ.10 వేలు నగదు కనిపించపోవడంతో గురువారం గురు జ్ఞానాంబికై స్థానిక సాయిబాబా కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో ఇంటిలో పని చేస్తున్న ఇద్దరు పని మనుషులు నగలు, నగదు చోరీ చేసి పారిపోయినట్లు తేలింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అమ్మన్‌కులం ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

చిన్నారి అదృశ్యం కేసులో మహిళ అరెస్ట్

తిరువొత్తియూరు: నాగర్‌కోవిల్ వడచేరి బస్టేషన్‌లో అపహరణకు గురైన ఆరునెలల బిడ్డను నాలుగు రోజుల తరువాత ప్రత్యేక బృందం పోలీసులు కేరళ రాష్ట్రం కొల్లంలో రక్షించారు. అనంతరం కిడ్నాప్ చేసిన మహిళను అరెస్టు చేశారు. వివరాలు.. తూత్తుకుడి జిల్లా ఏరలైకి చెందిన వారు ముత్తురాజ్. ఇతను భార్యతో కలిసి నాగర్‌కోవిల్ వడచేరి బస్టేషన్‌లో ఉంటూ వ్యాపారం చేస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో గత 24వ తేదీ తన భార్య, ఆరు నెలల బిడ్డ నిద్రపోతున్నారు. ఆ సమయంలో తెల్లవారుజామున లేచి చూడగా బిడ్డ కనిపించలేదు. దీంతో దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు వడచేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా శాంతి అనే మహిళ బిడ్డను తీసుకుని వెళుతున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఆమెది కేరళ రాష్ట్రంలోని కొల్లంగా గుర్తించారు. అనంతరం ప్రత్యేక బృందం పోలీసులు కొల్లం వెళ్లి బిడ్డను రక్షించారు. అలాగే శాంతిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి నాగర్‌కోవిల్ జైలుకు తరలించారు.

విశ్వనటుడితో ఏఆర్ రెహ్మాన్


ఆస్కార్ మ్యూజియంలో కమల్‌తో రెహ్మాన్

తమిళసినిమా: సినీలెజెండ్, ఎన్‌సైక్లోపీడియా కమలహాసన్ ఇప్పుడు అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన నిత్య విద్యార్థి అన్న విషయాన్ని మరోసారి నిరూపించుకుంటున్నారు. ఇండియన్–2 చిత్రాన్ని పూర్తిచేసే పనిలో ఉన్న కమలహాసన్ తాజాగా విలన్ అవతారమెత్తుతున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తెలుగు చిత్రం కల్కి 2898 ఏడీ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పరిచయ కార్యక్రమం కోసం అమెరికాకు వెళ్లిన ఆయన అది పూర్తి అయిన తరువాత ఇండియన్– 2 చిత్రానికి సంబంధించిన కార్యక్రమాల కోసం అక్కడే ఉన్నారు. ఆ సందర్భంగా ఆయన తన హాలీవుడ్ మేకప్‌మన్ మైఖేల్ వెస్ట్‌మోర్‌ను కలుసుకున్నారు. ఈ ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇకపోతే అమెరికాలోని ఆస్కార్ మ్యూజియంను సంగీత దర్శకుడు ఏఆర్.రెహ్మాన్‌తో కలిసి సందర్శించారు. అక్కడ వీరిద్దరూ ది గాడ్ ఫాదర్ చిత్రాన్ని వీక్షించారు. ఈ ఫొటోలను ఏఆర్.రెహ్మాన్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అందులో ఒక గోట్ మరో గోట్‌ను చూస్తోంది అని పేర్కొన్నారు. గోట్ అంటే (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) ఎవర్ గ్రీన్ గ్రేటెస్ట్ మెన్ అని అర్థం. కాగా కమలహాసన్ అమెరికా నుంచి తిరిగి రాగానే తన 233వ చిత్ర షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం. కమలహాసన్ సొంతంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకత్వం వహించనున్నారన్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

స్టాండప్ కమెడియన్ ప్రేమలో గాయత్రి

తమిళసినిమా: ఈమధ్య హీరోయిన్ల ప్రేమాయణం గురించే ఎక్కువగా వార్తలు వస్తున్నాయి. సమీప కాలంలో మిల్కీబ్యూటీ తమన్నా ప్రేమ గురించి వార్తలు వచ్చాయి. తాజాగా నటి గాయత్రి ప్రేమ వ్యవహారం వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. చిత్రాల్లో సంప్రదాయ దుస్తులు ధరించి పక్కింటి అమ్మాయిగా ముద్రవేసుకున్న గాయత్రి నిజజీవితంలో అలా కాదట. తాను పక్కా మోడ్రన్ గర్ల్ అని తనే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 18 వయసు చిత్రం ద్వారా నటిగా పరిచయమైన గాయత్రి ఆ తరువాత తమిళం, మలయాళం భాషల్లో వరుసగా నటిస్తూ గుర్తింపు పొందారు. ముఖ్యంగా తమిళంలో విజయ్‌సేతుపతికి జంటగా నడువుల కొంచెం పక్కత్త కానోమ్, రమ్మి, పురియాద పుదుర్, సూపర్ డీలక్స్, తుగ్లక్ దర్బార్, మామణిదన్ చిత్రాల్లో నటించారు. కాగా ఇటీవల లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో కమలహాసన్ కథానాయకుడిగా నటించిన విక్రమ్ చిత్రంలో ఫాహత్ ఫాజిత్‌కు జంటగా నటించారు. మలయాళంలో ప్రముఖ కథానాయకిగా రాణిస్తున్న గాయత్రి తాజాగా స్టాండప్ కమిడియన్ (స్టేజీ ఆర్టిస్ట్) అరవింద్ సా ప్రేమలో పడ్డట్టు ప్రచారం జోరందుకుంది. వీరిద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. అయితే ఇంత ప్రచారం జరుగుతున్నా ఈ ఇద్దరిలో ఏ ఒక్కరూ స్పందించకపోవడం గమనార్హం. దీంతో గాయత్రి ప్రేమాయణం నిజమేనని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం గాయత్రి జీవీ.ప్రకాశ్‌కుమార్‌కు జంటగా ఇడిముళక్కం అనే చిత్రంలో నటిస్తున్నారు. దీనికి శీనూ రామస్వామి దర్శకుడు.



కోలీవుడ్ టాక్స్

ఆ లక్కీ నాయకి ఎవరు?

తమిళసినిమా: తుళ్లువదో ఇళమై చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన సెల్వరాఘవన్ తొలి చిత్రంతోనే విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత కాదల్‌కొండేన్, 7జీ రెయిన్‌బో కాలనీ వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం నటుడిగా బిజీ అవుతున్న ఈయన మళ్లీ దర్శకత్వం వహించడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఈయన ఇంతకుముందు దర్శకత్వం వహించిన సక్సెస్‌ఫుల్ చిత్రం 7జీ రెయిన్‌బో కాలనీ చిత్రానికి సీక్వెల్‌ను తెరకెక్కించ తలపెట్టినట్లు తాజా సమాచారం. తొలి భాగంలో నిర్మాత ఏఎం.రత్నం వారసుడు రవికృష్ణ కథానాయకుడిగా పరిచయం అయ్యారు. ఆయనకు జంటగా నటి సోనియాఅగర్వాల్ నటించారు. యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని అందించిన ఈ చిత్రం 2004లో విడుదలైంది. కాగా ఆ తరువాత పలు చిత్రాల్లో నటించిన రవికృష్ణ ఆ చిత్రాలు ఆశించిన విజయాలను సాధించకపోవడంతో నటనకు దూరంగా ఉంటున్నారు. అలాంటిది 7జీ రెయిన్‌బో కాలనీ 2 చిత్రం ద్వారా రీ ఎంట్రీకి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. కాగా ఇందులో నటించే కథానాయకి పాత్ర కోసం నటి అదితి శంకర్, ఇవనాలలో ఒకరిని నటింపజేయడానికి దర్శకుడు సెల్వరాఘవన్ చర్చలు జరుపుతున్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీరిలో ఆ లక్కీ నటి ఎవరనేది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. అదితిశంకర్ నటించిన మావీరన్ చిత్రం ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం అథర్వ తమ్ముడు ఆకాశ్ మురళీకి జంటగా నటిస్తున్నారు. ఇకపోతే లవ్ టుడే చిత్రంతో సంచలన విజయాన్ని అందుకున్న నటి ఇవనా నటుడు హరీశ్ కల్యాణ్‌కు జంటగా నటించిన ఎల్‌జీఎం చిత్రం శుక్రవారం తెరపైకి రానుంది. కాగా 7జీ రెయిన్‌బో కాలనీ చిత్రానికి సీక్వెల్ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం.



ఒకేసారి థియేటర్లలో, ఓటీటీలో యోగ్యన్


జైఆకాశ్‌తో దర్శకుడు సాయిప్రభ దీనా

తమిళసినిమా: నటుడు జైఆకాశ్ ద్విపాత్రాభినయం చేసిన చిత్రం యోగ్యన్. మూన్ స్టార్ పిక్చర్స్ పతాకంపై మాదేశ్ నిర్మించిన ఈ చిత్రంలో నటి కవిత, ఆర్తి, ఖుషీ హీరోయిన్లుగా నటించారు. జైఆకాశ్ శిష్యుడు సాయిప్రభా మీనా దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రానికి జూపిన్ సంగీతాన్ని, పాల్ పాండి ఛాయాగ్రహణం అందించారు. ఇందులో జైఆకాశ్ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయడం విశేషం. పెద్దవాడైన తండ్రికి పుట్టిన కొడుకు ఎలా మారతాడన్న కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని శుక్రవారం తెరపైకి రానుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చెన్నై, వడపళనిలోని శిఖరం ఆవరణలో చిత్ర యూనిట్ నిర్వహించిన మీడియా సమావేశంలో జైఆకాశ్ మాట్లాడుతూ విలన్ పాత్రలో నటించాలన్నది తన చిరకాల కల అని అది ఈ చిత్రంతో నెరవేరిందని చెప్పారు. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా నటించడానికి చాలా కసరత్తులు చేశానన్నారు. చిత్రం బాగా వచ్చిందని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడం ఎంతకష్టంగా మారిందో తెలిసిందేనన్నారు. చాలా తక్కువ థియేటర్లే తమకు దొరికాయన్నారు. దీంతో యోగ్యన్ చిత్రాన్ని థియేటర్లతో పాటు ఏకకాలంలో ఓటీటీలోనూ విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఏ క్యూబ్ మూవీస్ అనే యాప్ అనే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఓటీటీలో రోజుకు రూ.50 చెల్లిస్తే ఫోన్‌లోనూ, టీవీల్లోనూ ఒక రోజంతా చూడవచ్చునని చెప్పారు. ఓటీటీలో తమ చిత్రాలతో పాటు ఇతర చిత్రాలను విడుదల చేస్తామని చెప్పారు. చిన్న నిర్మాతలకు, చిన్న నటీనటుల చిత్రాలకు ఈ ఓటీటీ చాలా హెల్ప్ అవుతుందన్నారు. అదేవిధంగా ఇతర చిత్రాల నిర్మాతలకు ఏ క్యూబ్ మూవీస్ ఆఫ్ ఓటీటీలో విడుదల చేస్తే వచ్చే ఆదాయంలో 80 శాతం వాళ్లకు, 20 శాతం తమ సంస్థకు చేరుతుందని జైఆకాశ్ తెలిపారు.

96 దర్శకుడితో కార్తీ

తమిళసినిమా: వరుస విజయాలతో దూసుకుపోతున్న నటుడు కార్తీ. ఇటీవల విరుమాన్, సర్దార్, పొన్నియిన్ సెల్వన్ వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈయన తాజాగా తన 25వ చిత్రం జపాన్ చిత్రాన్ని పూర్తిచేశారు. రాజుమురుగన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మిస్తోంది . ఇప్పటికే ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌లు విడుదలై చిత్రంపై మంచి అంచనాలు పెంచాయి. ఈ చిత్రం దీపావళికి తెరపైకి రానుంది. కాగా ప్రస్తుతం నలన్ కుమారస్వామి దర్శకత్వంలో నటిస్తున్నారు. తాజాగా కార్తీ 27వ చిత్రానికి సంబంధించిన వార్త కూడా వెలువడింది. దీన్ని చిత్ర వర్గాలు ప్రకటించకపోయినా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు పీసీ.శ్రీరామ్ గురువారం తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అందులో కార్తీ 27వ చిత్రానికి తాను ఛాయాగ్రహణం అందించనున్నట్లు చెప్పారు. దీనికి 96 చిత్రం ఫేమ్ ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించనున్నారని, సూర్య, జ్యోతికల 2డీ ఎంటర్‌టైయిన్‌మెంట్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీతాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో అధికారిక ప్రకటనను నిర్మాణ సంస్థ త్వరలో వెలువడించనుందని ఆయన చెప్పారు. కాగా కార్తీ హీరోగా పీఎస్.మిత్రన్ దర్శకత్వంలో సర్దార్ 2, లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో ఖైదీ–2 చిత్రాలు రూపొందడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ఇప్పటికే ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే.



క్లుప్తంగా

వ్యాయామంతో మధుమేహానికి చెక్


సర్వే నివేదికను ఆవిష్కరణ

కొరుక్కుపేట: పోషక విలువలతో కూడిన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, నడకతో మధుమేహాన్ని అదుపులో ఉంచుకో వచ్చునని, అలాగే బీపీ, బరువు తగ్గుతారని మద్రాసు డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వి మోహన్ తెలిపారు . పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ మోహన్స్ స్పెషాలిటీ సెంటర్, మద్రాసు డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్, చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్స్స్ అండ్ టెక్నాలజీ –త్రివేండ్రం, ఎమోరీ యూనివర్సిటీ, యూఎస్ఏలోని హార్వర్డ్ యూనివర్సిటీలు సంయుక్తంగా కలసి దేశంలో కార్పొరేట్ వర్క్‌సైట్ వర్క్‌ప్లేస్ నివేదికను ప్రకటించారు. డాక్టర్ మోహన్, ప్రొఫెసర్ ప్రభాకరన్ పాల్గొని ఇండియా వర్క్స్ రిపోర్టును ఆవిష్కరించారు.

ఎంజీఎంలో పిల్లలకు ప్రత్యేక ఎక్మో కేర్ సెంటర్

సాక్షి, చెన్నై: ఎంజీఎం హెల్త్ కేర్‌లో పిల్లల కోసం ప్రత్యేకంగా, అధునాతన ఎక్మో కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఈసెంటర్‌ను కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ బాలకృష్ణన్, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స విభాగం కో– డైరెక్టర్ సురేష్ రావు, సీఈఓ హరీష్ మణియన్ ప్రారంభించారు. పిల్లలకు ఇటీవల కాలంలో ఎదురవుతున్న సమస్యలు, వైద్య చికిత్సలు, ఇతర సేవలను గురించి వివరించారు. అలాగే, నెలల తక్కువతో జన్మించే నవ జాత శిశువులకు మెరుగైన అత్యవసర వైద్య చికిత్స తప్పనిసరిగా మారిందన్నారు. అందుకే పిల్లల కోసం ప్రత్యేకంగా కేంద్రీకృత ఎక్మో సౌకర్యంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. క్రిటికల్ కేర్ నిపుణుల బృందంతో 24 గంటల పాటు ఈ సెంటర్‌లో సేవలు అందించడం జరుగుతోందని ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్లు కలైమారన్ సదాశివం, బిను నినాన్, అనంత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఏడేళ్ల బాలిక మృతి

అన్నానగర్: నెల్లైలో ఓ తాగునీటి ట్యాంక్‌లో గురువారం చేతులు కడుక్కోవడానికి వెళ్లిన ఏడేళ్ల బాలిక విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వివరాలు.. నెల్లై జిల్లా వన్నారపేట నార్త్ బైపాస్ రోడ్డు అంబేడ్కర్ నగర్ నార్త్ వీధికి చెందిన శక్తివేల్ ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో గాయపడి పనికి వెళ్లకుండా ఇంటిలోనే ఉంటున్నాడు. ఇతని భార్య సోనియా ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. వీరికి సత్య (07) అనే కుమార్తె. ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్య అక్కడి మునిసిపల్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. గురువారం తెల్లవారుజామున మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద చేతులు శుభ్రం చేసుకునేందుకు అక్కడ వున్న ఇనుప నీటి పైపును తెరిచేందుకు యత్నించింది. ఆ సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. గురై పాళయంకోట్టై పోలీసులు బాలిక మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బందీలుగా మైలాడుదురై మత్స్యకారులు

కొరుక్కుపేట: మైలాడుదురైకి చెందిన 14 మంది మత్స్యకారులు గురువారం తెల్లవారుజామున పవర్ బోటులో చెన్నై సముద్రానికి చేరుకున్నారు. ఇది గమనించిన కాశిమేడు మత్స్యకారులు ఇతర మత్స్యకారులకు సమాచారం అందించి ఆ తర్వాత వారిని పట్టుకున్నారు. చెన్నైలోని సెంకై సింగార వెలార్ ఓనర్ బార్జ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు విజేష్ అధ్యక్షతన మత్స్యకారులు ఆ బోటు వద్దకు వెళ్లి మైలాడుతురై మత్స్యకారులతో వాగ్వాదానికి దిగారు. వీరంతా చెన్నై సముద్ర ప్రాంతంలో చేపలు పెట్టేందుకు వచ్చారని కాశిమేడు ఫిషింగ్ హార్బర్ వద్ద మైలాడుదురై మత్స్యకారులను నిర్బంధించారు. దీంతో కాశిమేడు ప్రాంతంలో కలకలం రేపింది. ఇరుపక్షాల మత్స్యకారులతో చర్చలు జరిపారు. మైలాడుతురైకి చెందిన మత్స్యకారులు బోటు గేర్ బాక్స్ విరిగిపోయిందని, దాన్ని సరిచేయడానికి చెన్నై బీచ్‌కు వచ్చామని చెప్పారు. ఈ విషయమై మత్స్యశాఖ సహాయ సంచాలకుల ద్వారా చర్చలు జరిపి ఆ తరువాత మైలాడుదురై మత్స్యకారులను ఒదిలేస్తామని చెన్నై మత్స్యకారులు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,268 మంది స్వామివారిని దర్శించుకోగా, 26,817 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రతిభ చాటిన విద్యార్థినులు



ఫేస్ పెయింటింగ్‌తో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు, విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: కూరగాయలతో కళాఖండాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఫేస్ పెయింటింగ్‌లు, వృత్తినైపుణ్యాన్ని పెంచే మొబైల్ కేస్ డిజైన్‌లతో ఎస్‌కేపీసీ విద్యార్థినులు ప్రతిభను చాటుకున్నారు. శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల(ఎస్‌కేపీసీ), కళాలయా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్నిగ్ధా –2023 పేరుతో కల్చరల్ ఫెస్ట్‌ను రెండు రోజులు పాటు ఏర్పాటు చేశారు. తొలిరోజైన గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆఫ్ స్టేజ్ ఈవెంట్‌గా వెజిటెబుల్ కార్వింగ్, క్రియేటివ్ ఐడియాస్, ఫేస్ పెయింటింగ్, మొబైల్ కేస్ డిజైనింగ్ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వి. శాంతి, షాలిని, వి.సెంథిల్, లలిత వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు కళాశాల కరస్పాండెంట్ శరత్ కుమార్, ప్రిన్సిపల్ మోహనశ్రీ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు .

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. తిరువళ్లూరు జిల్లా పూండి యూనియన్ పట్టరైపెరంబదూరు గ్రామానికి చెందిన మహాలింగం భార్య ఇంద్రాణి(73). ఈమె మంగళవారం రాత్రి ఇంటి వద్ద నిలబడి వుండగా, తిరువళ్లూరు నుంచి తిరుత్తణి వెళుతున్న ద్విచక్రవాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11 గంటలకు మృతిచెందింది.

పెద్దపాళ్యంలో..
తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యం సమీపంలోని పూరివాక్కం గ్రామానికి చెందిన పళని(60). ఇతను మంజాకారణైలోని ప్రైవేటు కంపెనీ పనికి వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. కంపెనీ వద్ద బస్సు కోసం వేచి ఉండగా ఆ సమయంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి పళనిని ఢీకొంది. గాయపడ్డ అతన్ని సహచరులు స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ పళనిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..
గుమ్మిడిపూండి సమీపంలోని అత్తుపాక్కం గ్రామానికి చెందిన డ్రైవర్ కుప్పన్(63). ఇతను మినీలారీలో వస్తువులను గుమ్మిడిపూండికి తీసుకెళ్లి అక్కడ అన్‌లోడ్ చేసిన తరువాత బుధవారం రాత్రి 11.30 గంటలకు ఆర్టీఓ కార్యాలయం వద్ద మినీలారినీ పార్క్ చేసి ఇంటికి బైక్‌లో బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని పళని మృతిచెందాడు. ఈ ఘటనలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడ చిరుత మృతి


మృతిచెందిన చిరుత

అన్నానగర్: మసినగుడి సమీపంలో గురువారం ఆరేళ్ల ఆడ చిరుత అనుమానాస్పదంగా మృతిచెందింది. నీలగిరి జిల్లాలోని ముదుమలై టైగర్ రిజర్వ్‌లో గురువారం తెల్లవారుజామున మసినగుడి – ఊటీ రహదారిలోని అరటితోట సెక్షన్‌లో అటవీ సిబ్బంది గస్తీ నిర్వహించారు. ఆ సమయంలో ఒక చిరుత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో సింగార అటవీశాఖ రేంజర్ జానీపిటర్ నేతృత్వంలో అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం పశువైద్యాధికారులు చిరుత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత మృతికి గల కారణాలు తెలియరాలేదని అటవీశాఖ అధికారులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాతే మృతికి కారణం తెలుస్తుందని అధికారులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

తిరువొత్తియూరు: చెన్నై గిండి సమీపం పుత్తకన్ని కాపురం ప్రాంతానికి చెందిన జమీల. ఈమె కుమార్తె ఆణి (21), కుమారులు జరీస్ (19), జనిల్ (19). వీరు కన్యాకుమారి జిల్లా మార్తాండం సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ మార్తాండంలో ఉన్న ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో గత 25వ తేదీ అక్క, తమ్ముళ్ల యథావిధిగా కళాశాలకు వెళ్లారు. కళాశాల ముగిసిన తరువాత జరీస్, జనిల్ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. కానీ ఆణి ఇంటికి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినప్పటికీ ఆమె ఆచూకీ కనబడలేదు. వెంటనే కుటుంబసభ్యులు మార్తాండం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ బలవన్మరణం

అన్నానగర్: కరూర్ సమీపంలో కడుపునొప్పి తట్టుకోలేక మహిళా ఇంజినీర్ గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కరూర్ వెంగమేడు కొంగునగర్ అన్నారోడ్డుకు చెందిన జినోలిని (24) ఇంజనీర్. ఈమె కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం కడుపునొప్పి ఎక్కువవడంతో భరించలేక విరక్తి చెంది జినోలిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసి అతని బంధువులు వెంగమేడు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరూర్‌గాంధీ గ్రామంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

తిరువళ్లూరు: అనారోగ్య సమస్యలు భరించలేక ఓ యువకుడు విరక్తి చెంది విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వెంగల్‌లో జరిగింది. తిరువళ్లూరు జిల్లా చిట్టత్తూరు గ్రామానికి చెందిన గోవిందన్ కుమారుడు వాల్టర్ వెట్రివేల్(26). ఇతను కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపత్యంలో బుధవారం ఆరోగ్యం విషమించడంతో విరక్తి చెందిన వెట్రివేల్ విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బంధువులు అస్వస్థతకు గురైన వెట్రివేల్‌ను ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురాతన రాగి నాణేలు లభ్యం



అన్నానగర్: అయ్యంపేట సమీపంలో గురువారం పురాతన రాగి నాణేలు లభ్యమయ్యాయి. తంజావూరు జిల్లా అయ్యంపేట సమీపంలోని నల్లిచేరి గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం. తన పాత ఇంటిని కూల్చివేసి కొత్త ఇంటిని నిర్మించేందుకు గుంత తవ్వాడు. అప్పుడు ఒక ఇత్తడి పెట్టె దొరికింది. దానిని తెరచినప్పుడు అందులో రాగినాణేలు, ఒక పైసా నాణేలు సహా 100 కంటే ఎక్కువ పురాతన నాణేలు ఉన్నాయి. అనంతరం రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు. తంజావూరు తహసీల్దార్ శక్తివేల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరవణ కుమార్, విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దినకరన్, అయ్యంపేట ఎస్ఐ రాజేష్‌కుమార్, పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. దీంతో దేవదాయశాఖ పురాతన నాణేల పెట్టెను భద్రపరిచేందుకు తంజావూరుకు తీసుకెళ్లారు.

అల్లేరి కొండ రోడ్డు పరిశీలన


అల్లేరి కొండపైకి నడిచి వెళుతున్న కలెక్టర్, అధికారులు

వేలూరు: వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గంలోని పీంజమందై పంచాయతి అల్లేరి కొండ సమీపంలోని అత్తిమరత్తు కొల్లై గ్రామంలో చిన్నారి ధనుష్కతో పాటు శంకర్ 20 రోజుల క్రితం పాముకాటుకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో అల్లేరి కొండకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు వేగవంతం చేస్తున్నారు. మొదటి విడతగా అల్లేరి కొండ ప్రాంతంలో రోడ్డు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. అయితే ఆ స్థలం అటవీ శాఖకు చెందింది కావడంతో ఆ శాఖ అంగీకరించకపోవడంతో సర్వే పనులు నిలిచి పోయాయి. దీంతో రెవెన్యూ అధికారులు వేలూరు కాగిదపట్టర ప్రాంతంలోని కొండను అటవీశాఖకు అప్పగించి అల్లేరి కొండపై రోడ్డు నిర్మాణ పనులు చేసేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. దీంతో గురువారం ఉదయం కలెక్టర్ కుమరవేల్ పాండియన్, అధికారుల బృందం అల్లేరి కొండకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. వరదలంబట్టు కొండ కింద నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరం కలెక్టర్ అధికారుల బృందం నడిచి వెళ్లి రోడ్డు ఏర్పాటుపై గ్రామస్తులతో చర్చించారు. జెడ్పీ చైర్మన్ బాబు, అనకట్టు బీడీఓ సుధాకరన్, పీంజమందై సర్పంచ్ రేఖ, గ్రామస్తులు ఉన్నారు.

జనన నిష్పత్తి పెంచడంపై అవగాహన


ఆడ శిశువుల తల్లులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: ఆడ శిశువుల జనన నిష్పత్తి పెంచడంపై ఆర్కేపేటలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సమాజ సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. తిరువళ్లూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో నిండిన ఆర్కేపేట యూనియన్‌లో అతి తక్కువగా వెయ్యి మంది మగశిశువుల నిష్పత్తిలో ఆడి శిశువుల నిష్పత్తి 942 మాత్రమే ఉండడంతో ఆడిశిశువుల జననం నిష్పత్తిని పెంచే విధంగా అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. కరుణానిధి శత జయంతి వేడుకల్లో భాగంగా సమాజ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సహాయ కలెక్టర్, కేత్రిన్ శరణ్య, డిప్యూటీ కలెక్టర్ సుబ్బులక్ష్మి, సమాజ సంక్షేమ శాఖ అధికారి సుమతి అవగాహన కల్పించారు. ఆడ శిశువుల తల్లులకు గత వారం నిర్వహించిన క్విజ్ పోటీలు, అముల్‌బేబీ పోటీల్లో గెలుపొందిన శిశువుల తల్లులకు తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ బహుమతులు అందజేశారు. అలాగే ఆడబిడ్డలకు ప్రభుత్వం రూ.25 వేలు ఆర్థికసాయాన్ని వారి పేర్లమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి రసీదులు అందజేశారు. డీఆర్‌ఓ అశోకన్, యూనియన్ చైర్‌పర్సన్ రంజిత, బీడీఓ కలైసెల్వి పాల్గొన్నారు.

30న భారతీయ సంప్రదాయ బియ్యం జాతర



మాట్లాడుతున్న ఈశా ఆర్గనైజర్ ముత్తుకుమార్

వేలూరు: ఈనెల 30న ఈశా మట్టి పరిరక్షణ ఉద్యమం ఆధ్వర్యంలో తిరుచ్చిలో భారతీయ సంప్రదాయ బియ్యం జాతర నిర్వహించనున్నామని ఇందులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉద్యమ క్షేత్ర ఆర్గనైజర్ ముత్తుకుమార్ తెలిపారు. గురువారం ఉదయం ఆయన వేలూరులో విలేకరులతో మాట్లాడారు. ఈశా ఆధ్వర్యంలో వరి వంగడాలను పునరుద్ధరించే మార్గంగా భారత దేశ సంప్రదాయ బియ్యం పండుగను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన అగ్రగామి సేంద్రియ రైతులు, వ్యవసాయ నిపుణులు పాల్గొని పలుసలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులను ఉత్పత్తిదారులుగానే కాకుండా పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సంప్రదాయ వరి సాగులో వివిధ అవార్డులు గెలుచుకున్న కేరళకు చెందిన అగ్రగామిగా మహిళా రైతు, 120 వరి పంటలను వెలికి తీసిన తెలంగాణా రైతు భువనేశ్వరి, ఐదెకరాల భూమిలో 160 రకాల వరి సాగు చేసిన తెలంగాణాకు చెందిన రైతు శ్రీకాంత్, కర్ణాటకకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త దేవరావు పాల్గొని వరి సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. అదేవిధంగా ఆహార ప్రత్యేక నిపుణులు శక్తివేల్ యువరాజ్ సంప్రదాయ వరి వంగడాలు తినడం వల్ల కలిగే వైద్య ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. వీటితో పాటు రైతులు మొక్కల నాటడం నుంచి కోత వరకు కనుగొన్న సాధారణ వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

37 కిలోల గుట్కా పట్టివేత

- ఒకరి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై షావుకారుపేటలో గుట్కా విక్రయిస్తున్న ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై షావుకారుపేటలో ఇతర రాష్ట్రాల నుంచి గుట్కా వస్తువులు అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఎలిఫెంట్ గేట్ ఇన్‌స్పెక్టర్ పుష్పరాజ్‌కు సమాచారం అందింది. పోలీసులు షావుకారుపేట నాయకర్ వీధిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అక్కడున్న ఒక ఇంట్లో దాచి ఉంచిన 37 కిలోల స్వాధీనం చేసుకుని మహావీర్ సంద్ (43)ని అరెస్ట్ చేశారు.

ట్రేడర్స్ మీట్



కేంద్ర ప్రభుత్వ నేషనల్ ట్రేడర్స్ వెల్ఫేర్ బోర్డు నేతృత్వంలో చెన్నైలో ట్రేడర్స్ మీట్ బుధవారం రాత్రి జరిగింది. తమిళనాడులోని మర్చంట్స్, మ్యానుఫ్యాక్చరర్స్, వెల్ఫేర్ బోర్డు చైర్మన్ సునీల్జీ సింఘ్వీ, సభ్యులు రాజేష్ చందన్, ఆదేశ్‌కుమార్, ఎఫ్‌టీఎంఏపీ కార్యదర్శి అజయ్ దుగర్ తదితరులు హాజరై వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు.
- సాక్షి, చెన్నై

త్వరలో అందుబాటులోకి కందకోట్టం ఆస్పత్రి


నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

కొరుక్కుపేట: కందకోట్టం ముత్తు కుమారస్వామి ఆలయం స్థలంలో నిర్మిస్తున్న ఆసుపత్రిని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి శేఖర్ బాబు తెలిపారు. కందకోట్టం ముత్తుస్వామి ఆలయం చెన్నైలోని తంబుశెట్టి వీధిలో చాముండేశ్వరీ అంబల్ ట్రస్ట్ భవనంలో ఉంది. ఈ ఆలయ నిర్వాహకులు వైద్యశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఉదయం మంత్రి శేఖర్‌బాబు ఈ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధార్మిక సంక్షేమ శాఖ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 2021–22 ఆర్థిక నివేదికలో పేర్కొన్న విధంగా దేవాలయాల్లో భక్తుల వైద్య సదుపాయాల కోసం 10 ఆసుపత్రులను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ. 4,874 కోట్ల విలువైన భూములను హిందూ దేవదాయశాఖ రికవరీ చేసిందన్నారు. అనంతరం చెన్నై కీల్పాక్ పూందమల్లి హైరోడ్డులో హయ్యర్ సెకండరీ పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి శేఖర్‌బాబు భూమి చేశారు.

అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఎల్‌ఓ

తిరువళ్లూరు: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని తిరువళ్లూరు జిల్లా గ్రంథాలయ అధికారి తిరుజ్ఞాన సంబంధం సూచించారు. అబ్దుల్‌కలాం 8వ వర్ధంతిని గురువారం ఉదయం మనవాలనగర్‌లోని గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళుర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం పట్టాభిరామన్, రీడర్స్ అసోషియేషన్ నేతలు మణియన్, రామదాసు, సుకుమారన్, రేవతి, కన్నన్, సుందరమూర్తి, దక్షిణామూర్తి, షణ్ముగం పాల్గొన్నారు.

పన్ను నియామక కమిటీ ఎన్నికలు


ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్

వేలూరు: వేలూరు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం కార్పొరేషన్ పన్నుల నియామక కమిటీ ఎన్నికలు పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ జరిగాయి. ఎన్నికలకు కమిషనర్ రత్నస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్ కుమార్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్ పాల్గొన్నారు. అనంతరం సమావేశ మందిరం గదులను పూర్తిగా మూసివేసి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 60 కార్పొరేటర్‌లతో కూడిన కార్పొరేషన్‌లో ఈ ఎన్నికల్లో 55 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో మొత్తం 10 మంది పోటీ చేశారు. పోలింగ్ బాక్సులు ఏర్పాటు చేయడంతో ఇందులో కార్పొరేటర్లు వేర్వేరుగా వెళ్లి ఓటు వేశారు. అనంతరం వెంటనే కౌంటింగ్ జరిగింది. ఇందులో డీఎంకే కార్పొరేటర్‌లు చక్రవర్తి, చిత్ర, సుధాకర్, శేఖర్, నిత్యకుమార్, మురుగన్, రజనీ, షణ్ముగం, అష్మిత కమిటీ సభ్యులుగా విజయం సాధించారు. అన్నాడీఎంకే కార్పొరేటర్ శరవణన్ 11 ఓట్లు మాత్రమే పొందడంతో ఓటమి పాలయ్యారు. అన్నాడీఎంకే కార్పొరేటర్‌లు ఆరుగురు, బీజేపీ ఒకటి మొత్తం ఏడుగురు మాత్రమే ఉన్నప్పటికీ అన్నాడీఎంకే అభ్యర్థికి 11 ఓట్లు రావడంతో సమావేశ మందిరంలో సంచలనం రేపింది. ఈ కమిటీ సభ్యులు నూతన భవన నిర్మాణాల పన్ను, పన్నుల విధింపు, ఆస్తిపన్నుకు ఈ కమిటీ అనుమతి ఉండాలి.

రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

తిరుత్తణి: రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆంధ్రాకు తరలించేందుకు సిద్ధం చేసిన రెండు టన్నుల బియ్యాన్ని టీఎస్పో గురువారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని తిరువళ్లూరు జిల్లా ఆంధ్రా సరిహద్దులోని తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి బ్రోకర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆటోలు, బస్సులు, రైళ్లలో ఆంధ్రాకు తరలించి పాలిస్ వేసి తమిళనాడుకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో తిరుత్తణి సమీపం మద్దూరులో లబ్ధిదారుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం మేరకు టీఎస్పో మలర్‌విళి తన బృందంతో మద్దూరు చేరుకున్నారు. అధికారులను చూసి బ్రోకర్లు అక్కడ నుంచి పరారయ్యారు. రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని తిరుత్తణిలోని పౌరసరఫరాల గిడ్డంగికి తరలించారు.

అలరించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు


ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు

కొరుక్కుపేట: కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గీతాభవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాభారతం, రామాయణం, భగవద్గీతలోని పలు పాత్రలపై డ్రాయింగ్ పోటీలతో పాటు చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. స్థానిక గోపాలపురంలోని గీతా భవన్‌లో జరిగిన ఈ పోటీల్లో చిన్నారులు పాల్గొని శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో తమిళంలో వక్తృత్వం, క్విజ్, గీతాపఠనం, కర్ణాటక సంగీతం పోటీలు జరగనున్నట్లు పోటీల కన్వీనర్ పి మారుతి తెలిపారు.

క్లుప్తంగా...

జిల్లా ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు

సాక్షి, అమరావతి: జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలోని 26 జిల్లాలు ఆ జిల్లాల పరిధిలోకి వచ్చే నియోజకవర్గాలకు కలెక్టర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా నాగార్జున యాదవ్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీ ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా వై.సాయి నాగార్జున యాదవ్‌ను నియమిస్తూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఉత్తర్వులిచ్చారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన నాగార్జున యాదవ్ వైఎస్సార్‌సీపీ ప్రారంభం నుంచి వైఎస్ జగన్ వెంట నడిచారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతగా సేవలందించిన నాగార్జున యాదవ్ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు.ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని వినియోగించుకోండి

పౌరసరఫరాల శాఖ కమిషనర్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ క్వాలిటీ గోధుమ పిండిని కార్డుదారులు వినియోగించుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జూలై నుంచి 128 మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని 36 లక్షల మంది కార్డుదారులకు ఒక్కొక్కరికీ కిలో రూ.16 చొప్పున పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ, ఈ నెలలో కేవలం 7.82లక్షల మంది మాత్రమే గోధుమ పిండిని వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

78 మంది వైద్యులకు డీఎంఈ నోటీసులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ఏడాదికిపైబడి విధులకు గైర్హాజరైన వైద్యులను తొలగింపునకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) చర్యలు చేపట్టింది. ముందస్తు సెలవు అనుమతుల్లేకుండా ఏడాదికిపైగా విధులకు హాజరవ్వని ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 76 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల నుంచి తొలగింపునకు నోటీసులిచ్చింది. వీరు ఆగస్టు 10 లోగా విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో హాజరై వివరణ ఇవ్వాలని లేదంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వీస్ నుంచి పూర్తిగా తొలగిస్తామని డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ నరసింహం గురువారం చెప్పారు.

యూనాని వైద్యుల నియామక ఫలితాలు వెల్లడి

సాక్షి, అమరావతి: ఆయుష్ విభాగంలోని యూనాని మెడికల్ ఆఫీసర్ పోస్టుల నియామకానికి ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం వెల్లడించింది. ఫలితాలను https:// psc. ap. gov. in/ లో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ తెలిపారు.

న్యూయార్క్ ఎగ్జిబిషన్‌కు ఏపీ కళాఖండాలు

బౌద్ధ కళా ప్రదర్శనకు హాజరైన సీఎం ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ హరికృష్ణ

సాక్షి, అమరావతి: న్యూయార్క్‌లోని 'ది మెట్' మ్యూజియంలో ఏర్పాటు చేసిన 'ట్రీ అండ్ సర్పెంట్: ఎర్లీ బుద్ధిస్ట్ ఆర్ట్ ఇన్ ఇండియా 200 బీసీఈ–400సీఈ' ప్రదర్శనకు సీఎం జగన్ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఎం.హరికృష్ణ హాజరయ్యారు. భారతదేశంతో పాటు ముఖ్యంగా ఏపీలో బౌద్ధ మూలాలను తెలియజేసే పలు వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌కు హాజరైన హరికృష్ణ మాట్లాడుతూ.. 'బుద్ధుని బోధనలు ఆనందంగా, శాంతి, సంతృప్తితో జీవించేందుకు కోట్లాది మంది ప్రజలను ప్రేరేపించాయి. ఆయన బోధనల ప్రేరణతో ప్రపంచ నాయకులు కూడా శాంతియుత ప్రపంచాన్ని సృష్టించడానికి ప్రయత్నించాలి. 2006లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏపీలో కాలచక్ర నిర్వహించగా.. దలైలామాతో పాటు పెద్ద సంఖ్యలో బౌద్ధులు పాల్గొన్నారు. అమరావతి స్థూపంతో సహా అనేక పురాతన వస్తువులకు ఏపీ నిలయం. కాలచక్ర సభ తర్వాత 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహాన్ని అమరావతిలో నిర్మించారు' అని వివరించారు. సీఎం జగన్ 'విజిట్ ఆంధ్రప్రదేశ్' పేరుతో రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు అమూల్యమైన కళాఖండాలను అందించాలని సీఎం జగన్ సూచించారని.. అవి సందర్శకులను బుద్ధ భగవానుడి బోధనలను అనుసరించేలా ప్రేరేపిస్తాయన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

రైతుల హక్కులను తెలంగాణకు తాకట్టుపెట్టిన రాయలసీమ ద్రోహి

- ఓటుకు కోట్లు కేసుకు జడిసి నోరెత్తలేని వైనం
- నిప్పులు చెరిగిన జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పేరుతో రూ.3,774 కోట్లు వృథా
- నాడు రూ.68,293 కోట్ల ఖర్చుతో నీళ్లిచ్చింది 3.4 లక్షల ఎకరాలకే
- ప్రాజెక్టుల పనుల్లో రూ.వేలాది కోట్లు దోచేసి అస్తవ్యస్తంగా మార్చారు
- రూ.27,394 కోట్ల ఖర్చుతో 5.03 లక్షల ఎకరాలకు నీళ్లందించిన సీఎం వైఎస్ జగన్
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచిన వైఎస్సార్
- దాన్ని నిరసిస్తూ టీడీపీ నేతలతో ధర్నాలు చేయించిన ద్రోహి చంద్రబాబు
- రాయలసీమ హక్కుల పరిరక్షణకు రాయలసీమ ఎత్తిపోతల చేపట్టిన సీఎం
- దీనిపైనా ఎన్జీటీలో కేసులు వేయించి అడ్డుకుంటున్నది బాబే
- వైఎస్సార్ జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్న ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి :శ్రీశైలం ప్రాజెక్టులో 796 అడుగుల నుంచే కృష్ణా జలాలను తరలించేలా 2015లో అనుమతి లేకుండా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను చేపట్టి, కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రాయలసీమ రైతుల హక్కుల ప్రయోజనాలను తెలంగాణ సర్కారు కాలరాస్తుంటే నాటి సీఎం, నేటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నోరెత్తలేదని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. రాయలసీమ ద్రోహి చంద్రబాబేనని నిప్పులు చెరిగారు. ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ సర్కార్‌కు రాయలసీమ రైతుల హక్కులను తాకట్టు పెట్టిన చంద్రబాబుకు సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కే లేదన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై మంగళ, బుధవారాల్లో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలు, అవాస్తవాలేనని తిప్పికొట్టారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి చేసిన పోలవరం కుడి కాలువలోకి పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా చెంబుడు గోదావరి జలాలను ఎత్తిపోసి.. గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేసినట్లు చంద్రబాబు చంకలు గుద్దుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో పట్టిసీమ ఎత్తిపోతల పంపులను పది రోజులు కూడా నడిపించలేదని.. అదో వృథా ఎత్తిపోతల అని చెప్పారు. అలాంటి దానికి చంద్రబాబు రూ.2,047 కోట్లు ఖర్చు చేశారన్నారు. దాన్ని గడువులోగా పూర్తి చేసినందుకు కాంట్రాక్టర్‌కు బహుమానంగా రూ.257 కోట్లను ఇచ్చినట్లు చూపి గుటకాయ స్వాహా చేశారని ఎత్తిచూపారు. గోదావరి కుడిగట్టుపై పర్యావరణ అనుమతి తీసుకోకుండా రూ.1,697 కోట్లు వ్యయం చేసి.. పురుషోత్తపట్నం ఎత్తిపోతలను నిర్మించిన చంద్రబాబు.. దాని ద్వారా ఒక్క ఎకరాకూ నీళ్లందించలేదని గుర్తు చేశారు. ఆ ఎత్తిపోతలపై కూడా టీడీపీ నేతలు ఎన్జీటీలో కేసులు వేయడంతో పనికి రాకుండా పోయిందన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పేరుతో రూ.3,744 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన చంద్రబాబు ప్రజాద్రోహి అని ధ్వజమెత్తారు. మీడియాతో మంత్రి అంబటి ఇంకా ఏం చెప్పారంటే..

రూ.68 వేల కోట్లు తినేశానని చెప్పుకో

- ▲ చంద్రబాబు, కరవు కవల పిల్లలు. 2014–19 మధ్య టీడీపీ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు ఏటా సగటున 300 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాక.. సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రం సుభిక్షంగా మారింది.
- ▲ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు 54. కానీ.. 198 ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేసినట్లు చంద్రబాబు చెబుతున్నాడు. 198 ప్రాజెక్టులు కాదు.. ప్యాకేజీలు. ప్రాజెక్టులకూ ప్యాకేజీలకు తేడా తెలియదా బాబూ? దశాబ్దాల క్రితం చేపట్టిన ప్రాజెక్టుల పనుల్లో సులభంగా ఉండే పనులు చేసి, క్లిష్టమైన పనులు చేయకుండా కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దాంతో వాటిని ప్రీక్లోజ్ చేసి, ప్రభుత్వ అనుమతితో వాటికి మళ్లీ టెండర్లు పిలిచి.. పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే, వాటిని ఆపేశారని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు.
- ▲ ప్రాజెక్టులపై 2014–19 మధ్య రూ.68,293.94 కోట్లు ఖర్చు చేసిన టీడీపీ సర్కార్.. కేవలం 3.4 లక్షల ఎకరాల పాత, కొత్త ఆయకట్టుకు మాత్రమే నీళ్లందించగలిగింది. 2019 మే 30 నుంచి ఇప్పటి వరకు సాగునీటి ప్రాజెక్టులపై రూ.27,394 కోట్లు వ్యయం చేసి, 5.03 లక్షల ఎకరాలకు నీళ్లందించాం. దీన్ని బట్టి ప్రాజెక్టు పనుల పేరుతో చంద్రబాబు వేలాది కోట్ల రూపాయలను దోచేసినట్లు స్పష్టమవుతోంది.
- ▲ పోలవరం ప్రాజెక్టుకు వ్యయం చేసిన రూ.10,860 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. నీరు–చెట్టు పేరుతో రూ.12,400 కోట్లను టీడీపీ నేతలకు చంద్రబాబు దోచిపెట్టారు. ప్రాజెక్టులపై రూ.68,293 కోట్లను వ్యయం చేశామని కాకుండా తిన్నామని చంద్రబాబు చెప్పుకుంటే సరిపోతుంది.

ప్రాజెక్టులకూ వెన్నుపోటు

- ▲ ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చంద్రబాబు చెబుతున్నట్లు ఎన్టీఆర్ డిజైన్ చేసిన తెలుగుగంగ, గాలేరు–నగరి, హంద్రీ–నీవాలను 1995 నుంచి 2004 వరకు చేపట్టకుండా రాయలసీమ ప్రజలకూ వెన్నుపోటు పొడిచారు.

బాబూ.. ఈ ప్రశ్నలకు బదులివ్వు

ప్రాజెక్టు ప్రొటోకాల్స్‌ను తుంగలో తొక్కి.. సులభంగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే పనులే చేపట్టి, కమీషన్లు కాజేసిన చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులను అస్తవ్యస్తంగా మార్చి.. రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేశారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం పోలవరమే. శుక్రవారం పోలవరంపై మాట్లాడతానని చెప్పిన చంద్రబాబుకు సిగ్గు, లజ్జా, చీము, నెత్తురు ఉంటే ఈ మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాకే పోలవరంపై మాట్లాడు.

1.విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఎందుకు తీసుకున్నావు?

2.కాఫర్ డ్యామ్‌లు నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్‌ను ఎందుకు నిర్మించావు?

3.పోలవరాన్ని, 2018 నాటికే పూర్తి చేస్తానని శాసనసభలో శపథం చేసి.. ఎందుకు పూర్తి చేయలేకపోయావు?

- ▲ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచి.. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా చేపట్టాలని రాయలసీమలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేశారు. అప్పట్లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచాలని.. ఆ ప్రాజెక్టుల పనులు ప్రారంభించాలని ఎన్టీఆర్‌ను ఎప్పుడైనా కోరావా చంద్రబాబూ?
- ▲ 2004లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. సముద్రం పాలవుతోన్న నదీ జలాలను మళ్లించి, రాష్ట్రాన్ని సుభిక్షం చేయడమే లక్ష్యంగా జలయజ్ఞం కింద ప్రాజెక్టులు చేపట్టారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచడంతోపాటు గాలేరు–నగరి, హంద్రీ–నీవాలను చేపట్టి సింహభాగం పూర్తి చేశారు. తెలుగుగంగ, ఎస్సార్బీసీలను సింహభాగం పూర్తి చేశారు.
- ▲ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచడం ద్వారా రాయలసీమకు మహానేత వైఎస్ న్యాయం చేస్తుంటే.. దాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లో నాగంతో విజయవాడలో దేవినేని ఉమాతో ధర్నాలు చేయించిన చంద్రబాబును రాయలసీమ ద్రోహి అనక ఇంకేమనాలి?

నాలుగేళ్లుగా సువర్ణ అధ్యాయం

- ▲ మహానేత వైఎస్సార్ జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేస్తూ జాతికి అంకితం చేస్తున్నారు. పెన్నా బ్యారేజ్, సంగం బ్యారేజ్‌లను జాతికి అంకితం చేయడం ద్వారా చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని సీఎం వైఎస్ జగన్ లిఖించారు. ఆ బ్యారేజ్‌లను పూర్తి చేశానని చెప్పుకోవడానికి నీకు సిగ్గు లేదా చంద్రబాబూ?
- ▲ గండికోట నిర్వాసితులకు సీఎం వైఎస్ జగన్ పునరావాసం కల్పించడంతో పూర్తి స్థాయిలో 26.85 టీఎంసీలను నిల్వ చేస్తున్నాం. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీలు నిల్వ చేస్తున్నాం. సోమశిల, కండలేరులలోనూ పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశాం. తెలుగుగంగ కెనాల్‌ను ఆధునికీకరించడం ద్వారా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి.. వెలిగోడు, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్లను సకాలంలో నింపి.. ఆయకట్టుకు నీళ్లందిస్తున్నాం. బ్రహ్మంసాగర్ మట్టికట్ట, లీకేజీలకు అడ్డుకట్ట కూడా వేయలేక చంద్రబాబు చేతులెత్తేశారు. సీఎం వైఎస్ జగన్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి ఆ ప్రాజెక్టులో 17.85 టీఎంసీల నిల్వకు మార్గం సుగమం చేశారు.
- ▲ గాలేరు–నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగాన్ని పూర్తి చేశాం. ఇప్పుడు 20 వేల క్యూసెక్కులను ఆ కాలువ ద్వారా తరలిస్తాం. వెలిగొండ, వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం సహా అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం.
- ▲ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చే 30–40 రోజుల్లోనే దాన్ని ఒడిసిపట్టి రాయలసీమ ప్రాజెక్టులను నింపేలా రూ.40,880 కోట్లతో రాయలసీమ కరవు నివారణ ప్రణాళిక కింద కాలువల సామర్థ్యం పెంచడం, రిజర్వాయర్ల నిర్మాణాన్ని సీఎం వైఎస్ జగన్ చేపట్టారు.
- ▲ శ్రీశైలంలో 800 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉన్నప్పుడు కూడా కేటాయింపుల మేరకు రాయలసీమకు జలాలను తరలించడానికి వీలుగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కాలువలోకి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా సీఎం వైఎస్ జగన్ రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టి ఆ ప్రాంతానికి న్యాయం చేస్తున్నారు. దీనిపై ఎన్జీటీలో కేసులు వేయించి ఆ ప్రాంతానికి చంద్రబాబు ద్రోహం చేస్తున్నారు. ఆవులపల్లి, ముదివేడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్ల నిర్మాణంపై కూడా టీడీపీ నేతలతో ఎన్జీటీలో కేసులు వేయించడం ద్వారా వాటిని అడ్డుకుని రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం చేశారు.


సంవత్సరం	గరిష్ఠ నీటి నిల్వ (టీఎంసీల్లో)			మూడు ప్రాజెక్టుల్లో సగటు నిల్వ (టీఎంసీల్లో)
	బ్రహ్మంసాగర్	సీబీఆర్	గండికోట	
2014-15	4.240	1.180	0.994	2.138
2015-16	2.879	1.510	0.372	1.587
2016-17	5.381	1.180	5.232	3.931
2017-18	6.490	6.330	8.270	7.030
2018-19	4.482	3.500	12.080	6.687
మొత్తం	23.472	13.700	26.948	21.373
సగటు నీటినిల్వ (2014-15 నుంచి 2018-19)				
	4.694	2.740	5.390	4.275
2019-20	7.831	7.020	11.980	8.944
2020-21	14.881	10.160	26.850	17.297
2021-22	17.032	10.010	26.850	17.964
2022-23	16.087	9.600	26.850	17.512
మొత్తం	55.831	36.790	92.530	61.717
సగటున నీటి నిల్వ (2019-20 నుంచి 2022-23)				
	13.958	9.198	23.133	15.429
2014 నుంచి 2023 వరకు మొత్తం				
	79.303	50.490	119.478	83.090

ఒక్క ప్రాజెక్టు పేరు చెప్పగలవా?

దాదాపు 30 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లలేని చంద్రబాబుకు సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే అర్హతే లేదు. 14 ఏళ్ల సీఎంగా ఉన్నప్పుడు.. నువ్వే డిజైన్ చేసి, టెండర్లు పిలిచి, పూర్తి చేసి, జాతికి అంకితం చేసిన ఒక్క ప్రాజెక్టు అయినా ఉందా? మహానేత వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం కింద ఒకేసారి రూ.లక్ష కోట్ల వ్యయంతో 84 ప్రాజెక్టులు చేపట్టి 2009 నాటికే 23 ప్రాజెక్టులు పూర్తి చేశారు. మిగిలిన ప్రాజెక్టులను సీఎం వైఎస్ జగన్ పూర్తి చేస్తూ.. జాతికి అంకితం చేస్తూ.. రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తుండటం కన్పించడం లేదా చంద్రబాబూ?

69 నదులను అనుసంధానం చేస్తాం

- గోదావరి నీళ్లతో ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం
- రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు అటకెక్కాయి
- టీడీపీ హయాంలో కోస్తాంధ్ర ప్రాజెక్టులపై రూ.21,442 కోట్లు వెచ్చించాం
- వైఎస్సార్‌సీపీ రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది
- పట్టిసీమతో రాయలసీమలో సిరులు పండుతున్నాయి
- వెలిగొండ ప్రాజెక్టును నేనే ప్రారంభించా
- ఈ ప్రభుత్వం పనులు ఆపేసింది
- టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 69 నదులను అనుసంధానం చేసి సాగునీటి రంగాన్ని బలోపేతం చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉత్తరాంధ్రలోని వంశధార, నాగావళితో పాటు గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్‌ను సాగునీటి రంగంలో దక్షిణ భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా వంశధార, నాగావళి, వాటి ఉపనదులను కలుపుతూ నదుల అనుసంధానానికి శ్రీకారం చుడతామన్నారు. గోదావరి నీటితో ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఆయన గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కోస్తాంధ్ర సాగు నీటి ప్రాజెక్టులపై మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను అటకెక్కించిందని విమర్శించారు. నాలుగేళ్లలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్నారు. టీడీపీ హయాంలో 2014 నుంచి 19 వరకు కోస్తాంధ్ర ప్రాజెక్టులపై రూ.21,442 కోట్లు వెచ్చిస్తే వైఎస్సార్‌సీపీ రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. తాము కట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పథకంతోనే రాయలసీమలో సిరులు పండుతున్నాయని చెప్పారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తానే ప్రారంభించానని, నీళ్లిచ్చే సమయానికి ఈ ప్రభుత్వం వచ్చి పనులు ఆపేసిందని ఆరోపించారు. ఐదు నెల్లలో ఐదు ప్రాజెక్టులు పూర్తి చేస్తామని కట్టుకథలు చెబుతోందన్నారు.

మేము సిరులు పండించాలనుకున్నాం

తాము నీళ్లిచ్చి సిరులు పండించాలనుకున్నామని, వీళ్లు రక్తం పారిస్తున్నారని వ్యాఖ్యానించారు. రౌడీయిజం కాపాడుతుందని అనుకుంటున్నారని, ప్రజలు తిరగబడితే అదే రౌడీయిజం దహిస్తుందని అన్నారు. ఉత్తరాంధ్రలో విశాఖపట్నం కేంద్రంగా ఈ నాలుగేళ్లలో రూ.40 వేల కోట్లు దోచుకున్నారని, ఆ డబ్బుతో మొత్తం ఉత్తరాంధ్ర భూములకు నీళ్లివ్వవచ్చని అన్నారు. దోపిడీలో, అవినీతిలో ఉత్తరాంధ్ర మంత్రులు భాగస్వాములయ్యారని ఆరోపించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పులు భారం మోపారని విమర్శించారు. నాలుగేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలు దేశంలో ఎక్కడా లేని విధంగా పెంచేశారన్నారు. నాలుగేళ్లలో కోస్తాంధ్రలో 96 ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేశారని అన్నారు. అసలు ఎందుకు ప్రీక్లోజర్ చేశారో, మళ్లీ ఐదేళ్లకు ఎందుకు టెండర్లు పిలుస్తున్నారో సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

అందరితో చర్చించాకే పొత్తులపై నిర్ణయం

- ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి
- జేపీ నడ్డా, బీఎల్ సంతోష్‌తో భేటీ



సాక్షి, న్యూఢిల్లీ:ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఎన్నికల్లో పొత్తులపై అందరితో చర్చించాకే పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై చర్చించేందుకు ఢిల్లీ వచ్చిన ఆమె పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంస్థాగతంగా రాష్ట్రంలో చేయాల్సిన మార్పులపై అధిష్టానానికి నివేదిక అందించారు. పొత్తుల గురించి నిర్ణయం తీసుకునేందుకు ఇంకా సమయం ఉందని, ఎన్నికలకు ముందు పొత్తుల గురించి నిర్ణయం ఉంటుందని పురందేశ్వరి భేటీ అనంతరం మీడియాకు తెలిపారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతా రామన్‌ను కలిసి ఏపీ ఆర్థిక పరిస్థితులను వివరించానని పురందేశ్వరి తెలిపారు.

'నేనేం తప్పులు చెప్పలేదు'

ఇటీవల మీడియా సమావేశంలో ఏపీ ఆర్థిక పరిస్థితుల గురించి తాను తప్పులు చెప్పలేదని.. 2023 జూలై నాటికి ఏపీకి రూ.10,77,006 కోట్ల అప్పు ఉందని పురందేశ్వరి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందన్నారు. కార్పొరేషన్ ద్వారా చేసిన అప్పులు అధికారికమా, అనధికారికమా అన్నది ఏపీ ప్రజలకు తెలియాలన్నారు. రాష్ట్రంలో చిన్న సన్నకారు కాంట్రాక్టర్లకు రూ.71 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులను అనధికారికంగా వాడటంపై సర్పంచ్‌లకు సమాధానం చెప్పాలని పురందేశ్వరి డిమాండ్ చేశారు. నిధులు దారి మళ్లించి అప్పులు తీసుకువచ్చి ఆ భారాన్ని ప్రజలపై రుద్దుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఏపీలో అభివృద్ధి లేదని.. అప్పులు మాత్రమే ఉన్నాయని పురందేశ్వరి విమర్శించారు.

పలు రైళ్లు రద్దు.. దారి మళ్లింపు



రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): వర్షాల కారణంగా హసనపర్తి–కాజీపేట సెక్షన్ మధ్యలో ట్రాక్‌లపై ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం చేరుకోవడంతో ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికంగా రద్దు చేయడంతో పాటు మరి కొన్నింటిని అధికారులు దారి మళ్లించారు. సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) రైలును ఈ నెల 27, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్(17223) రైలును ఈ నెల 28న పూర్తిగా రద్దు చేశారు. సికింద్రాబాద్–ధనాపూర్ (12791)రైలును గురువారం కాజీపేట, విజయవాడ, దువ్వాడ, విజయనగరం మీదుగా దారి మళ్లించారు. చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్ (12656) రైలును వరంగల్లు, సికింద్రాబాద్, వాడి, సోలాపూర్, మన్మాడ్ మీదుగా దారి మళ్లించారు. చెన్నై సెంట్రల్–మాత వైష్ణోదేవి కాత్ర రైలును గుంటూరు, సికింద్రాబాద్, మన్మాడ్ మీదుగా దారి మళ్లించారు. రామేశ్వరం–బెనారస్ (22535) రైలును విజయవాడ, దువ్వాడ, విజయనగరం మీదుగా దారి మళ్లించారు.

హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

వర్షాల నేపథ్యంలో రైళ్ల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా విజయవాడ, ఒంగోలు, తెనాలి, సామర్లకోట, ఏలూరు, రాజమండ్రి స్టేషన్‌లతో పాటు గూడురు స్టేషన్‌లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నంబర్‌లు విజయవాడ 0866–2576924, గూడూరు 7815909300 స్టేషన్‌లలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు గురువారం చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్ | రాజ్యసభ

సినీ కార్మికుల కష్టాన్ని గుర్తించాలి

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: సినీ కార్మికుల కష్టాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. కథానాయకులు రూ.కోట్లలో పారితోషికాలు అందుకుంటున్నారని, కార్మికుల వేతనాలు మాత్రం అంతంతగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ కార్మికుల కష్టానికి తగ్గ ఫలం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సినిమాటోగ్రఫీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం రాజ్యసభలో సినిమాటోగ్రఫీ సవరణ బిల్లు, 2023పై ఆయన మాట్లాడారు. భారతీయ చలనచిత్ర రంగంలో వివిధ విభాగాల్లో రెండు లక్షల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. చిత్ర నిర్మాణ వ్యయంలో మూడోవంతు పైగా భాగం కథానాయకుల పారితోషికాలకే సరిపోగా.. మిగిలిన మొత్తంతో చిత్రనిర్మాణం పూర్తి చేయాల్సి వస్తోందన్నారు. సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్ పొందిన చిత్ర నిర్మాత లేదా దర్శకుడిపై ఎలాంటి క్రిమినల్ కేసులు దాఖలు కాకుండా నిరోధించేలా సినిమాటోగ్రఫీ చట్టంలో సవరణ చేయాలని కోరారు.

రైల్వే అప్రెంటీస్‌లకు న్యాయం చేయండి

నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రెయినింగ్ (ఎన్‌సీవీటీ) చేసిన తప్పిదం కారణంగా వందలాది కోర్సు కంప్లీటెడ్ అప్రెంటిస్ అభ్యర్థులకు రైల్వే నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని విజయసాయిరెడ్డి తెలిపారు. ఎన్‌సీవీటీ పరీక్షకు హాజరు కాలేదన్న సాకుతో వారి నియామకాన్ని రైల్వే పెండింగ్‌లో పెట్టిందన్నారు. మానవతా దృక్పథంతో ఆ అభ్యర్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పైరసీ సైట్ల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి:ఎంపీ నిరంజన్‌రెడ్డి



విచ్చలవిడిగా పెరిగిపోతున్న పైరసీ సైట్ల నియంత్రణకు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. పటిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి భారతీయ సినిమా ఆర్థికంగా నష్టపోకుండా చూడాలన్నారు. పైరసీ సైట్లు సుమారు రూ.20 వేల కోట్ల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయన్నారు. గురువారం రాజ్యసభలో సినిమాటోగ్రఫీ సవరణ బిల్లుపై నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ఆయా సైట్లను బ్లాక్‌చేయడం ద్వారా భారతీయ సినిమాను రక్షించొచ్చన్నారు

లోక్‌సభ

పోలవరం నిధులపై అభ్యంతరం చెప్పలేదు




పోలవరం ప్రాజెక్ట్‌లో 41.15 మీటర్ల వరకూ నీటిని నింపడానికి రూ.10,911.15 కోట్లు వరద నష్టం రూ.2 వేల కోట్లు నిధులకు ఆర్థిక శాఖ అభ్యంతరం చెప్పలేదని జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు పేర్కొన్నారు. ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

జనవిశ్వాస్ బిల్లుకు మద్దతు



లోక్‌సభలో కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన జన విశ్వాస్ సవరణ బిల్లు, 2022కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. బిల్లుపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ.. దేశంలో జీవన సౌలభ్యానికి బిల్లు ఎంతో తోడ్పడుతుందన్నారు. బిల్లులో కొన్ని మార్పులను ఎంపీ సత్యవతి సూచించారు.

తిట్టలేదు.. అవాస్తవాల ప్రచారంపై ప్రశ్నించానంతే: ఎంపీ ఎంవీవీ



తనతో పాటు తన కుటుంబ సభ్యుల గౌరవానికి భంగం కలిగేలా మీడియాతో మాట్లాడిన వ్యవహారంలో నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కేవలం ప్రశ్నించాను తప్ప అసభ్య పదజాలంతో తిట్టలేదని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. తనపై చేసిన అసత్య ప్రచారంపై రఘురామను నిలదీశానని, వాస్తవాలు తెలియకుండా ఇష్టానురీతిన ఎలా మాట్లాడుతారని ప్రశ్నించినట్టు తెలిపారు. ఈ నెల 20న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభ వాయిదా పడిన అనంతరం సెంట్రల్ హాల్లో తనను అసభ్య పదజాలంతో తిడుతూ.. చంపేస్తాననే ధోరణిలో బెదిరింపులకు పాల్పడ్డారంటూ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లాకు ఎంపీ రఘురామరాజు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై ఎంవీవీ సత్యనారాయణ స్పందిస్తూ.. ఆయన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. తన కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఉదంతంపై రఘురామ తలాతోక లేని ఆరోపణలు చేశారని విమర్శించారు.








ట్రెండ్

వేడుకలు సంప్రదాయమైనా
పాశ్చాత్యమైనా
టాప్ టు బాటమ్ స్పెషల్‌గా
కనిపించాలనుకునేవారికి
నెయిల్ ఆర్ట్ కూడా తనదైన ముద్ర వేస్తోంది.
సందర్భానికి తగిన డిజైన్లతో
నఖ శిఖ పర్యంతం ఆకట్టుకోవడానికి
కొత్తగా ముస్తాబు అవుతోంది.

కళ పెంచే పండగ

వేడుకలకు తగినట్టుగా రెడీ అవడానికి తగిన డ్రెస్‌లను ఎంపిక చేసుకుంటాం. అలాగే, వాటికి తగిన మ్యాచింగ్ పట్ల కూడా శ్రద్ధ పెడతాం. అయితే, మరింత ప్రత్యేకత చూపడానికి నెయిల్ ఆర్ట్ డిజైన్స్‌లోనూ శ్రద్ధ తీసుకుంటున్నారు నేటి యువత. ఫ్రెండ్‌షిప్ డే, ఇండిపెండెన్స్ డే, రక్షాబంధన్, కృష్ణాష్టమి.. వంటి రాబోయే వేడుకలను నెయిల్ ఆర్ట్ డిజైన్స్‌లో చూపుతూ సందర్భానికి తగినట్టుగా రెడీ అవుతున్నారు.





కొన్ని రంగుల నెయిల్ పాలిష్‌లు తెచ్చుకొని, డ్రెస్‌కు లేదా చీరకు మ్యాచ్ అయ్యే రంగును గోళ్లకు వేసుకోవడం మనకు తెలిసిందే. అయితే, ఇప్పుడు చీర లేదా డ్రెస్ రంగుతోపాటు ఆ డిజైన్‌కు మ్యాచ్ అయ్యే. పండగ థీమ్ ఆర్ట్‌ను నెయిల్స్‌పై ఎంచుకుంటున్నారు. అందుకు నెయిల్ ఆర్ట్ స్పా లు ప్రత్యేకంగా తోడ్పడుతున్నాయి.









కొనుగోరు చేయవచ్చు!

ఎంత బాగా షేప్ చేసినా, గోళ్లు విరిగిపోవడం సహజంగా జరుగుతుంటుంది. నెయిల్ ఆర్ట్‌తో వేళ్లు అందంగా ఉండాలనుకునేవారు ఆర్టిఫిషియల్ నెయిల్స్‌తో సరికొత్తగా మార్చుకుంటున్నారు. ఈ మోడల్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని మన నెయిల్ షేప్‌ను బట్టి, జెల్‌తో సెట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత పాలిష్‌తో డిజైన్ చేసుకోవచ్చు. నచ్చిన డిజైన్ సరైన విధంగా రాదనుకునేవారు నిపుణుల సాయం తీసుకోవచ్చు.

- చేతులకు పెడిక్యూర్‌లో భాగంగా వేలి కొసల్లో క్యుటికల్స్, డెడ్‌స్కిన్ అంతా క్లీన్ చేసి అప్పుడు మన వేళ్లను బట్టి ఏ షేప్‌లో కావాలో ఆ ఆర్టిఫిషియల్ నెయిల్స్ అమర్చుకోవాలి. (నెయిల్స్ పెరిగినప్పుడు, వీటిని మళ్లీ క్లియర్ చేసుకోవచ్చు).

బ్యూటిప్స్

హెయిర్ కేర్

- జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటే పెరుగు మంచి ఫలితాన్నిస్తుంది. ఒక కప్పు పుల్లటి పెరుగు తీసుకోవాలి. జుట్టును చిక్కులేకుండా దువ్వి పెరుగును ఒక్కొక్క స్పూన్ తల మీద వేస్తూ వేళ్లతో మర్దన చేయాలి. తలంతా ప్రతి వెంట్రుక కుదురుకూ పెరుగు పట్టాలన్న మాట. ఓ అరగంట తర్వాత వేడినీటితో తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే జుట్టు చిట్లిపోకుండా మృదువుగా, ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేళ్లతో తలంతా మర్దన చేసుకోవడం సాధ్యం కాకపోతే జుట్టు కుదుళ్లకు పెరుగును పట్టించిన తర్వాత గుండ్రటి పళ్లున్న దువ్వెనతో పది నిమిషాల సేపు దువ్వితే సరిపోతుంది.



- జుట్టు రాలుతుంటే బంగాళదుంప రసం బాగా పని చేస్తుంది. బంగాళాదుంపను తురిమి రసం తీసుకోవాలి. అరకప్పు రసంలో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జు కలిపి తలకు పట్టించాలి. జుట్టుకు పైన రాసి సరిపుచ్చకూడదు. కేశాల మొదళ్లకు పట్టేలా రాసి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. రెండు గంటల తర్వాత వేడి నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే జుట్టురాలడం తగ్గిపోతుంది.



వినూత్న ఆలోచన

మా కథలు మా సొంతం

అవ్వలు, తాతలు గతించిపోతే
వారికి తెలిసిన జానపద సంపద కూడా
అంతరించిపోతుంది.
మన పెద్దల నుంచి వినాల్సిన ఎన్నో కథలు,
పాటలు, సామెతలు, ఉదంతాలు
ఇప్పటికే మన నిర్లక్ష్యం వల్ల అందకుండా పోయాయి.
కేరళలో చిన్నారులు ఇకపై ఇలా జరగడానికి
వీల్లేదంటున్నారు.
తల పండిన వృద్ధుల దగ్గర కూచుని
వారికి తెలిసిన మౌఖిక జానపద కథలను
రికార్డు చేస్తున్నారు.
'ది లోర్ కీపర్స్' పేరుతో పిల్లలు
ఇలా కథలు సేకరించేందుకు
ఒక ఎన్.జి.ఓ. ప్రతి బడికి తిరిగి శిక్షణనిస్తోంది.
ఇది చాలా మంచి ఆలోచన కదూ.

బహుశా ఇప్పుడున్న నానమ్మ, తాతయ్యల తరమే కొద్దో గొప్పో జానపద వారసత్వాన్ని కాపాడుకున్న తరం కావచ్చు. ఆ తర్వాతి తరమంతా సెల్‌ఫోన్‌ల తరం. టీవీల తరం. ఓటీటీల తరం. ఇప్పుడు పల్లెల్లో ఎవరూ గుంపుగా కూచుని కథలు చెప్పుకోవడం లేదు. తరం నుంచి తరానికి అందాల్సిన మాటలను చెప్పుకోవడం లేదు. పాటలను పంచుకోవడం లేదు. ఆటలను ఆడుకోవడం లేదు. 'స్థానిక సంస్కృతి', 'జానపద వారసత్వం' ప్రతి సమూహానికి ఉంటుంది. అది ఉమ్మడి ఆస్తి. జాగ్రత్తగా తరం నుంచి తరానికి అందించాలి. తెలంగాణలో ఆదిలాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు వరకూ ప్రతి సమూహంలోని ఎందరో వృద్ధులకు– చదవడం, రాయడం రాకపోయినా కథలూ గాథలూ పురాణాల స్థానిక ప్రక్షిప్తాలు చారిత్రక ఘటనలు తెలిసి ఉంటాయి. వారు గతించితే అవి అంతరించిపోతాయి. ఇప్పటికే ఎన్నో తరాల వద్ద నుంచి స్వీకరించి నిక్షిప్తం చేయాల్సిన మౌఖిక జానపద సంపదను రికార్డు చేయడంలో చాలా నిర్లక్ష్యం పాటించి ఉన్నాం. ఇప్పటికీ అరకొరగా మాత్రమే ఆ పని జరుగుతూ ఉంది. ఈ తరం కూడా దాటిపోతే ఆ తర్వాత తెల్లముఖం వేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో కేరళ మేల్కొంది. ఇప్పటి వృద్ధతరం వెళ్లిపోక ముందే వారి నుంచి జానపద సంపదను అందుకోవాలనుకుంది. 'ఆర్కియువల్ అండ్ రీసెర్చ్ ప్రాజెక్ట్' (ఏ.ఆర్.పి.ఒ) అనే స్వచ్ఛంద సంస్థ 'ది లోర్ కీపర్స్' పేరుతో పిల్లల్నే సైనికులుగా రంగంలో దింపి జానపద కథలను రికార్డు చేయించి డిజిటల్ ఆర్కయివ్‌గా నిక్షిప్తం చేయనుంది.

కరోనా సమయంలో ఆలోచన

'ఆర్కయివల్ అండ్ రీసెర్చ్ ప్రాజెక్ట్' వ్యవస్థాపకుల్లో ఒకడైన స్రుతిన్ లాల్ కేరళలో జర్నలిస్ట్. కరోనా సమయంలో లక్షలాదిగా ఇళ్లకు మళ్లిన వలస కార్మికుల వ్యథను రికార్డు చేయడానికి ఢిల్లీ నుంచి లక్నో వరకు వారితో పాటు 600 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశాడు. వారి దీనాలాపనను రికార్డు చేశాడు. ఆ సమయంలో వారి మాటలను రికార్డు చేయకపోతే ఆ తర్వాత ఆ సందర్భం, ఆ మాటలు రెండూ మిస్ అయిపోతాయి. భావితరాలకు ఆ వేదన అందదు. సరిగ్గా ఆ సమయంలోనే వృద్ధ తరం దగ్గర ఉన్న జానపద సంపద అతనికి గుర్తుకొచ్చింది. 'నా బాల్యంలో అమ్మమ్మ, నానమ్మలు చెప్పే కథలు ఇప్పుడు అమ్మమ్మలు, నానమ్మలు చెప్పడం లేదు. ఏవో కొద్దిమంది దగ్గరే అలాంటివి మిగిలి ఉన్నాయి... వాటిని కాపాడుకోవాలి' అనుకున్నాడతడు. ఆ ఆలోచన ఎన్.జి.ఓ. స్థాపనకు కారణమై మార్జినలైజ్డ్ సెక్షన్స్ దగ్గర వున్న కళారూపాలను నిక్షిప్తం చేసే పనికి అతణ్ణి పురిగొల్పింది.




బామ్మల నుంచి కథలు రికార్డ్ చేస్తున్న పిల్లలు

పిల్లలే సైనికులు

మౌఖిక జానపద కథకు వారసులు బాలలు. వారికే ఆ విలువైన జానపద సంపద అందాలి. అలా అందాలంటే వారే నేరుగా రంగంలోకి దిగాలి అనుకున్నాడు స్రుతిన్ పాల్. 'ఇప్పుడు దాదాపు ప్రతి చిన్నారికి సెల్‌ఫోన్ అందుబాటులో ఉంది. వారు సెల్‌ఫోన్‌ను అద్భుతంగా హ్యాండిల్ చేస్తారు. అన్నీ టక్కున నేర్చుకుంటారు. వారికి రికార్డు చేసి ఎడిట్ చేయడం నేర్పిస్తే వారే పెద్దవాళ్ల దగ్గర కూచుని అన్నీ చెప్పించుకుంటారు. పైగా పిల్లలు అడిగితే చెప్పడానికి అవ్వలు, తాతలు ఇష్టపడతారు కూడా' అంటాడు లాల్. అందుకోసం తన సంస్థ తరఫున కొందరు వాలంటీర్లను కేరళలోని వివిధ జిల్లాల స్కూళ్లకు పంపడం మొదలెట్టాడు. వారు స్కూల్లో పిల్లలకు మౌఖిక జానపద సంపద సేకరణ గురించి చెప్పి, సెల్‌ఫోన్‌తో పెద్దవాళ్లు చెప్పే కథలను ఎలా రికార్డు చేసి తమకు పంపాలో నేర్పుతారు. ఇక పిల్లలు ఊరుకుంటారా? రంగంలో దిగి వరదలా వీడియోలు పంపుతున్నారు. అవన్నీ నిక్షిప్తం అవుతున్నాయి.

విన్నవీ కన్నవీ

కాశీమజిలీ కథలో, కాటమరాజు కథలో, మర్యాద రామన్న కథలో, పూటకూళ్లమ్మ కథలో... అడవి కథలో, వేట కథలో, వ్యవసాయ కథలో, ప్రకృతి కథలో, గొడ్డుగోదా కథలో, రాజు పేదా కథలో... ఏవో కథలు ఒకప్పుడు చెప్పుకోని, వినని వారు ఉండరు. అయితే అందరూ గుర్తు పెట్టుకుని మళ్లీ చెప్పే స్టోరీ టెల్లర్లు కారు. కొందరు మాత్రమే 'కథల పుట్ట'గా ఉంటారు. వీరు స్థానిక జ్ఞానాన్ని కథల్లో దాచి ఉంటారు. అవి రికార్డు కావాలి. కేరళలో ఇప్పుడు ఆ పని జరుగుతూ ఉంది. నిజానికి ప్రతిచోటా ప్రభుత్వాలు పూనుకుని ఈ పని చేస్తే ప్రతి ప్రదేశంలోని విలువైన కథలు బయటికొస్తాయి. యూట్యూబ్‌లాంటి మాధ్యమాల వల్ల అందరికీ తెలుస్తాయి.

కేరళ మేల్కొంది. అందరూ మేల్కొనాలి.

వంటిల్లు

ప్రపంచంలో ఎక్కువ మంది ఇష్టంగా తినే స్వీట్ ఫుడ్స్‌లో మన మైసూర్‌పాక్ కూడా ఒకటి. ఎంతోమంది మనసులు గెలుచుకున్న మైసూర్ పాక్‌ను మరింత వైవిధ్యంగా కూడా చేయొచ్చు. అందుకే విభిన్న మైసూర్‌పాక్‌లతో మీ ముందుకొచ్చింది ఈ వారం వంటిల్లు...

మనసు దోచే మైసూరు పాకం

బీట్‌రూట్‌తో



కావలసినవి: బీట్ రూట్ జ్యూస్ – అరకప్పు; శనగపిండి – కప్పు; నెయ్యి – ఒకటిన్నర కప్పులు; చక్కెర – కప్పు.

తయారీ: శనగపిండిని సన్నని మంట మీద పచ్చివాసన పోయేంతవరకు వేయించి దించేయాలి • వేగిన పిండి జల్లెడ పట్టుకోవాలి. ఇప్పుడు ఈ పిండిలో నెయ్యి వేసి ఉండలు లేకుండా చక్కగా కలుపుకొని పక్కన పెట్టాలి • మందపాటి బాణలిలో పంచదార, బీట్‌రూట్ జ్యూస్ వేసి సన్నని మంటమీద తిప్పుతూ తీగపాకం రానివ్వాలి • పాకం వచ్చిన తరువాత కలిపిపెట్టుకున్న శనగపిండి మిశ్రమాన్ని వేస్తూ కలుపుకోవాలి •చక్కగా కలిపాక అరకప్పు నెయ్యిని కొద్దికొద్దిగా వేస్తూ కలపాలి • నెయ్యి మొత్తం మిశ్రమంలో ఇగిరిపోయి , చిక్కబడిన తరువాత దించేసి, నెయ్యి రాసిన ప్లేటులో పోయాలి • గంట ఆరాక ముక్కలు కోసుకుని సర్వ్‌చేసుకోవాలి.

నోట్: మైసూర్ పాక్ చక్కగా రావాలంటే పిండి మిశ్రమం వేసిన తరువాత చక్కగా కలపాలి • చక్కెర, లేదా బెల్లం సిరప్‌గా మారిన వెంటనే వడగట్టాలి. తరువాత పాకం పట్టుకుంటే.. ఇసుక, మలినాలు లేకుండా మైసూర్ పాక్ రుచికరంగా వస్తుంది.

కొబ్బరి.. జీడిపప్పుతో..



కావలసినవి: శనగపిండి – కప్పు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; సన్నగా తరిగిన జీడిపప్పు పలుకులు – ముప్పావు కప్పు ; చక్కెర – రెండు కప్పులు ; నెయ్యి – ముప్పావు కప్పు ; యాలకులు – నాలుగు; నీళ్లు – ఒకటి ముప్పావు కప్పులు.

తయారీ: శనగపిండిని జల్లెడపట్టుకుని, అర కప్పు నెయ్యి వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి • మందపాటి గిన్నెలో చక్కెర, నీళ్లు పోసి తీగ పాకం వచ్చేంత వరకు మరిగించాలి • తీగపాకం వచ్చిన తరువాత కొబ్బరి తురుము, జీడిపప్పు పలుకులు వేసి కలపాలి • ఇప్పుడు వేయించి పెట్టుకున్న శనగ పిండి వేసి కలపాలి • చివరిగా యాలకులను దంచి వేయాలి • ఈ మిశ్రమంలో మిగిలిన నెయ్యిని టేబుల్ స్పూను చొప్పున వేస్తూ కలుపుతూ ఉండాలి • నెయ్యి మొత్తం వేసిన తరువాత చక్కగా కలిపి, మిశ్రమం గట్టిపడకముందే దించేయాలి • ఇప్పుడు నెయ్యి రాసి పెట్టుకున్న ప్లేటులో ఈ మిశ్రమాన్ని వేసి ఆరనివ్వాలి • పదినిమిషాల తరువాత ముక్కలుగా కట్ చేస్తే కొబ్బరి జీడిపప్పు మైసూర్ పాక్ రెడీ.


క్యారట్.. డేట్స్ పాక్



కావలసినవి: క్యారట్ తురుము – పావు కప్పు ; విత్తనాలు తీసేసిన డేట్స్ – పావు కప్పు; బెల్లం – పావు కప్పు; శనగపిండి – అరకప్పు; బ్రౌన్‌సుగర్ – కప్పు; నెయ్యి – అరకప్పు; నూనె – పావు కప్పు.

తయారీ: శనగపిండిని జల్లెడ పట్టుకుని పక్కన పెట్టుకోవాలి • టేబుల్ స్పూను నెయ్యి వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి • మందపాటి బాణలిలో మిగిలిన నెయ్యి, నూనె వేసి ఐదు నిమిషాలు వేడి చేసి పక్కనపెట్టుకోవాలి • బెల్లంలో పావు కప్పు నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన తరువాత వడగట్టి పక్కన పెట్టాలి • క్యారట్ , డేట్స్, బెల్లం నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి • గ్రైండ్ చేసి ప్యూరీని ముక్కలు లేకుండా వడగట్టి తీసుకోవాలి • బాణలిలో బ్రౌన్ సుగర్, అరకప్పు నీళ్లు పోసి మరిగించాలి • సుగర్ కరిగిన తరువాత క్యారట్ డేట్స్ ప్యూరిని వేసి సన్ననని మంట మీద తిప్పుతూ ఉండాలి • తీగ పాకం వచ్చాక శనగ పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి • ఇప్పుడు కాచి పెట్టుకున్న నెయ్యి /నూనెను కొద్దికొద్దిగా వేస్తూ కలపాలి • నెయ్యి మొత్తాన్ని మిశ్రమం పీల్చుకుని దగ్గరపడిన తరువాత దించి నెయ్యిరాసిన ప్లేటులో పోసుకోవాలి • మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడు ముక్కలు కట్ చేసుకుంటే క్యారట్, డేట్స్ పాక్ రెడీ.

చాక్లెట్ పాక్



కావలసినవి: శనగపిండి – ముప్పావు కప్పు ; కోకో పొడి – పావు కప్పు; బెల్లం – కప్పు; నీళ్లు – ముప్పావు కప్పు ; నెయ్యి – ముప్పావు కప్పు; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను.

తయారీ: శనగపిండి పచ్చివాసన పోయి, మంచి సువాసన వచ్చేంత వరకు వేయించాలి • మందపాటి గిన్నెలో బెల్లం, నీళ్లు వేసి తీగ పాకం వచ్చేంత వరకు మరిగించాలి • శనగపిండి వేగాక కోకో పొడి, నెయ్యి వేసి ఉండలు లేకుండా కలపాలి • పిండి మిశ్రమం వేగాక బెల్లం పాకం పోసి ఉండలు కట్టకుండా తిప్పుతూనే ఉండాలి • ఐదారు నిమిషాలు తిప్పాక పిస్తాపలుకులు వేసి ఐదు నిమిషాలు మగ్గనిచ్చి దించేయాలి • వెన్న రాసిన ప్లేటులో ఈ వేడివేడి పాకం మిశ్రమాన్ని వేయాలి • ఐదు నిమిషాలు ఆరాక నచ్చిన ఆకారంలో ముక్కలు కట్ చేసుకుంటే చాక్లెట్ పాక్ రెడీ.

బనానా పాక్



కావలసినవి: శనగపిండి – కప్పు; నెయ్యి – కప్పు; ఎర్ర అరటి పండ్లు – రెండు; చక్కెర – కప్పు.

తయారీ: శనగపిండిని పచ్చి వాసన పోయేంత వరకు వేయించాలి • అరటిపండ్లు తొక్కతీసి ప్యూరీలా గ్రైండ్ చేయాలి • వేగిన పిండిలో కొద్దిగా నెయ్యి వేసి పేస్టులా కలిపి దించేయాలి • చక్కెరలో కప్పు నీళ్లుపోసి మరిగించాలి • తీగపాకం వచ్చిన తరువాత శనగపిండి పేస్టు, అరటిపండు ప్యూరిని వేసి బాగా కలపాలి • మిశ్రమం చిక్కగా దగ్గరపడినప్పుడు దించేసి, నెయ్యిరాసిన ప్లేటులో వేసి ముక్కలుగా కట్ చేస్తే బనానా పాక్ రెడీ.

● టెక్.. టాక్

ఒప్పో రెనో 10 ప్రో



డిస్ప్లే	6.70 అంగుళాలు
బరువు	185 గ్రా. ● ఫింగర్‌ప్రింట్ రీడర్
రిజల్యూషన్	1080×2412 పిక్సెల్స్
మెమోరీ	256జీబి 12జీబి ర్యామ్
వోఎస్	ఆండ్రాయిడ్ 13
బాడీ	గ్లాస్ ఫ్రంట్, ప్లాస్టిక్ ఫ్రేమ్, గ్లాస్ బ్యాక్
ఫ్రంట్ కెమెరా	32 ఎంపీ
బ్యాటరీ	4600 ఎంఏహెచ్
కనెక్టివిటీ	5జీ

హువావే వాచ్ 4 ప్రో



డిస్ప్లే	1.5 అంగుళాలు కలర్ స్క్రీన్
డైమెన్షన్స్	47.6 ఎంఎం × 47.6 ఎంఎం × 12.9 ఎంఎం
రిస్ట్ సైజ్	140–210 ఎంఎం బరువు: 65గ్రా.
రిజల్యూషన్	466×466 పిక్సెల్స్
మెటీరియల్	ఏరోస్పేస్-గ్రేడ్ టైటానియం
వాచ్ స్ట్రాప్	బ్లూ కంపోజిట్ స్ట్రాప్, టైటానియమ్ స్ట్రాప్, డార్క్ బ్రౌన్ లెదర్ స్ట్రాప్

లెనోవా యోగా 9ఐ



సైజ్	14.00 అంగుళాలు
బరువు	1.4 కేజీ
రిజల్యూషన్	1920×1080 పిక్సెల్స్
ర్యామ్	8జీబి
వోఎస్	విండోస్ 10
కలర్	షాడో బ్లాక్ కనెక్టివిటీ: 5.1
కెమెరా	1ఎం వెబ్‌కామ్
బ్యాటరీ లైఫ్	18 గం.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఏ వోల్ట్-ఫేస్

ఒక విషయంలో ఆకస్మికంగా అభిప్రాయం, నిర్ణయం, కార్యాచరణ మార్చుకునే సందర్భంలో ఉపయోగించే మాట ఏ వోల్ట్-ఫేస్. ఫ్రెంచ్ భాష నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెషన్ ఇది. **ఉదా:** ఎవ్రీ వన్ వాజ్ సర్‌ప్రైజ్‌డ్ వెన్ ది క్యాండెట్ మేడ్ ఏ కంప్లీట్ వోల్ట్ ఫేస్ ఆన్ హర్ స్టెన్స్ ఆన్ ట్యాక్సెస్.

గోయింగ్ గ్రేట్ గన్స్

ఒక పనిలో లేదా ఆట, వ్యాపారం, ఉద్యోగం... మొదలైన వాటిలో ఒక వ్యక్తి ఉత్సాహంగా, విజయవంతంగా దూసుకువెళ్లే సందర్భంలో ఉపయోగించే మాట...గోయింగ్ గ్రేట్ గన్స్. **ఉదా:** ఫర్ ది ఫస్ట్ 400 మీటర్స్ హీ వాజ్ గోయింగ్ గ్రేట్ గన్స్. బట్ దెన్ హీ ఫెల్ అండ్ దట్ లాస్ట్ హిమ్ ది రేస్.

truecaller

ట్రూ కాలర్‌లో కొత్త ఫీచర్

పాపులర్ కాలర్ ఐడీ అండ్ స్పామ్‌బ్లాకింగ్ యాప్ 'ట్రూ కాలర్' ఏఐ ఆధారిత కాల్ స్క్రీనింగ్ ఫీచర్‌ని ఇండియాలో ప్రవేశపెట్టింది. ఏఐ అసిస్టెంట్ ఆన్సర్‌లకు, ఇన్‌కమింగ్ కాల్స్ ట్రాన్స్‌స్క్రైబ్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ట్రూ కాలర్ అసిస్టెంట్ స్పీచ్-టు-టెక్స్ట్ టెక్నాలజీ, నేచురల్ లాంగ్వేజీ ప్రాసెసింగ్‌లను ఉపయోగించుకొని కాలర్స్‌తో ఇంటరాక్ట్ అవుతుంది.

మినీ డైనమెట్



● మ్యూజిక్ వరల్డ్

ప్యాషన్‌నే ప్రొఫెషన్‌గా మలుచుకుంటే అంతకు మించిన ఘన విజయం ఏముంటుంది?

చిన్నప్పుడు సరదాగా కవిత్వం రాసిన, మన పాటలను ర్యాప్‌లోకి మార్చి సరదాగా పాడిన కలైవాణి నాగరాజ్ అలియాస్ లేడి కాష్ తొలి తమిళ్-ఇంగ్లిష్ ఫిమేల్ ర్యాపర్‌గా తనదైన గుర్తింపు సాధించింది.

ఏఆర్ రెహమాన్ ఆమెకు పెట్టిన పేరు మినీ డైనమెట్.

కష్ తండ్రి ప్రొఫెషనల్ డ్యాన్సర్. తల్లికి చిత్రకళ ఆసక్తికరమైన సబ్జెక్ట్. ఇంతకు మించి కష్‌కు కళానేపథ్యం లేదు. ఇక సంగీతం తెలిసిన వారు ఎవరూ లేరు. కథలు చెప్పడం, కవిత్వం పోటీలలో చురుగ్గా పాల్గొనేది. రేడియోలో పాటలు వినడం ద్వారా, మ్యూజిక్ చానల్స్ చూడడం ద్వారా సంగీతంపై ఆసక్తి మొదలైంది.

'మ్యూజికే నా కెరీర్' అని కాష్ అన్నప్పుడు తల్లిదండ్రులు అభ్యంతర పెట్టకపోగా చాలా ప్రోత్సహించారు.

తాను విన్న పాటలను ర్యాప్ సాంగ్ స్టైల్లో పాడడం కాష్‌కు ఒక సరదా. కవిత్వం రాయడం మరో సరదా. అయితే ఈ సరదాలేవి వృథా పోలేదు. తన కెరీర్‌కు గట్టి పునాదిరాళ్లుగా ఉపయోగపడ్డాయి.

భాషపై పట్టు కోసం లైబ్రరీ నుంచి ఇంగ్లిష్, తమిళ భాషల్లోని పుస్తకాలను తెచ్చుకొని చదివేది. ర్యాప్‌లో తనదైన టాలెంట్ చూపుతున్న కాష్‌కు 'రోబో' సినిమా సౌండ్‌ట్రాక్ కోసం ఏఆర్‌రెహమాన్‌తో పనిచేసే అవకాశం వచ్చింది. ఇది తనకు మెయిన్ స్ట్రీమ్ మ్యూజిక్ ఇండస్ట్రీలోకి లాంచ్‌ప్యాడ్‌గా ఉపయోగపడింది.

'ఆ సౌండ్‌ట్రాక్ అనేది నా కెరీర్‌లో మైలుస్టోన్ మాత్రమే కాదు ఇండియన్ మ్యూజిక్ ఇండస్ట్రీలో ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. యూఎస్, యూకే ఐట్యూన్ చార్ట్స్‌లో టాప్‌లో నిలిచింది. గతంలో ఏ ఆల్బమ్ ఇలాంటి ఘనతను సాధించలేదు. ఇదొక అద్భుతమైన, ఆనందకరమైన అనుభవం. మ్యూజిక్‌లో ఉండే పవర్ ఏమిటో తెలిసొచ్చింది. సంగీతం బాగుంటే సరిహద్దులు చెరిగిపోతాయి. అన్ని దేశాలు ఆ సంగీతాన్ని స్వంతం చేసుకుంటాయి' అంటుంది లేడీ కాష్.

● స్ఫూర్తి

యువర్స్

'సక్సెస్ కావాలంటే అజ్ఞానం కూడా ఉండాలి' అంటాడు 'ఫిజిక్స్‌వాలా' ఫేమ్ **అలక్ పాండే.** అతడి మాటల తాత్పర్యం 'నాకు అన్నీ తెలుసు అనుకున్నప్పుడు ఏమీ తెలుసుకోలేము. ఏమీ తెలియదు అనుకున్నప్పుడే అన్నీ తెలుసుకోవాలనే ఆసక్తి మొదలవుతుంది. అదే విజయానికి దారి చూపుతుంది'

ప్రయాగ్‌రాజ్‌లో ట్యూషన్‌లు చెప్పి కుటుంబానికి వేడి నీళ్లకు చన్నీళ్లలా సహకరించిన అలక్ పాండే ఈరోజు స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్. అతడి ఎడ్‌టెక్ స్టార్టప్ 'ఫిజిక్స్‌వాలా' శాఖోపశాఖలుగా విస్తరించి యూనికార్న్ క్లబ్‌లో చేరింది...

సక్సెస్‌వాలా స్టార్టింగ్‌స్టోరీ


● అలక్ పాండే

పాఠాలను పాఠాలుగా మాత్రమే బోధించాలని లేదు. వాటిని నిజజీవితంలోకి తీసుకువచ్చి, హాస్యం జోడించి చెబితే పాఠం అద్భుతంగా అర్థమవుతుంది. వినే కొద్దీ వినాలనిపిస్తుంది. 'ఫిక్షనుకు ఫ్రిక్షన్‌కు తేడా ఏమిటి?' నుంచి జటిలమైన భౌతికసూత్రాలను సులభంగా చెప్పడం వరకు అలక్ పాండే అద్భుతమైన నేర్పును సాధించాడు.

ఈ ఫస్ట్-జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ కొన్ని సంవత్సరాల క్రితం 'ఫిజిక్స్‌వాలా' పేరుతో ఫ్రీ యూట్యూబ్ చానల్‌కు శ్రీకారం చుట్టాడు. 'పెద్ద సక్సెస్ సాధించబోతున్నాను' అని ఆ సమయంలో అతను అనుకొని ఉండడు. అతడు అనుకున్నా, అనుకోకపోయినా 'ఇస్రో'వారి రాకెట్‌లా ఫిజిక్స్‌వాలా దూసుకుపోయింది.

31 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు, 61 యూట్యూబ్ చానల్స్, 5.3 బిలియన్ వ్యూస్!

'పోటీలో చాలామంది ఉన్నప్పుడు పోటీ నుంచి తప్పుకోవడమే మేలు' అనుకునే రకం కాదు అలక్.

'పోటీలో చాలా మంది ఉన్నప్పుడు మనదైన స్టైల్‌ను బయటికి తీయాలి' అని బలంగా నమ్ముతాడు. నిరంతరం ఆర్థిక ఇబ్బందులు పడే కుటుంబం నుంచి వచ్చిన అలక్ 'మాకు ప్రతి రూపాయి వందరూపాయలతో సమానంగా ఉండేది' అని గతాన్ని గుర్తు చేసుకుంటాడు.

అలక్ ఎడ్‌టెక్ ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు తనకు తాను వేసుకున్న ప్రశ్న 'స్టూడెంట్స్ ఏం నేర్చుకోవాలనుకుంటున్నారు?'

ఈ ప్రశ్నకు ఊహల్లో నుంచి సమాధానం తీసుకోకుండా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడాడు. వారు చెప్పిన ప్రతీదాన్ని నోట్ చేసుకొని లైవ్ ఆన్‌లైన్ కాసులలో అప్లై చేశాడు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కోచింగ్ సెంటర్‌ల ద్వారా బాగా డబ్బు గడించిన అలక్ పాండేకు 'ఫిజిక్స్‌వాలా' చానల్ ద్వారా వచ్చిన యాడ్ మనీ ఎనిమిది వేలు చాలా తక్కువ. అయితే ఇది 'శుభారంభం' అని మాత్రమే అనుకున్నాడు అలక్. అతడి నమ్మకం వృథా పోలేదు యాడ్ మనీ ఊహించని స్థాయిలో పెరుగుతూ పోయింది. కొన్నిసార్లు విద్యార్థులే ఉపాధ్యాయులై చక్కని సలహాలు ఇస్తారు.

కొత్తలో అలక్ ప్రచారంపై ఎక్కువ దృష్టి పెట్టాడు. ఎంత ఎక్కువగా పబ్లిసిటీ చేస్తే అంతగా సక్సెస్ అవుతాం అనుకునేవాడు. ఆ సమయంలో కొందరు విద్యార్థులు...

'యాడ్స్ మీద కాదు టీచింగ్ మీద దృష్టి పెట్టండి' అని చెప్పారు. ఇక అప్పటి నుంచి యాడ్స్‌పై కాకుండా టీచింగ్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టాడు. 'ఫిజిక్స్‌వాలా క్లాస్‌లలో చక్కగా అర్థమవుతుంది' అనే మౌత్‌టాక్ వచ్చేలా కృషి చేశాడు.

చాలామంది విజేతలలాగే అలక్ పాండేకు ఎదురయ్యే ప్రశ్న....

'మీ విజయ రహస్యం ఏమిటి?'

అది చెప్పడానికి అలక్ నోరు విప్పనక్కర్లేదు. నోయిడాలోని బహుళ అంతస్తుల భవనంలోని అతని ఆఫీసు గోడపై అతికించిన పోస్టర్‌లు చూస్తే చాలు. మచ్చుకు రెండు...

'సక్సెస్ సాధించాలని బలంగా అనుకుంటే ప్లాన్ బీ గురించిన ఆలోచనే రాదు'

'వేగంగా పరాజయం పాలైనా సరే, నిదానంగా గట్టి విజయం సాధించాలి'

● గేమింగ్

శత్రువును చిత్తు చేసే చిరుతలు



రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'బల్డూర్స్ గేట్-3' ఆగస్ట్ 3న విడుదల అవుతుంది. 'డంజెన్స్ అండ్ డ్రాగన్స్5' ఎడిషన్ రూల్‌సెట్ ఆధారంగా రూపొందిన గేమ్ ఇది. ఈ రోల్ ప్లేయింగ్ వీడియో గేమ్‌ను సింగిల్ ప్లేయర్, కోఆపరేటివ్ మల్టీప్లేయర్‌లలో ఆడవచ్చు. ప్లేయర్స్ క్యారెక్టర్స్‌ను క్రియేట్ చేయవచ్చు. బల్డూర్స్ గేట్ సిరీస్‌లోని గత గేమ్‌ల మాదిరిగా కాకుండా బల్డూర్స్ గేట్3 టర్న్-బేస్డ్ కంబాట్ గేమ్. మనిషిలో ఉండే రకరకాల భావోద్వేగాలు ఈ గేమ్‌లో కీలక పాత్ర పోషిస్తాయి. **జానర్స్:** రోల్-ప్లేయింగ్, **మోడ్స్:** సింగిల్-ప్లేయర్ మల్టీ ప్లేయర్ **ప్లాట్‌ఫామ్స్:** మ్యాక్‌వోఎస్/విండోస్/ప్లేస్టేషన్5/ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా

నా ఎనక దునియా ఉంది


● చిరంజీవి

చిరంజీవి టైటిల్ రోల్‌లో మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం 'భోళా శంకర్' ట్రైలర్‌ని హీరో రామ్‌చరణ్ రిలీజ్ చేశారు. 'హౌరా బ్రిడ్జి దగ్గర ఇంకో అమ్మాయి మిస్సింగ్ అంట సార్', 'పబ్లిక్‌కి ప్రాబ్లమ్ వస్తే పోలీసుల దగ్గరికి పోతారు.. గదే పోలీసులకు ప్రాబ్లమ్ వస్తే భోళా భాయ్ దగ్గరికి వస్తారు', 'నీ ఎనక మాఫియా ఉంటే నా ఎనక దునియా ఉంది బే' (చిరంజీవి)... వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. రామబ్రహ్మం సుంకర మాట్లాడుతూ– ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భోళా శంకర్' రూపొందింది. మాస్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ని కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు మెహర్ రమేష్. డడ్లీ సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. చక్కని సంగీతంతో సినిమాని నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లాడు మహతి స్వరసాగర్'' అన్నారు. కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.

సంకల్పం గట్టిదైతే సాధించవచ్చు

– విశ్వక్ సేన్


● అనూష, రాకేష్ వర్రే, విశ్వక్ సేన్

''పేక మేడలు' పోస్టర్స్, టీజర్ బాగున్నాయి. రాకేష్ నటిస్తూనే నిర్మాతగా మారడం హ్యాపీగా ఉంది. మన సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు. 'పేక మేడలు' మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పేక మేడలు'. రాకేష్ వర్రే నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''వినోద్ కిషన్ కళ్లతో నటిస్తాడు. నేను చేస్తున్న ఓ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇక నాలాంటి వాళ్లు చిన్న హీరో అయినా చేస్తున్న పనిలో బిజీతో కొన్ని సందర్భాల్లో ఎవరికీ టైమ్ ఇవ్వలేం.. కథలు వినలేం. ఇటీవల విడుదలైన ఓ హిట్ చిత్రం నేను చేయాల్సింది.. కానీ కుదరలేదు. మన సినిమా బాగుంటే తల ఎత్తుకునేలా ఉండాలి.. కానీ, ఎవరినో కించపరచకూడదు'' అన్నారు. ''హైదరాబాద్‌లో ఓ బస్తీలో సాగే కథ ఇది'' అన్నారు రాకేశ్ వర్రే. ''ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎదురయ్యే కథే 'పేక మేడలు'' అన్నారు నీలగిరి మామిళ్ల. ఈ చిత్రానికి సహనిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, కెమెరా: హరిచరణ్ .కె, సంగీతం: స్మరణ్.

ఆస్కార్ మ్యూజియమ్‌లో...


● కమల్‌హాసన్, ఏఆర్ రెహమాన్

లాస్ ఏంజిల్స్‌లోని ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించారు నటుడు-దర్శక-నిర్మాత కమల్ హాసన్, సంగీత దర్శకుడు-గాయకుడు-నిర్మాత ఏఆర్ రెహమాన్. ఆ మ్యూజియమ్‌లోనే హాలీవుడ్ ఫేమస్ ఫిల్మ్ 'ది గాడ్‌ఫాదర్' (1972) సినిమాను వీక్షించారు కమల్, రెహమాన్. 81వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' (2008) సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో ఏఆర్ రెహమాన్ ఆస్కార్ అవార్డ్స్‌ను సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది. నాటి విశేషాలను కూడా కమల్‌తో కలిసి ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ గుర్తు చేసుకున్నారు. అలాగే కమల్‌తో కలిసి ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించిన ఫొటోలను రెహమాన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభాస్ హీరోగా, కమల్‌హాసన్ కీలక పాత్రలో నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమా గ్లింప్స్ వీడియో లాంచ్ ఇటీవల అమెరికాలో జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుక కోసం అమెరికా వెళ్లిన కమల్‌హాసన్ ఇంకా అక్కడే ఉన్నారు. ఈ క్రమంలోనే తన సినిమాలకు మేకప్ ఆర్టిస్ట్‌గా చేసిన మైఖేల్ వెస్ట్‌మోర్‌ను కలిసిన కమల్‌హాసన్ తాజాగా ఏఆర్ రెహమాన్‌తో కలిసి ఆస్కార్ మ్యూజియమ్‌ని సందర్శించారు. ఇండియాకు తిరిగొచ్చిన తర్వాత మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించాల్సిన సినిమా షూటింగ్‌లో కమల్ పాల్గొంటారని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడు.


● మృణాల్ ఠాకూర్

రవితేజకు జోడీగా...

'సీతారామం'తో బ్లాక్‌బస్టర్ హీరోయిన్‌గా ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాల్లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ బ్యూటీకి మరో ఆఫర్ వచ్చిందట. 'డాన్ శీను', 'బలుపు', 'క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ముందు పూజా హెగ్డే పేరు వినిపించగా, తాజాగా మృణాళ్ ఠాకూర్ పేరు తెరపైకి వచ్చింది. మరి.. రవితేజ సరసన హీరోయిన్‌గా పూజా హెగ్డే కనిపిస్తారా? లేక రవితేజతో మృణాల్ జోడీ కడతారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు.

నాలుగు గెటప్స్‌లో వరుణ్ జూదం


● విజయేందర్ రెడ్డి, మీనాక్షి, వరుణ్ తేజ్, సీవీ మోహన్, కరుణ కుమార్

వరుణ్ తేజ్, మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహి హీరో హీరోయిన్లుగా కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'మట్కా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. తొలి సీన్‌కి దర్శకుడు మారుతి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత 'దిల్' రాజు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు సురేష్‌బాబు, విజయేందర్ రెడ్డి, సీవీఎం కలిసి దర్శకుడు కరుణ కుమార్‌కు స్క్రిప్ట్ అందించగా, దర్శకుడు హరీష్ శంకర్ టైటిల్ పోస్టర్ లాంచ్ చేశారు. ''వరుణ్‌కు 'మట్కా' తొలి పాన్ ఇండియన్ మూవీ. 'మట్కా' అంటే ఒక రకమైన జూదం. 1958–1982 మధ్య కాలంలో దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా వైజాగ్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. వరుణ్ తేజ్ నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారు. నాటి వైజాగ్‌ను తలపించేలా ప్రొడక్షన్ డిజైనర్ ఆశిష్ తేజ, ఆర్ట్ డైరెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వింటేజ్ సెట్ వర్క్ జరుగుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: ప్రియా సేత్.


రీల్స్

సరికొత్తగా...


● ధనుష్, శేఖర్ కమ్ముల

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా 'డీ 51' (వర్కింగ్ టైటిల్) తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీర్వాదంతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించనున్నారు. కాగా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నారాయణ్ దాస్ కె. నారంగ్ జయంతి సందర్భంగా గురువారం 'డీ 51' చిత్రం అప్‌డేట్ ఇచ్చారు. ''డీ 51'లో ఇంతకు ముందెన్నడూ చూడని సరికొత్త పాత్రలో ధనుష్‌ని చూపించే పర్ఫెక్ట్ కథను శేఖర్ కమ్ముల సిద్ధం చేశారు'' అన్నారు నిర్మాతలు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందనున్న ఈ సినిమాకి సమర్పణ: సోనాలీ నారంగ్.

అదే నా ఆస్తి – బ్రహ్మాజీ



''మా అబ్బాయి సంజయ్ నటించిన 'స్లమ్ డాగ్ హజ్బెండ్' ప్రమోషన్‌కి నాగార్జున, అలీ, అనిల్ రావిపూడి.. ఇలా అందరూ సపోర్ట్ చేశారు. ఇలా అందరి ప్రేమను సంపాదించడమే నా ఆస్తిగా భావిస్తున్నా'' అని నటుడు బ్రహ్మాజీ అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ రేపు రిలీజ్ చేస్తోంది. ''ఈ చిత్రంలో విడాకుల స్పెషలిస్ట్ లాయర్‌గా కనిపిస్తాను'' అన్నారు బ్రహ్మాజీ.

యాక్షన్ థ్రిల్లర్ ఆరంభం


● సందీప్ మాధవ్, కేథరిన్

సందీప్ మాధవ్, కేథరిన్ థెరిస్సా జంటగా నూతన చిత్రం షురూ అయింది. సోమా విజయప్రకాష్ సమర్పణలో దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. అశోక్ తేజ దర్శకుడు. తొలి సీన్‌కి నిర్మాత సి. కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు సంపత్ నంది క్లాప్ ఇచ్చారు. నిర్మాతలు ప్రసన్నకుమార్, పి. కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''పోలీస్ పాత్రలో నటించాలన్న నా ఆశ ఈ సినిమాతో నేరవేరింది'' అన్నారు సందీప్ మాధవ్. ''స్క్రీన్ ప్లే బేస్డ్ సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది'' అన్నారు అశోక్ తేజ. ''సినిమా పూర్తయ్యేవరకూ కంటిన్యూ షెడ్యూల్ జరుపుతాం'' అన్నారు పల్లి కేశవరావు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాతలు: రొంగల శివశంకర్, గౌటి హరినాథ్.

ఎమోషనల్ వృషభ


● జీవన్, అలేఖ్య

జీవన్, అలేఖ్య జంటగా నటిస్తున్న చిత్రం 'వృషభ'. అశ్విన్ కామరాజ్ కొప్పల దర్శకత్వంలో యుజికెస్ ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో ఉమాశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ''ఈ చిత్రంలో మంచి ఎమోషన్ ఉన్నట్లనిపిస్తోంది'' అని ఫస్ట్ లుక్, ట్రైలర్ లాంచ్ వేడుకలో పాల్గొన్న నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. ''1966–1990 నేపథ్యంలో జరిగే కథ ఇది. ఆధ్యాత్మికంగా వెళుతూనే మనుషులకు, పశువులకు మధ్య ఉండే బాండింగ్‌ని చూపించాం'' అన్నారు అశ్విన్. ''ఓ పల్లెలోని చిన్న గుడిలో ఈ కథ నా మదిలో మెదిలింది'' అన్నారు ఉమాశంకర్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
28-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	440	66,267
నిఫ్టీ ▽	118	19,660

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,195	△	70
డోజోన్స్	35,495	▽	25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,693	△	16
డాక్స్	16,406	△	275
షాంఘై	3,217	▽	6
నికాయ్	32,891	△	223

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (24 క్యారట్)	59,741	▽	49
బంగారం (22 క్యారట్)	59,502	▽	49
వెండి (కిలో)	75,426	▽	906

సతియాలో మారికో పెట్టుబడి

డీల్ విలువ రూ.369 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ మారికో తాజాగా సతియా న్యూట్రాస్యూటికల్స్‌లో 58 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. 32.75 శాతం వాటా జూలై 26 నాటికే చేజిక్కించుకున్నామని, మిగిలిన వాటా 2025 మే నాటికి కైవసం అవుతుందని కంపెనీ తెలిపింది. డీల్ విలువ రూ.369 కోట్లు. మొక్కల ఆధారిత పోషణ ఉత్పత్తుల బ్రాండ్ ప్లిక్స్‌ను సతియా న్యూట్రాస్యూటికల్స్ ప్రమోట్ చేస్తోంది. విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు, పోషకాహార విభాగాలలో విస్తరణకు ఈ డీల్ దోహదం చేస్తుందని మారికో తెలిపింది. అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆరోగ్యం, వెల్నెస్ విభాగాలలో ఉనికిని పెంచుతుందని వివరించింది. 'విభిన్న విభాగాల్లో మా ప్రయాణాన్ని వేగవంతం చేసే వ్యూహానికి అనుగుణంగా ప్లిక్స్‌లో పెట్టుబడి విలువ ఆధారిత వెల్నెస్ ఫుడ్స్, న్యూట్రిషన్ సెగ్మెంట్లలో లక్షిత మార్కెట్‌ను విస్తరించడమే కాకుండా.. విభిన్న విలువ ప్రతిపాదనతో మరో డిజిటల్ ఫస్ట్ బ్రాండ్‌ను మా ఖాతాలోకి తీసుకువస్తుంది' అని మారికో ఎండీ, సీఈవో సౌగత గుప్తా ఈ సందర్భంగా తెలిపారు.

భారత్ బయోటెక్‌తో ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ జట్టు

ముంబై: దుస్తుల తయారీ సంస్థ ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ గ్లోబల్ క్లోతింగ్‌లో భారత్ బయోటెక్ గ్రూప్‌నకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ విభాగం 20 శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ పెట్టుబడుల ద్వారా వచ్చిన నిధులను మూలధనం, వ్యాపార విస్తరణ తదితర అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్ ఎన్ చంద్రన్ తెలిపారు. ఇప్పటికే తమకు అమెరికాలో కార్యాలయం ఉందని, బ్రిటన్‌లోనూ త్వరలోనే ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఇతరత్రా మార్కెట్లలోనూ ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్నట్లు చెప్పారు. మేకిన్ ఇండియా వ్యూహానికి అనుగుణంగా వివిధ పరిశ్రమలకు తోడ్పాటు అందించే లక్ష్యంతో ముందుకెడుతున్నట్లు భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా తెలిపారు. 10 వేల మంది పైచిలుకు మహిళలకు ఉపాధి అవకాశాలు అందించాలనే తమ లక్ష్య సాధనకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడగలదని పేర్కొన్నారు.

చైనాకు 30 ఏళ్లు పట్టింది .. మనకు పదేళ్లే

- సెమీకండక్టర్లలో కీలకంగా ఎదుగుతాం
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ధీమా



న్యూఢిల్లీ: వచ్చే దశాబ్ద వ్యవధిలో అంతర్జాతీయ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదిగే దిశగా భారత్ ముందుకు పురోగమిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆ స్థాయికి చేరుకునేందుకు చైనాకు 25–30 సంవత్సరాలు పట్టిందని ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఫోన్స్ నుంచి కార్ల వరకూ అన్నింటా ఉపయోగించే చిప్‌ల తయారీని దేశీయంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన 10 బిలియన్ డాలర్ల ప్రోత్సాహకాలు భారత్ పురోగమనానికి దోహదపడగలవని ఆయన పేర్కొన్నారు. 'ఈ 10 బిలియన్ డాలర్ల తోడ్పాటుతో వచ్చే 10 ఏళ్లలో సెమీకండక్టర్ల విభాగంలో కీలకంగా ఎదిగే దిశగా భారత్ ముందుకు వెడుతోంది. దీనికోసం చైనా వంటి దేశాలకు 25–30 ఏళ్లు పట్టేసింది. అయినా అవి ఇంకా పూర్తిగా సఫలం కాలేదు 'అని మంత్రి చెప్పారు. మెమరీ సొల్యూషన్స్ దిగ్గజం మైక్రాన్ తలపెట్టిన ఏటీఎంపీ ప్రాజెక్టుతో సెమీకండక్టర్ల పరిశ్రమలో ప్రత్యక్షంగా 5,000, పరోక్షంగా 15,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని చెప్పారు. ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) స్కీముతో .. వేదాంత, ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజాలు ఇక్కడ చిప్స్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చాయని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఈ లాభం రూ. 1,844 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,844 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే లాభం 9 శాతం పెరిగింది. అటు ఆదాయం 13 శాతం పెరిగి రూ. 2,987 కోట్లకు చేరింది. ట్రేడింగ్ సంబంధ కార్యకలాపాలతో పాటు లిస్టింగ్, ఇండెక్స్ సర్వీసులు, డేటా సర్వీసులు మొదలైన వాటి ద్వారా ఆదాయం మెరుగుపడిందని సంస్థ తెలిపింది. వచ్చే కొన్నేళ్లలో కోర్ సెటిల్మెంట్ గ్యారంటీ కార్పస్‌ను ప్రస్తుత రూ. 5,000 కోట్ల నుంచి రూ. 10,000 కోట్లకు దశలవారీగా పెంచుకునే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది.



లాభాలు ఒకరోజుకే పరిమితం

- ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా అప్రమత్తత
- బ్యాంకింగ్, ఇంధన, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ
- మళ్లీ 19,700 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 440 పాయింట్లు



ముంబై: దేశీయ స్టాక్ సూచీల లాభాలు ఒకరోజుకే పరిమితమయ్యాయి. జూలై ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడంతో బ్యాంకింగ్, ఇంధన, ఆటో షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు., అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎంఅండ్ఎం, నెస్లే, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల పతనం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 127 పాయింట్ల లాభంతో 66,629 వద్ద, నిఫ్టీ 73 పాయింట్లు పెరిగి 19,851 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. దేశీయంగా నెలకొన్న ప్రతికూల సంకేతాలతో సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 646 పాయింట్లు క్షీణించి 66,326 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు పతనమై 19,604 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖర్లో కొంత కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాల కొంత భర్తీ అయ్యాయి. చివరికి సెన్సెక్స్ 440 పాయింట్లు నష్టపోయి 66,267 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118 పాయింట్లు కోల్పోయి 19,660 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లో ఫార్మా, రియల్టీ, టెలికాం, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,979 కోట్ల షేర్లు విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,528 కోట్ల షేర్లను కొన్నారు. ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- దేశీయంగా సర్వర్లు తయారు చేసే నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా బంపర్ లిస్టింగ్ సాధించింది. బీఎస్ఈ ఇష్యూ ధర (రూ.500)తో పోలిస్తే 82.40% భారీ ప్రీమియంతో రూ.942.50 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 91% ర్యాలీ చేసి రూ. 942.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 82.10% లాభంతో రూ.910.50 వద్ద స్థిరపడింది.
- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 21% వృద్ధి సాధించడంతో ఆర్ఈసీ లిమిటెడ్ షేరు 7% పెరిగి రూ. 186 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో తొమ్మిదిశాతం ర్యాలీ చేసి రూ.189 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- తొలి త్రైమాసిక ఫలితాలు మెప్పించలేకపోవడంతో టెక్ మహీంద్రా షేరు నాలుగుశాతం నష్టపోయి రూ.1,100 వద్ద ముగిసింది.

నేడు రిటైలర్లకు రైల్ వికాస్ ఓఎఫ్ఎస్

రైల్వే రంగ ప్రభుత్వ కంపెనీ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు తొలి రోజు భారీ డిమాండ్ కనిపించింది. ప్రభుత్వం 6.38 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. సంస్థాగత కొనుగోలుదారుల నుంచి 17.44 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి ఆఫర్ 2.73 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. వీటికి సంకేత ధర రూ. 121.17కాగా.. వీటి విలువ రూ. 2,100 కోట్లు. ఆఫర్ నేడు(శుక్రవారం) రిటైల్ ఇన్వెస్టర్లకు ఓపెన్ కానుంది. ఆఫర్‌కు ప్రభుత్వం రూ. 119 ఫ్లోర్ ధరను నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆఫర్‌లో భాగంగా ప్రభుత్వం మొత్తం 11.17 కోట్ల షేర్లు(5.36 శాతం వాటా)ను విక్రయించనుంది. దీనిలో డిమాండునుబట్టి 1.96 శాతం వాటాకు సమానమైన 4.08 కోట్ల షేర్లను విక్రయించే గ్రీన్ షూ ఆప్షన్ కలసి ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రభుత్వానికి 78.2 శాతం వాటా ఉంది.

ఓఎఫ్ఎస్ నేపథ్యంలో ఆర్‌వీఎన్ఎల్ షేరు 6 శాతం పతనమై రూ. 126 వద్ద ముగిసింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ లాభం జూమ్

క్యూ1లో రూ. 1,943 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం ఎగసి రూ. 1,943 కోట్లను తాకింది. మార్జిన్లు, ఆస్తులు(రుణాలు) మెరుగుపడటం ఇందుకు సహకరించింది. డైవర్సిఫైడ్ దిగ్గజం బజాజ్ గ్రూప్‌నకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్‌లకు హోల్డింగ్ కంపెనీ ఇది. గ్రూప్‌లోని మరో దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ లాభాలు పుంజుకోవడం కంపెనీకి బలాన్నిచ్చింది. సాధారణ బీమా విభాగం బజాజ్ అలయెంజ్ నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 415 కోట్లుగా నమోదైనట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ పేర్కొంది. బజాజ్ అలయెంజ్ లైఫ్ రూ. 4,058 కోట్ల స్థూల రిటెన్ ప్రీమియం అందుకోగా.. పన్ను తదుపరి లాభం 25 శాతం వృద్ధితో రూ. 155 కోట్లకు చేరింది. కాగా.. క్యూ1లో బజాజ్ ఫిన్‌సర్వ్ మొత్తం ఆదాయం 47 శాతం జంప్‌చేసి రూ. 23,280 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్ షేరు 1 శాతం నీరసించి రూ. 1,612 వద్ద ముగిసింది.

ఇండియన్ బ్యాంక్ లాభం అప్

క్యూ1లో రూ. 1,709 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం 41 శాతం ఎగసి రూ. 1,709 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,213 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇందుకు ప్రధానంగా మొండి రుణాలు తగ్గడం దోహదపడింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,758 కోట్ల నుంచి రూ. 14,759 కోట్లకు జంప్‌చేసింది. వడ్డీ ఆదాయం రూ. 10,153 కోట్ల నుంచి రూ. 13,049 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 8.13 నుంచి 5.47 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.12 శాతం నుంచి 0.7 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.78 శాతానికి చేరింది. మొండిరుణాలకు కేటాయింపులు రూ. 2,002 కోట్ల నుంచి రూ. 930 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ షేరు యథాతథంగా రూ. 328 వద్ద ముగిసింది.

కోరమాండల్ లాభం రూ.494 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.499 కోట్ల నుంచి రూ.494 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవర్ రూ.5,783 కోట్ల నుంచి రూ.5,738 కోట్లకు పడిపోయింది. పోషకాలు, అనుబంధ వ్యాపారం ఆదాయం రూ.5,111 కోట్ల నుంచి రూ.5,192 కోట్లకు ఎగసింది. సస్యరక్షణ ఉత్పత్తుల వ్యాపారం రూ.654 కోట్ల నుంచి రూ.556 కోట్లుగా ఉంది. విభిన్న ఉత్పత్తుల తయారీ కోసం గుజరాత్‌లోని దహేజ్ వద్ద 50 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన భారీ ప్లాంటు కోసం సన్నాహక పనులను ప్రారంభించినట్టు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కోరమాండల్ షేరు ధర 1.05 శాతం ఎగసి రూ.1,003 వద్ద స్థిరపడింది.

లారస్ లాభం 90 శాతం డౌన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ లారస్ ల్యాబ్స్ జూన్ త్రైమాసికం ఫలితాల్లో అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం 90 శాతం క్షీణించి రూ.25 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 63 శాతం తగ్గి రూ.168 కోట్లకు పడిపోయింది. ఎబిటా మార్జిన్ 14.2 శాతంగా ఉంది. టర్నోవర్ 23 శాతం తగ్గి రూ.1,182 కోట్లుగా ఉంది. ఆదాయంలో పరిశోధన, అభివృద్ధికి 4 శాతం, మూలధన వ్యయానికి 17% వెచ్చించినట్టు కంపెనీ తెలిపింది. ఏపీఐ, ఎఫ్‌డీఎఫ్ వ్యాపారం రెండింటిలోనూ తాత్కాలిక డిమాండ్ బలహీనత కారణంగా పనితీరు ప్రభావితమైందని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో లారస్ షేరు ధర 0.72% లాభపడి రూ.343.80 వద్ద స్థిరపడింది.



క్వార్టర్ ఫైనల్లో అంకిత జోడీ

వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో అంకిత రైనా (భారత్)-యు యువాన్ (చైనా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పోలాండ్‌లో గురువారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అంకిత-యు యువాన్ ద్వయం 7-6 (7/2), 7-5తో మజా చాల్వీన్‌స్కా (పోలాండ్)-జెస్సికా పోంచెట్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత జోడీ తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

సిరీస్ నుంచి తప్పుకున్న సిరాజ్

భారత పేస్ బౌలర్ సిరాజ్‌కు వెస్టిండీస్ వన్డే సిరీస్‌నుంచి విశ్రాంతి లభించింది. కాలి మడమకు స్వల్ప నొప్పి ఉండటంతో ముందు జాగ్రత్తగా బరిలోకి దిగకపోవడం మంచిదని బీసీసీఐ వైద్యులు సూచించారు. దాంతో అతను స్వదేశం పయనమయ్యాడు. వన్డేల తర్వాత జరిగే టి20 సిరీస్‌లో అతడిని ఎంపిక చేయలేదు.

ప్రణయ్, లక్ష్య సేన్ ముందంజ

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ


ప్రణయ్


లక్ష్య సేన్

టోక్యో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్లు ప్రణయ్, లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రణయ్ 19–21, 21–19, 21–9తో భారత్‌కే చెందిన కిడాంబి శ్రీకాంత్‌ను ఓడించగా... లక్ష్య సేన్ 21–14, 21–16తో కాంటా సునెయామ (జపాన్)పై గెలుపొందాడు. డబుల్స్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకోగా... పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం ఇంటిదారి పట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21–17, 21–11తో లాసీ మొల్డె-జెపీ బే (డెన్మార్క్) జోడీని ఓడించగా... గాయత్రి-ట్రీసా జాలీ జంట 21–23, 19–21తో చిరారు షిదా-నామి మత్సుయామ (జపాన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో ప్రణయ్; కొకి వతనాబె (జపాన్)తో లక్ష్య సేన్; లీ యాంగ్-వాంగ్ చిలిన్ (చైనీస్ తైపీ)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు.

పాకిస్తాన్ క్లీన్‌స్వీప్

లంకపై రెండో టెస్టులో ఇన్నింగ్స్ 222 పరుగులతో జయభేరి


నోమన్ అలీ

కొలంబో: శ్రీలంక పర్యటనలో పాకిస్తాన్ రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం ముగిసిన ఆఖరి టెస్టులో పాక్ ఇన్నింగ్స్ 222 పరుగుల తేడాతో ఆతిథ్య లంకపై గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 563/5తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాక్ 134 ఓవర్లలో 576/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రిజ్వాన్ (50 నాటౌట్; 4 ఫోర్లు, 1సిక్స్) అర్ధసెంచరీ పూర్తికాగానే డిక్లేర్ చేసింది. ఆగా సల్మాన్ (132 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. దీంతో పాకిస్తాన్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 67.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. ఏంజెలో మాథ్యూస్ (63 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ కరుణరత్నే (41; 6 ఫోర్లు) రాణించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ నోమన్ అలీ (7/70) చావుదెబ్బ తీశాడు. నసీమ్ షాకు 3 వికెట్లు దక్కాయి. ఈ సిరీస్ గెలుపుతో పాక్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో 24 పాయింట్లు, 100 శాతం విజయాలతో అగ్రస్థానానికి వచ్చింది.

భారత్‌ను ఆదుకున్న నవ్‌నీత్



బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మూడు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నీలో భారత మహిళల జట్టు వరుసగా రెండో 'డ్రా' నమోదు చేసింది. ఆతిథ్య స్పెయిన్ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌ను భారత జట్టు 2–2 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (14వ, 29వ ని.లో) రెండు గోల్స్ చేసి జట్టును ఆదుకుంది. స్పెయిన్ తరఫున జంటాల్ జిని (13వ ని.లో), లయా విదోసా (26వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

టి20 ప్రపంచకప్‌కు ఐర్లాండ్

ఎడిన్‌బర్గ్: వచ్చే ఏడాది వెస్టిండీస్-అమెరికాలో జరిగే టి20 ప్రపంచకప్‌కు ఐర్లాండ్ అర్హత సంపాదించింది. గురువారం జర్మనీతో జరగాల్సిన క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్ వర్షంతో రద్దు కావడంతో ఐర్లాండ్‌కు బెర్త్ లభించింది. ఇదివరకే అర్హత సాధించిన స్కాట్లాండ్‌తో నేడు ఐర్లాండ్ తలపడుతుంది. యూరోపియన్ రీజినల్ నుంచి రెండు బెర్త్‌లు ఉండగా... స్కాట్లాండ్, ఐర్లాండ్, ఇటలీ, జర్మనీ, జెర్సీ, డెన్మార్క్, ఆస్ట్రియా ఈ 7 దేశాలు క్వాలిఫయర్స్‌లో తలపడ్డాయి. ఆడిన ఐదు మ్యాచ్‌లు గెలిచిన స్కాట్లాండ్ (10 పాయింట్లు) అగ్రస్థానంలో నిలువగా, ఐర్లాండ్ (8 పాయింట్లు) నాలుగు విజయాలతో రెండో జట్టుగా అర్హత సాధించింది.

సులువైన లక్ష్యాన్ని కష్టంగా...

వన్డే వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదని వెస్టిండీస్ నిరూపించింది. 'అంచనాలకు తగినట్లుగా' సాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కూడా కనబర్చలేక టీమ్ కుప్పకూలింది. టి20 మ్యాచ్‌కు మించి ఆడటం తమ వల్ల కాదన్నట్లుగా 23 ఓవర్లకే ఇన్నింగ్స్ ముగించింది. మొదటి మూడు వికెట్లు తీసి పేసర్లు శుభారంభం చేస్తే తర్వాతి 7 వికెట్లతో స్పిన్నర్లు కుల్దీప్, జడేజా పండుగ చేసుకున్నారు. అయితే టీమిండియాకు విజయం సులువుగా దక్కలేదు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐదు వికెట్లు కోల్పోయి చివరకు గెలుపు సొంతం చేసుకుంది. రోహిత్, కోహ్లి తమ స్థానాల్లో ఆడకుండా ఇతర బ్యాటర్లను ముందుగా పంపగా... అది ఆశించిన ఫలితం ఇవ్వలేదు.


కుల్దీప్

- తొలి వన్డేలో భారత్ విజయం
- 5 వికెట్లతో ఓడిన వెస్టిండీస్
- ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ
- జడేజా, కుల్దీప్ మాయాజాలం


రోహిత్
జడేజా

2 విండీస్‌కు భారత్‌పై వన్డేల్లో ఇది రెండో అత్యల్ప స్కోరు. 2018లో 104 పరుగులకు ఆలౌటైంది. ఆలౌట్ అయిన సందర్భాల్లో ఎదుర్కొన్న బంతులపరంగా కూడా విండీస్‌కు ఇది రెండో చెత్త ప్రదర్శన. 2011లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో 22 ఓవర్లకే ఆ జట్టు కుప్పకూలింది.

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్‌పై టెస్టు సిరీస్‌ను అలవోకగా గెలుచుకున్న భారత జట్టు వన్డేల్లోనూ తమ స్థాయిని ప్రదర్శించింది. గురువారం ఏకపక్షంగా సాగిన తొలి వన్డేలో భారత్ ఐదు వికెట్ల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 23 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ షై హోప్ (45 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్ 6 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 22.5 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం ఇదే మైదానంలో జరుగుతుంది.

టపటపా...

వన్డేల్లో తమ జట్టు బలహీనతను మరోసారి ప్రదర్శిస్తూ వెస్టిండీస్ కుప్పకూలింది. కెప్టెన్ హోప్ కొంత పోరాడగలిగినా... మిగతావారంతా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. హార్దిక్ తన రెండో ఓవర్లోనే కైల్ మేయర్స్ (2)ను అవుట్ చేసి భారత్‌కు సరైన ఆరంభం అందించాడు. హార్దిక్ ఓవర్లో వరుస బంతుల్లో సిక్స్, ఫోర్... శార్దుల్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టి అలిక్ అతనజ్ (18 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు ప్రదర్శించే ప్రయత్నం చేసినా అది ఎక్కువ సేపు సాగలేదు. జడేజా చక్కటి క్యాచ్‌తో అతను వెనుదిరిగాడు. ముకేశ్‌కు ఇది తొలి వికెట్ కావడం విశేషం. మరో మూడో బంతులకే బ్రెండన్ కింగ్ (17)ను శార్దుల్ అవుట్ చేయడంతో స్కోరు 45/3కి చేరింది. ఈ దశలో హోప్ కొన్ని చక్కటి షాట్లతో కాస్త పట్టుదల కనబర్చాడు. అయితే మరో ఎండ్‌లో 8 పరుగుల వ్యవధిలో హెట్‌మైర్ (11), రావ్‌మన్ పావెల్ (4), షెఫర్డ్ (0) వెనుదిరగడంతో విండీస్ కోలుకోలేకపోయింది. తర్వాతి నాలుగు వికెట్లూ కుల్దీప్ ఖాతాలోకే వెళ్లాయి. తన తొలి, రెండో ఓవర్లో ఒక్కో వికెట్ తీసిన అతను మూడో ఓవర్లో మరో రెండు వికెట్లతో ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. వెస్టిండీస్ తరఫున 1972–79 మధ్య 12 టెస్టులు ఆడి 29 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ రఫీక్ జుమాదిన్ గురువారం మరణించడంతో సంతాప సూచకంగా విండీస్ ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

తడబడినా...

ఛేదనలో భారత్ ఇన్నింగ్స్ అలవోకగా సాగలేదు. రోహిత్ శర్మ కాకుండా కిషన్, గిల్ (7) ఓపెనర్లుగా బరిలోకి దిగారు. గిల్ విఫలం కాగా, మూడో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ (19) కూడా అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. ప్రమోట్ అయిన హార్దిక్ పాండ్యా (5) రనౌట్ కాగా, మరో ఎండ్‌లో ఇషాన్ మాత్రం నిలకడగా ఆడుతూ 44 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ వెంటనే ఇషాన్‌తో పాటు శార్దుల్ (1) వెనుదిరగడంతో రోహిత్ (12 నాటౌట్) క్రీజ్‌లోకి రాక తప్పలేదు. ఆపై మరో వికెట్ పడకుండా జడేజా (16 నాటౌట్)తో రోహిత్ మ్యాచ్‌ను ముగించడంతో కోహ్లి బ్యాటింగ్‌కు రావాల్సిన అవసరం లేకపోయింది.

ముకేశ్ @ 251

వెస్టిండీస్‌తో రెండో టెస్టుతో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన పేస్ బౌలర్ ముకేశ్ కుమార్‌కు ఇదే టూర్‌లో వన్డే అవకాశం కూడా దక్కింది. గురువారం మ్యాచ్‌తో అతను వన్డేల్లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున వన్డేలు ఆడిన 251వ ఆటగాడిగా ముకేశ్ నిలిచాడు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (బి) శార్దుల్ 17; మేయర్స్ (సి) రోహిత్ (బి) హార్దిక్ 2; అతనజ్ (సి) జడేజా (బి) ముకేశ్ 22; హోప్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 43; హెట్‌మైర్ (బి) జడేజా 11; పావెల్ (సి) గిల్ (బి) జడేజా 4; షెఫర్డ్ (సి) కోహ్లి (బి) జడేజా 0; డ్రేక్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 3; కారియా (ఎల్బీ) (బి) కుల్దీప్ 3; మోతీ (నాటౌట్) 0; సీల్స్ (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (23 ఓవర్లలో ఆలౌట్) 114. వికెట్ల పతనం:** 1-7, 2-45, 3-45, 4-88, 5-96, 6-96, 7-99, 8-107, 9-114, 10-114. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 3-0-17-1, ముకేశ్ 5-1-22-1, శార్దుల్ 3-1-14-1, జడేజా 6-0-37-3, ఉమ్రాన్ 3-0-17-0, కుల్దీప్ యాదవ్ 3-2-6-4.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) పావెల్ (బి) మోతీ 52; గిల్ (సి) కింగ్ (బి) సీల్స్ 7; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) మోతీ 19; హార్దిక్ (రనౌట్) 5; జడేజా (నాటౌట్) 16; శార్దుల్ (సి) అతనజ్ (బి) కారియా 1; రోహిత్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (22.5 ఓవర్లలో 5 వికెట్లకు) 118. వికెట్ల పతనం:** 1-18, 2-54, 3-70, 4-94, 5-97. **బౌలింగ్:** డ్రేక్స్ 4-0-19-0, సీల్స్ 4-0-21-1, మేయర్స్ 1-0-6-0, షెఫర్డ్ 1-0-2-0, మోతీ 6.5-0- 26-2, కారియా 5-0-35-1, అతనజ్ 1-0-7-0.

ఇంగ్లండ్ 283 ఆలౌట్


బ్రూక్

లండన్: ఆస్ట్రేలియాతో గురువారం మొదలైన యాషెస్ సిరీస్ చివరిదైన ఐదో టెస్టును ఇంగ్లండ్ అదే దూకుడుతో ప్రారంభించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలిఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 283 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇంగ్లండ్ ఓపెనర్లు డకెట్ (41; 3 ఫోర్లు), జాక్ క్రాలీ (22; 3 ఫోర్లు) 12 ఓవర్లలో 62 పరుగులు జోడించారు. అయితే అదే స్కోరుపై డకెట్, కాసేపటికి క్రాలీ, రూట్ (5) వికెట్లను కోల్పోయి 73/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో మొయిన్ అలీ (34; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), హ్యారీ బ్రూక్ (91 బంతుల్లో 85; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు)ల భాగస్వామ్యం ఇంగ్లండ్‌ను నిలబెట్టింది. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 111 పరుగులు జతచేశారు. తర్వాత స్టార్క్ (4/82) ధాటికి కీలక వికెట్లను కోల్పోయి ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోయి 61 పరుగులు చేసింది.

ఆసియా క్రీడల ఫుట్‌బాల్ 'డ్రా' విడుదల

గ్రూప్ 'ఎ'లో భారత పురుషుల జట్టు

హాంగ్జౌ (చైనా): త్వరలో చైనా ఆతిథ్యమిచ్చే ప్రతిష్టాత్మక ఆసియా క్రీడలకు సంబంధించిన ఫుట్‌బాల్ 'డ్రా'ను గురువారం విడుదల చేశారు. ఇందులో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత పురుషుల జట్టు గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో చైనా, బంగ్లాదేశ్, మయన్మార్ జట్లున్నాయి. మొత్తం 24 జట్లను ఆరు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్ నుంచి రెండేసి జట్లు తదుపరి నాకౌట్ దశ ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. అలాగే ఈ ఆరు గ్రూపుల్లో కలిపి మూడో స్థానంలో ఉన్న మెరుగైన నాలుగు జట్లు కూడా ప్రిక్వార్టర్స్ చేరతాయి. భారత మహిళల జట్టు గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్, చైనీస్ తైపీలతో పోటీపడనుంది. ఈ విభాగంలో 17 జట్లు బరిలో ఉండగా... ఎ, బి, సి గ్రూపుల్లో మూడు జట్ల చొప్పున... డి, ఇ గ్రూపుల్లో నాలుగేసి జట్లు పోటీపడతాయి. ఆసియా క్రీడలకు సెప్టెంబర్ 23న తెర లేవనుండగా... ఫుట్‌బాల్ మ్యాచ్‌లు మాత్రం సెప్టెంబర్ 19 నుంచి నిర్వహిస్తారు.

జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులపై

మొదటి హక్కు రాష్ట్రానికే

మేం మొదట జప్తు చేసిన ఆస్తులను ఈడీ తిరిగి ఎలా జప్తు చేస్తుంది?

- ఇది ఎంత వరకు సమంజసమో తేల్చండి
- అగ్రిగోల్డ్ డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఈ విషయంలో ప్రభుత్వ అధికారాన్ని ఎవరూ నిరోధించలేరు
- ఈడీ చర్యలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం
- డిపాజిటర్లకు ఇప్పటికే రూ.900 కోట్లు చెల్లించాం
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- తదుపరి విచారణ 31కి వాయిదా



సాక్షి, అమరావతి : జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వానికే మొదటి హక్కు అని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. డిపాజిటర్ల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకే ఆస్తులపై రెండు దర్యాప్తు సంస్థల జప్తు ఉత్తర్వుల వల్ల డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్నారు. ఆస్తులను విక్రయించి డిపాజిటర్లకు ప్రయోజనం చేకూర్చాలన్న ప్రభుత్వ ప్రయత్నాల్లో తీవ్ర జాప్యం జరిగి బాధితులు నష్టపోతారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులను తిరిగి మనీ లాండరింగ్ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేయడం ఎంత వరకు సమంజసమో తేల్చాలని కోర్టును అభ్యర్థించారు. మనీలాండరింగ్, దివాలా చట్టాల కింద చేసిన జప్తులకు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన జప్తునకు మధ్య వైరుధ్యం లేదని తెలిపారు. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అగ్రిగోల్డ్ ఎగవేసిన మొత్తాలను తిరిగి చెల్లిస్తోందని నివేదించారు. రూ.20 వేలు, అంతకన్నా తక్కువ డిపాజిట్లు చేసిన వారికి ఇప్పటికే రూ.900 కోట్ల మేర తిరిగి చెల్లించినట్లు చెప్పారు. మనీలాండరింగ్, దివాలా చట్టాలు డిపాజిటర్ల పరిరక్షణకు ఉద్దేశించినవి కావని చెప్పారు. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఈడీ గానీ, బ్యాంకులు గానీ నీరుగార్చలేవని అన్నారు. అగ్రిగోల్డ్ డిపాజిట్ల కుంభకోణంలో నిందితులు వారిని వారు రక్షించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో జప్తు చేసిన ఆస్తులను వేలం వేసి డిపాజిటర్లకు తిరిగి చెల్లించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని ఇతర ఏ దర్యాప్తు సంస్థా నిరోధించలేదని తేల్చి చెప్పారు. ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర ఉందని చెప్పారు.

అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి కొన్న తమ ఆస్తులను ఈడీ జప్తు చేయడాన్ని సవాలు చేస్తూ ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే బ్యాంకులు నిర్వహించిన వేలంలో కొన్న అగ్రిగోల్డ్ ఆస్తులను కూడా ఈడీ జప్తు చేయడాన్ని సవాలు చేస్తూ మరికొన్ని కంపెనీలు, వ్యక్తులు, కుంభకోణానికి ముందే అగ్రిగోల్డ్ నుంచి కొన్న భూముల్లో నిర్మించుకున్న అపార్ట్‌మెంట్లను సైతం సీఐడీ జప్తు చేయడాన్ని సవాలు చేస్తూ ప్లాట్ల యజమానులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కొద్ది రోజులుగా విచారణ జరుపుతున్నారు. గురువారం జరిగిన విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్‌కు మించి సౌకర్యాలు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో నవజాత శిశు వైద్య విభాగాలు ప్రారంభం



ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయూ వార్డులను పరిశీలిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా లేని అత్యాధునిక వైద్య సదుపాయాలను ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులోకి తెస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు విభాగంలో రూ.5.53 కోట్లతో ఏర్పాటు చేసిన నవజాత శిశు వైద్య విభాగాలు ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్), ఎన్ఐసీయూ (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లను గురువారం మంత్రి ప్రారంభించారు. ప్రసూతి విభాగంలో ఇప్పటికే 250 పడకలు అందుబాటులో ఉండగా.. అదనంగా 40 పడకలను నవజాత శిశు వైద్యం కోసం అందుబాటులోకి తెచ్చినట్టు మంత్రి తెలిపారు. తక్కువ బరువు, కామెర్లు వంటి అనారోగ్య కారణాలతో అప్పుడే పుట్టిన శిశువులకు అత్యవసర విభాగ అవసరాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.5.53 కోట్లతో ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ఎస్ఎన్‌సీయూలు, ఎన్ఐసీయూలు అందుబాటులో ఉన్నాయని, వాటికి అదనంగా రూ.31.51 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా మరో 12 అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇక్కడి ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులను సైతం త్వరలో ప్రారంభిస్తామని రజిని తెలిపారు. కాగా, రాజీవ్‌నగర్‌లోని ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాలకు పెద్దపీట

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ పాలకమండలి నిర్ణయించింది. క్యాడర్ స్ట్రెంత్ సర్దుబాటుతో ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా తగిన విధానాన్ని రూపొందించాలని తీర్మానించింది. విజయవాడ ఆర్టీసీ భవన్‌లో గురువారం పాలకమండలి సమావేశం జరిగింది. కొత్తగా 1,500 బస్సులను కొను గోలు చేయడంతోపాటు 100 ఈ–బస్సు లను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు కూడా సమావేశంలో నిర్ణయించారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఆమో దించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ మల్లి కార్జునరెడ్డి, ఎండీ సీహెచ్.ద్వారకా తిరు మలరావు, డైరెక్టర్ రాజీరెడ్డి పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పచ్చ మత్తులో జోగుతున్న ఈనాడు

- యువకుల మధ్య ఘర్షణకు వక్రీకరణ
- గంజాయి పేరుతో ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ఇరు వర్గాలు రాజీ అవడాన్ని పట్టించుకోని వైనం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దాన్ని ప్రభుత్వానికి అంటగట్టనిదే ఈనాడు రామోజీరావుకు నిద్రపట్టడం లేదు. శ్రీకాకుళం జిల్లాలో కొందరు వ్యక్తుల మధ్య ఆవేశకావేశాలతో జరిగిన ఘర్షణకు గంజాయే కారణమని, అది సర్కారు నిర్వాకమని వక్రీకరించింది. గంజాయి మత్తులో రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నట్టు అవాస్తవాలతో ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నించింది. 'గంజాయి రాజ్యంలో ముఠాల అరాచకం' శీర్షికన గురువారం దుష్ప్రచారానికి పూనుకుంది. వాస్తవాల్లోకి వెళితే.. శ్రీకాకుళంలోని దమ్మాలవీధికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబు ఈ నెల 23న రాత్రి 8.30 గంటలకు తన బైక్‌పై వెళుతూ మార్గం మధ్యలో కొందరు యువకులతో ఘర్షణ పడ్డారు. దిల్లేశ్వరరావు అనే వ్యక్తి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీనిపై తన బైక్‌కు దారి ఇవ్వమని రాంబాబు ఆ వేడుకల్లో ఉన్న యువకులను అడిగారు. దాంతో మాధవ్, దేవా, కార్తిక్ అనే యువకులతో రాంబాబుకు వాగ్వాదం మొదలై ఘర్షణకు దారితీసింది. దాంతో ఒకరిని ఒకరు నెట్టుకున్నారు. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఇరువర్గాల వారు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. దాంతో ఆ సామాజికవర్గ పెద్దలు వారి మధ్య రాజీ కుదిర్చారు. ఆ మేరకు రాంబాబు రాజీ లేఖను పోలీసులకు సమర్పించారు. ఆ లేఖను న్యాయస్థానానికి నివేదించి అనంతరం న్యాయస్థానం ఆదేశాలతో తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనను ఈనాడు వక్రీకరించి గంజాయి మత్తు లో ఘర్షణ జరిగిందంటూ దుష్ప్రచారం చేసి, చంద్రబాబుకు అనుకూల వాతావరణం సృష్టించాలని పచ్చపాతాన్ని ప్రదర్శించడం దారుణం.

అటవీ భూమిలో ఇళ్ల నిర్మాణంపై హైకోర్టులో పిల్

యథాతథస్థితి కొనసాగించాలన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి : అటవీ ప్రాంత పరిధిలోని 40 ఎకరాల భూమిని నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణం నిమిత్తం రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు అప్పగిస్తూ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, దగదర్తి తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుబట్టింది. ఆ భూమి విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, నెల్లూరు జిల్లా కలెక్టర్, కావలి ఆర్డీవో, దగదర్తి మండల తహసీల్దార్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ తదితరులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 2కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దగదర్తి, కొత్తపల్లి కౌరుగుంట గ్రామాల పరిధిలో ఉన్న 40 ఎకరాల అటవీ భూమిని గృహ నిర్మాణ సంస్థకు అప్పగిస్తూ తహసీల్దార్‌జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దగదర్తి గ్రామానికి చెందిన ఎం.రవీంద్రబాబు అలియాస్ రవీంద్ర నాయుడు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం ఏసీజే ధర్మాసనం విచారణ జరిపింది.

గుండె బరువైంది 'రామోజీ'కే

- జెన్‌కోకు బకాయిలంటూ ఈనాడు కథనంలో అన్నీ అవాస్తవాలే
- రాష్ట్ర డిమాండ్‌లో 45 శాతం విద్యుత్ ఏపీజెన్‌కో నుంచే
- జెన్‌కో నుంచి నెలకు సగటున రూ.900 కోట్ల బిల్లులు
- డిస్కంల ద్వారా క్రమం తప్పకుండా నెలవారీ చెల్లింపులు
- 'సింగరేణి'కి ఎలాంటి బకాయిలు లేవు
- స్పష్టం చేసిన ఏపీజెన్‌కో

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌లో 45 శాతం ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) సమకూరుస్తోంది. ఈ కరెంటు కొనుగోలు చేసిన ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నాయి. బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందీ లేదు. వచ్చిన ఇబ్బందల్లా ఈనాడుకి, ఆ పత్రిక యజమాని రామోజీకే. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ సంస్థలు జాతీయ స్థాయిలో అవార్డులను దక్కించుకుని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కుదేలైన డిస్కంలు కోలుకుంటున్నాయి. ఏపీ జెన్‌కో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇవన్నీ చూసి ఓర్వలేకపోతోంది ఈనాడు. దీంతో 'జెన్‌కో నెత్తిన బకాయిల బండ' శీర్షికతో గురువారం తప్పుడు కథనాన్ని అచ్చేసింది. తన అక్కసును వెళ్లగక్కింది. ఆ కథనంలోని గణాంకాలు వాస్తవం కాదని ఏపీ జెన్‌కో తెలిపింది. డిస్కంలకు విద్యుత్ సరఫరా చేసినందుకు జెన్‌కో నెలకు సగటున రూ.900 కోట్ల బిల్లులను పంపుతోంది. డిస్కంలు ఆ మొత్తాన్ని క్రమం తప్పకుండా ప్రతి నెలా జెన్‌కోకు చెల్లిస్తున్నాయి. ఆ సొమ్ముతో బొగ్గు సరఫరా చేసిన మహానది కోల్ ఫీల్డ్స్‌కు జెన్‌కో క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తోంది. బొగ్గు అందిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి బిల్ డిస్కౌంట్ విధానం ద్వారా అతి తక్కువ (7 శాతం) వడ్డీతో నిర్ణీత సమయానికి చెల్లింపులు జరుపుతోంది. బొగ్గు సరఫరాకు సంబంధించి 'సింగరేణి'కి ఏపీ జెన్‌కో ఎలాంటి బకాయిలు చెల్లించనవసరం లేదు. అలాగే ఏపీ జెన్‌కో ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్లు ప్రతినెలా యథావిధిగా ఇస్తోందని ఏపీ జెన్‌కో వెల్లడించింది. విద్యుత్ సంస్థలు, అందులోని ఉద్యోగులు బాగుండటం చూసి తట్టుకోలేక రామోజీ గుండె బరువైందేమో గానీ తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని స్పష్టం చేసింది.

ఎల్లో మీడియా రాతలు ఊహాజనితం

- ఆస్పత్రులకు కాలం చెల్లిన మందులు పంపడంలేదు
- వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో కాలం చెల్లుతున్న మందులే గతి అంటూ ఎల్లో మీడియాలో ప్రచురించిన కథనాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఖండించింది. ఈ కథనం పూర్తిగా ఊహాజనితమని ఏపీ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఎండీ మురళీధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నిరాధారమైన ఆరోపణ చేయడం సరికాదని చెప్పారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే దురుద్దేశంతో కథనం రాశారని అన్నారు. నెల క్రితం ఒంగోలు జీజీహెచ్‌కు 2 నెలల కాల వ్యవధి ఉన్న మందులను పంపి, వాటిని తీసుకోవాలని సిబ్బందిపై ఒత్తిడి చేయడం వంటి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తోసిపుచ్చారు. డబ్ల్యూహెచ్‌వో, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ) ప్రమాణాలున్న మందులను మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా 13 సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్)లకు సరఫరా చేస్తున్నామన్నారు. 6 నెలల కాలవ్యవధి ఉన్న మందులను సంబంధిత కంపెనీలకు సమాచారమిచ్చి, వాటి స్థానంలో అంతే పరిమాణంలో కొత్త స్టాక్ పొందుతున్నట్టు తెలిపారు. ఏదైనా కంపెనీ కొత్త స్టాక్ ఇవ్వకపోతే వారికి చెల్లించే బిల్లుల నుంచి రికవరీ చేస్తామన్నారు. అంతేకాకుండా 3 నెలల కాల వ్యవధి ఉన్న మందులను ఆస్పత్రులకు సరఫరా చేసేందుకు ఈ–ఔషధి పోర్టల్ అనుమతించదని స్పష్టం చేశారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 207 కోట్ల విలువైన మందులను కొనుగోలు చేస్తే 5 శాతం కాలం చెల్లినవి ఉన్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 483 కోట్ల విలువైన మందులను కొనుగోలు చేస్తే 0.85 శాతం మందులు మాత్రమే కాలం చెల్లినవి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ పేదలకి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

'మత్తు'.. గుట్టురట్టు

యథేచ్ఛగా మత్తు మందుల విక్రయాలు

- ఔషధ నియంత్రణ శాఖ అధికారుల సోదాలు
- గణపవరంలో బయటపడ్డ నిషేధిత ఔషధాలు
- పశ్చిమగోదావరి జిల్లాలోని పలు దుకాణాల్లో విక్రయిస్తున్నట్టు సమాచారం



గణపవరంలోని మెడికల్ షాపులో సోదాలు చేస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): ధనార్జనే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ మత్తు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలోని పలు మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్టు వారి సోదాల్లో బయటపడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత మందుల అమ్మకాలపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

చెక్ పెట్టేలా..

ఇటీవల భీమవరానికి వచ్చిన ఔషధ నియంత్రణ అధికారి అబిద్ అలీ మత్తు మందుల విక్రయాలను గుట్టురట్టు చేశారు. ఆయన పలు మందుల దుకాణాల్లో తనిఖీలు చేసి పెద్ద ఎత్తున మత్తు మందులు విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అధిక పరిమాణంలో మత్తు మందులను ప్రజలకు విక్రయిస్తున్నట్టు వీరి సోదాల్లో బయటపడింది. భీమవరం ప్రాంతంలో మెడికల్ షాపుల డేటా సేకరించి మత్తు మందుల మాఫియాకు చెక్ పెట్టేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిసింది.

భీమవరంలో ఏజెన్సీల ద్వారా..

భీమవరంలో కొన్ని మెడికల్ ఏజెన్సీల ద్వారా జిల్లాలోని మెడికల్ షాపులకు మత్తు మందుల సరఫరా జరుగుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లో సోదాలు, వారికి సరఫరా అవుతున్న మందులకు సంబంధించి డేటా సేకరిస్తే మత్తు మందుల మాఫియాకు చెక్ పెట్టవచ్చనే దిశగా ముందుకు సాగుతున్నారు.

నిబంధనలు పట్టించుకోకుండా..

గణపవరంలోని భాగ్యలక్ష్మి మెడికల్ షాపు ద్వారా భారీగా మత్తు మందులు విక్రయాలు జరిగినట్లు అబిద్ అలీ గుర్తించి ఏలూరు ఔషధ నియంత్రణ శాఖ ఏడీఏకు తెలియజేశారు. ఏలూరు అధికారులు గణపవరంలోని ఈ దుకాణంలో సోదాలు చేసి రెండేళ్లలో వేల సంఖ్యలో మందులు విక్రయించినట్టు గుర్తించారు. ఇంత పెద్ద సంఖ్యలో మత్తు మందుల అవసరం ఈ ప్రాంతంలో ఉంటుందా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. వ్యసనాలకు బానిసైన కొందరు యువకులు వీటిని వినియోగిస్తున్నట్టు అనుమానిస్తు న్నారు. ఒకవేళ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉన్నప్పటికీ కొద్దిరోజులకు మాత్రమే మత్తు మందులు వాడాలని సూచిస్తారని, అయితే వీటికి అలవాటు పడిన కొందరి బలహీనతను సొమ్ము చేసుకునేలా మెడికల్ షాపుల యజమానులు మత్తు విక్రయాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

కఠిన చర్యలు

గణపవరంలో భాగ్యలక్ష్మి మెడికల్ షాపు ద్వారా అధిక మొత్తంలో మత్తు మందులు విక్రయాలు జరిగినట్లు గుర్తించాం. ఈ షాపు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి జిల్లాలోని మెడికల్ షాపుల్లో ఎప్పటికప్పుడు సోదాలు నిర్వహిస్తూ వారి డేటాను పరిశీలిస్తూ మత్తు మందు విక్రయాలు అధికంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

–సీహెచ్ హరిప్రసాద్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీఏ



పలమనేరు నియోజకవర్గం, గంగవరం మండలం, మారేడుపల్లికి చెందిన రవికుమార్‌కు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి నుంచి వివిధ రకాల పంటలు సాగుచేశారు. అయినా ఫలితంలేదు. పదేళ్లుగా ఇదే పరిస్థితి. నాలుగు నెలల క్రితం టమాట సాగువైపు మొగ్గుచూపారు. నాటి నెలన్నర నుంచి పంట దిగుబడి చేతికొచ్చింది. అప్పటి నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతుండడంతో సంబరపడ్డాడు. ఆపై రేటు అమాంతంగా పెరగడంతో అతని సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. కిలో టమాట రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయించాడు. మొత్తం రూ.48 లక్షల వరకు ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంత ఆదాయం చూడలేదని, ఇప్పటిదాకా ఉన్న అప్పులు తీర్చేశానని చెబుతున్నాడు.



శ్రీకాళహస్తి మండలం, టీఎంవీ కండ్రిగకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి గతంలో క్రమంతప్పకుండా వరి సాగుచేసేవారు. తెగుళ్లు, మందులతో విసిగిపోయేవారు. పెట్టుబడి కూడా వచ్చేది కాదు. దిగుబడి వచ్చినా సరైన గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొనేవారు. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి. మూడు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఆ వైపు మొగ్గుచూపారు. నెల్లూరు నుంచి బ్రాండెడ్ బెండ గింజలు, గోరుచిక్కుళ్లు, కాకరకాయ గింజలు తెచ్చి 40 సెంట్లలో సాగుచేశారు. నెలకంతా కోతకొచ్చాయి. కిలో రూ.50 లెక్కన హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించారు. సుమారు రూ.4 లక్షలకుపైగా ఆదాయం గడించారు. ప్రస్తుతం బెండ రేటు తగ్గిందని, గోరు చిక్కుళ్లు కిలో రూ.60 వరకు పలుకుతున్నాయని తెలిపారు. వరి, వేరుశనగ, చెరుకు కన్నా కూరగాయల సాగు మేలని, ఎంత కష్టపడితే అంత ఆదాయం పొందవచ్చని అంటున్నారు.

ఉప్పొంగిన ఉద్యానం!

ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతాంగం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన సాగువిస్తీర్ణం
- టమాటతో అధిక ఆదాయం
- కూరగాయలతో ఆశించిన ఫలితం
- ఆరోగ్యం దృష్ట్యా పెరిగిన వినియోగం
- కలిసివస్తున్న ప్రభుత్వ రాయితీ




ఉమ్మడి జిల్లా సమాచారం

సాధారణ సాగు విస్తీర్ణం 1,56లక్షల హెక్టార్లు

ఆకుకూరల	342
క్యాబేజీ	116
క్యాలీఫ్లవర్	171
పొటాటో	368
క్యాప్సికమ్	38
టమాట	5,030
మిరప	928
వంగ	350
బెండ	260
బీన్స్	614
కాకర	310
ఉల్లిగడ్డ	450
సొర	150
బీర	170





సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 75 శాతం మంది వ్యవసాయాధారంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమకున్న పొలంలో వరి, వేరుశనగ, చెరుకు, మామిడితోపాటు ఇతర ఉద్యానపంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఎక్కువగా వరి సాగుచేస్తుండగా.. చిత్తూరు జిల్లాలో అధికంగా ఉద్యానపంటలైన టమాట, చెరుకు, ఇతర కూరగాయల పంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెన్నై, బెంగళూరు మహానగరాలు సమీపంలోనే ఉండడంతో కూరగాయలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. రైతులు తమ పంటను ఆయా ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

ఆహారాన్ని మార్చేసిన కరోనా

కరోనా నుంచి కోలుకున్న తర్వాత ప్రజలు ఆహార అలవాట్లు మార్చుకున్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం కోసం అన్వేషణ ప్రారంభించారు. దీనికోసం సంపాదనలో సగం వరకు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడడంలేదు. ఇందులో ఎక్కువ శాతం మంది శాఖాహారాన్నే ఇష్టపడుతున్నారు. వివిధ రకాల కూరగాయలతో కూడిన భోజనాన్ని తీసుకుంటున్నారు. ఫలితంగా గత రెండేళ్లుగా కూరగాయాల వినియోగం అనూహ్యంగా పెరిగింది. మార్కెట్లో కూరగాయాలకు డిమాండ్ ఏర్పడింది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం అంతకంతకూ పెరుగుతోంది. వరి, వేరుశనగ, చెరుకు సాగు చేసే రైతులు ఉన్న పొలంలో కొంత ఉద్యాన పంటల సాగుకు కేటాయిస్తున్నారు. అందుకు నిదర్శనం ప్రస్తుతం సాగు విస్తీర్ణమే. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి మినహా 23,091 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయల పంటలు సాగుచేయడమే.

కూరగాయలకు భలే డిమాండ్

గత నాలుగు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏది ఎత్తుకున్నా కిలో రూ.80కిపైగా పలుకుతోంది. గతంలో రైతులు హోల్‌సేల్‌గా మార్కెట్‌కు తరలించేవారు. అయితే ఇటీవల ఆశించిన స్థాయిలో ధరలు ఉండడం.. వ్యాపారులు ఒకటికి సగానికి అడుగుతుండడంతో రైతులే వ్యాపారులుగా మారుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వారపు సంతల్లో కూరగాయలు విక్రయిస్తూ అధిక రాబడి పొందుతున్నారు.

జాక్‌పాట్ కొట్టిన టమాట రైతు

ఇటీవల కాలంలో టమాటకు భారీ డిమాండ్ ఏర్పడింది. కర్ణాటక, చెన్నై, ఉత్తర భారతదేశంలోని కొన్ని నగరాల్లో టమాట ఉత్పత్తి తగ్గడం ఇక్కడి రైతులకు కలిసివచ్చింది. అక్కడి వ్యాపారుల రాక పెరిగింది. గతంలో నష్టాలు రావడం.. తెగుళ్ల బెడదతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గడం కూడా టమాట రైతుకు అనుకూలంగా మారింది. నాలుగు నెలల నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతోంది. గత నెలన్నర నుంచి కిలో రూ.100పైమాటే. కొందరు రైతులు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఆర్జించారంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో సాధారణ పంటల స్థానంలో టమాట విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. పలమనేరు, గంగవరం, కుప్పం, నగరి, చిత్తూరు, పుంగనూరు, సోమల, సదుం, చంద్రగిరి మండలాల్లో ఎక్కువగా టమాట సాగుచేస్తున్నారు. ఇటీవల కిలో చికెన్ రూ.200 పలకగా.. అదే స్థాయిలో టమాట ధర పలకడం గమనార్హం.

కూరగాయల తోటతో లాభాలు



నాకు మూడెకరాల పొలం ఉంది. గత ఏడాది వరకు సగం పొలంలో వరి, మరో సగం పొలంలో వేరుశనగ సాగుచేసేవాడిని. ఆ పంటలు సాగుకు ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ. ఇప్పుడు ఆ మూడెకరాల్లో ఎకరం బెండ, ఎకరం గోరుచిక్కుడు, మరో ఎకరం పొలంలో బీర సాగుచుశా. పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక లాభాలు వస్తున్నాయి. రోజూ 400 కిలోల కూరగాయలు దిగుబడి వస్తున్నాయి. కిలో బెండ రూ.50 చొప్పున విక్రయిస్తున్నాను. కేవలం బెండలోనే రోజూ రూ.20 వేలు చేతికొస్తోంది. ఇదే మాదిరిగా గోరుచిక్కుడు, బీర సైతం మంచి దిగుబడి వస్తోంది.

– మునిరత్నం నాయుడు, కోనప్పగుంట గ్రామం, పుత్తూరు మండలం

సాగువిస్తీర్ణం పెరుగుతోంది



ప్రస్తుతం రైతులు ఎక్కువగా ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. పండించిన పంటను రైతులే విక్రయించేందుకు ప్రోత్సహిస్తున్నాం. షెడ్లు, దుకాణాలు, మిషనరీల కోసం 40 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన మొక్కలు కూడా అందిస్తున్నాం.

– దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943